అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 19-11-2024
సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 10 సంచిక : 270
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar
12 పేజీలు వెల : 6.50

నవతెలంగాణ

మంగళవారం 19 నవంబరు 2024

అమీన్‌పూర్‌లో మళ్లీ హైడ్రా

- కూల్చివేతలకు దూసుకొస్తున్న బుల్డోజర్లు
- అక్రమ నిర్మాణాల తొలగింపు



నవతెలంగాణ-అమీన్‌పూర్

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో హైడ్రా కూల్చివేతలు మళ్లీ మొదలయ్యాయి. అక్రమ కట్టడాలపై హైడ్రా బుల్డోజర్లు దూసుకొస్తున్నాయి. వారం కిందట నాగారంలోని పలు అక్రమ కట్టడాలను నేలమట్టం చేసిన హైడ్రా అధికారులు.. తాజాగా హైదరాబాద్ శివారు సంగారెడ్డి జిల్లా అమీన్‌ఫూర్‌లో కూల్చివేతలు చేపట్టింది. వందనపురి కాలనీలో 848 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది. రహదారిని ఆక్రమించి నిర్మించిన భవనాలను హైడ్రా అధికారులు కూల్చేస్తున్నారు. అక్రమ కట్టడాలపై నోటీసులు ఇచ్చినా.. ఎటువంటి స్పందనా లేకపోవటంతో అధికారులు సోమవారం కూల్చివేతలు చేపట్టారు. భారీ యంత్రాలతో అక్రమ నిర్మాణాలను కూల్చేశారు. అక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పెద్ద ఎత్తున పోలీసులను మోహరించి అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నారు.

ఆరు గ్యారంటీల అమలులో రేవంత్ డకౌట్

- కేసీఆర్ ఫాంలోకి వస్తారు.. కప్ మనదే..
- అమరవీరుల స్మారక క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు



నవాతెలంగాణ-తుర్కయంజాల్

ఆరు గ్యారంటీల అమలులో సీఎం రేవంత్ రెడ్డి డకవుట్ అయ్యారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫుల్ ఫాంలోకి వస్తారు..రాబోయే రోజుల్లో కప్ మనదే అని అన్నారు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీ లోని జేబీ గ్రౌండ్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాధవరం నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ అమరవీరుల స్మారక క్రికెట్ టోర్నమెంట్(తెలంగాణ చాంపియన్స్ ట్రోఫీ) ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. విజేతలకు హరీశ్‌రావు బహుమతులు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరవీరులను స్మరించుకునే ఆలోచన చేసింది ఒక బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు. అమరుల ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఉద్యోగం, రూ10 లక్షలు అందజేసిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. పదేండ్లలో అన్ని రంగాల్లోనూ తెలంగాణను మాజీ సీఎం కేసీఆర్ నెంబర్ వన్‌గా తీర్చిదిద్దితే.. సంవత్సరంలోనే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని పదేండ్లు వెనక్కు తీసుకెళ్లారని విమర్శించారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా.. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టి రేవంత్ రెడ్డి హిట్ వికెట్ అయ్యారని విమర్శించారు. బీఆర్ఎస్ పేదల పక్షాన పోరాడుతుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వైఎస్ఆర్ ప్రారంభిస్తే.. కేసీఆర్ కొనసాగించారని తెలిపారు. కేసీఆర్ సంవత్సరానికి రూ.2 వేల కోట్ల చొప్పున పదేండ్లు రూ. 20 వేల కోట్లు విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేశారన్నారు. ధాన్యం కొనుగోళ్లు జరగక.. రైతులు ఆగమాగం అవుతున్నారని అన్నారు. కేటీఆర్ ఐటీ రంగాన్ని ఎంతో అభివృద్ధి చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు.

రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ కప్పు గెలుస్తుందని, కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తారని జోస్యం చెప్పారు. విద్యార్థులు సోషల్ మీడియాను తగ్గించి ఆటలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతోపాటు మానసిక వికాసం ఏర్పడుతుందన్నారు. మూసీ ప్రక్షాళన చేసిందే కేసీఆర్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, హైదారాబాద్ క్రికెట్ అసోసియేషన్ చైర్మెన్ జగన్ మోహన్ రావు, రాష్ట్ర కార్పొరేషన్స్ మాజీ చైర్మెన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, విప్లవ్ కుమార్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి, జిల్లా రైతుబంధు మాజీ చైర్మెన్ వంగేటి లక్ష్మారెడ్డి, బ్యాంక్ డైరెక్టర్ సామ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానానికి మరో నిదర్శనం పుస్తకం

- విద్యార్థులు పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలి : రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డాక్టర్ రియాజ్



నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యార్థులు పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలని, జ్ఞానానికి మరో నిదర్శనం పుస్తకం అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డాక్టర్ రియాజ్ అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సోమవారం నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్ వాసు ఆధ్వర్యంలో పిల్లల పుస్తక ప్రదర్శనను చైర్మెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయం ఒక దేవాలయం వంటిదని.. ప్రతి పుస్తకం అపారమైన జ్ఞానాన్ని అందిస్తుందని చెప్పారు. విద్యార్థి దశ నుంచి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, పుస్తకం మంచి స్నేహితుని వలే అండగా ఉంటుందని అన్నారు. నేటి ఆధునిక సమాజంలో చిన్నారులు సెల్‌ఫోన్ వాడకానికి అలవాటు పడి చెడు సావాసాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పుస్తకం, దాని విలువలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలని సూచించారు.

గ్రంథాలయాలను అభివృద్ధి చేసి విద్యార్థులకు పుస్తకాలు అందుబాటులో ఉండే విధంగా చూస్తామని తెలిపారు. పుస్తక పఠనం, వార్తాపత్రికలు చదవడంతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని, నిరంతరం అక్షర జ్ఞానం వైపు అడుగులు వేయాలని సూచించారు. చినిగిన చొక్కా అయినా వేసుకో.. కానీ మంచి పుస్తకం కొనుక్కో అని.. ఊరికే అనలేదని, బాహ్య సౌందర్యం కంటే పుస్తక పఠనం ద్వారా అంతర్గత సౌందర్యాన్ని పెంపొందించుకొని తమ లక్ష్యాలను సాధించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రతినిధి బుచ్చిరెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శోభన్ నాయక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, నవతెలంగాణ మేనేజర్ కృష్ణారెడ్డి, సిబ్బంది ధనలక్ష్మి, సిద్దు, సుభాషిని, రఘు, కాశి పాల్గొన్నారు.

ప్రజలను స్వేచ్ఛగా బతకనివ్వండి

బలవంతపు భూసేకరణకు హక్కు లేదు

- అక్రమ అరెస్టులు ఆపాలి : జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్
- పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని డీజీపీ, సీఎస్‌లకు ఆదేశం
- ఫార్మా బాధిత గ్రామాల్లో పర్యటన
- కమిషన్ ఎదుట తమ గోడు వెల్లబోసుకున్న బాధితులు
- దాడులతో సంబంధం లేదని ఆవేదన
- పట్నం నరేందర్ రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా
- కస్టడీపై తీర్పు బుధవారానికి
- జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు మెయిల్‌లో ప్రజాసంఘాల ఫిర్యాదు
- లగచర్ల ఘటనలో పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డిపై వేటు



నవతెలంగాణ-కొడంగల్

బలవంతపు భూసేకరణ చేసేందుకు ఎవరికీ హక్కు లేదని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ స్పష్టం చేశారు. ఫార్మా భూ బాధిత గ్రామాల్లో నుంచి పోలీసులను తరలించి, ప్రజలను స్వేచ్ఛగా బతకనివ్వండని ప్రభుత్వానికి సూచించారు. అలాగే గిరిజన బిడ్డల అక్రమ అరెస్టులను వెంటనే ఆపాలని ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఫార్మా బాధిత గ్రామాలైన వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, రోటిబండ తండా గ్రామాల్లో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు పర్యటించారు. ఇటీవల కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులపై జరిగిన దాడి, అనంతరం అరెస్టులు, ఇతర పరిణామాలపై ఆయా గ్రామాల ప్రజలతో చర్చించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్టీ కమిషన్ ముందు ఫార్మా బాధితులు తమ గోడును వెల్లబోసుకున్నారు. తమ భూములను బలవంతంగా లాక్కుంటున్నారని, అధికారులపై దాడిలో తమకు ఎలాంటి సంబంధమూ లేదని, అన్యాయంగా తమ వారిని అరెస్టు చేశారని బాధితులు వాపోయారు. దాడిలో లేని వారిని కూడా అరెస్టు చేశారని, పలువురిని పోలీసులు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వారిని వెంటనే జైల్ నుంచి విడిపించి, న్యాయం చేయాలని కోరారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని ఎస్టీ కమిషన్ సభ్యులు హామీ ఇచ్చారు. అనంతరం ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్‌నాయక్ మీడియాతో మాట్లాడారు..

లగచర్ల ఘటనపై పది రోజుల్లో తమకు నివేదిక ఇవ్వాలని రాష్ట్ర డీజీపీ, సీఎస్‌లకు ఆదేశాలు జారీ చేశారు. నివేదిక ఇచ్చిన తర్వాతే ఏమి చేయాలో నిర్ణయించుకోవాలన్నారు. మార్కెట్ ధరలకు భూములను తీసుకుంటే ఎలాంటి అభ్యంతరం లేదని, ప్రభుత్వ ధరకు తీసుకుంటామంటే సరైంది కాదని తెలిపారు. భూమి తరతరాలుగా అభిమానంగా వస్తుందని, దానితో వారి జీవితాలు ముడిపడి ఉంటాయని అన్నారు. ఇక్కడ జరిగిన ఘటనలతో భయభ్రాంతులకు గురై గిరిజనులు ఊర్లు వదిలి పారిపోవడం బాధనిపిస్తుందన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.పది లక్షలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామంటున్నదని ప్రజలు చెబుతున్నారని తెలిపారు. రైతులు మాత్రం భూములు ఇవ్వబోమని చెబుతున్నారన్నారు. ప్రభుత్వం చెబుతున్నట్టు ఇక్కడ పరిస్థితులు లేవని ప్రజలు చెబుతున్నట్టుగానే ఇక్కడ పరిస్థితులు కొనసాగుతున్నాయన్నారు. ఇక్కడ ప్రజలు గ్రామాలు వదిలి పారిపోయారన్నారు. కొంతమంది నాయకులు వెనుక నుంచి రైతులతో ఈ తతంగం నడిపించినట్టు కొంత కనిపిస్తుందని చెప్పారు. గతంలో ఈ ప్రాంతంలో గొడవ జరిగిందని తెలిసినా కలెక్టర్ రక్షణ లేకుండా రావడం సరికాద న్నారు. ఇక్కడి రైతులపై రాత్రి సమయాల్లో వచ్చి ఇష్టం వచ్చినట్టు కొట్టి అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. అక్రమ అరెస్టులను వెంటనే ఆపాలని తెలిపారు.

> లగచర్లలో ఈ నెల 11న అధికారులపై జరిగిన దాడి ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ బృందంపై దాడి ఘటనలో ఉన్నతాధికారులపై
>
> **పరిగి డీఎస్పీ కరుణా సాగర్‌రెడ్డిపై వేటు**
>
> రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా పరిగి డీఎస్పీగా ఉన్న కరుణా సాగర్‌రెడ్డిపై వేటు వేసింది. డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పరిగి కొత్త డీఎస్పీగా శ్రీనివాస్‌ను నియమించింది.

'పట్నం' బెయిల్ పిటిషన్‌పై విచారణ, కస్టడీపై తీర్పు వాయిదా

లగచర్లలో కలెక్టర్‌పై దాడి ఘటనలో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణను వికారాబాద్ కోర్టు వాయిదా వేసింది. కొడంగల్ మేజిస్ట్రేట్ ఇచ్చిన రిమాండ్ ఆర్డర్‌ను క్వాష్ చేయాలని నరేందర్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ క్వాష్ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో బెయిల్ పిటిషన్ విచారణను వాయిదా వేస్తున్నట్టు వికారాబాద్ జడ్జి సోమవారం తెలిపారు. విచారణ వచ్చే సోమవారానికి వాయిదా పడింది. అలాగే, నరేందర్‌రెడ్డిని 7 రోజులు కస్టడీకి కోరుతూ పోలీసులు కొడంగల్‌లో వేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. దీనిపై వాదనలు విన్న కొడంగల్ కోర్టు తీర్పును బుధవారానికి వాయిదా వేసింది.

జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ప్రజాసంఘాల ఫిర్యాదు

లగచర్ల ఘటనపై సోమవారం జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆన్‌లైన్, మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో ప్రభుత్వం, పోలీసులపై ఫిర్యాదు చేసినట్టు వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య తెలిపారు. వీరు మీడియాతో మాట్లాడుతూ.. లగచర్ల ఘటనపై ఫిర్యాదు చేయగా.. కేసు నెంబర్ 9141/ఐఎన్/2024 కేటాయించినట్టు తెలిపారు. ఇప్పటికైనా ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలి

కార్మిక హక్కులను కాలరాస్తే సహించం : సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

- చర్లపల్లిలో ఎపిరాక్ ఎంప్లాయిస్ యూనియన్ 15వ వార్షికోత్సవం



నవతెలంగాణ - చర్లపల్లి

కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిందని, వాటిని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఎపిరాక్ ఎంప్లాయిస్ యూనియన్ 15వ వార్షికోత్సవంలో సోమవారం ఆయన పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం యూనియన్ ప్రధాన కార్యదర్శి బివి సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చుక్కా రాములు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయొద్దన్నారు. 15 సంవత్సరాలుగా సీఐటీయూ నాయకత్వంలో కార్మికులందరూ ఐకమత్యంతో మెరుగైన వేతన ఒప్పందాలు చేసుకుంటున్నట్టు చెప్పారు. కార్మికుల ప్రయోజనాలు కాపాడుకుంటూ, ఉత్పత్తిలో భాగమవుతూ, యజమాన్యంతో చర్చల ద్వారా సమస్యలను పరిష్కారం చేసుకుంటూ కార్మికుల హక్కులను కాపాడుతూ క్రమశిక్షణతో యూనియన్‌ను నడిపినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ, యజమానులకు అనుకూలంగా కొత్త కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. దీనివల్ల కార్మికుల నిజ వేతనాలు పడిపోతాయని, కార్మికుల సౌకర్యాలు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక కోడ్లను అఖిల భారత సమ్మెలతో ఇప్పటివరకు అమలు కాకుండా ఆపగలిగామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్మిక కోడ్లను అమలు చేయడంలో తొందరపడుతున్నదని, దీనిపై ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేనిచో భవిష్యత్‌లో సీఐటీయూ అగ్రభాగాన ఉంటూ కార్మికులందరినీ ఐక్యం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలకు పిలుపునిస్తుందని చెప్పారు.

> **కార్మికులందరూ ఏకం కావాలి**
>
> ఇప్పటికీ పర్మినెంట్ కార్మికులను తొలగిస్తూ.. కాంట్రాక్టు, ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిస్, అప్రెంటిస్ అనే పేర్లతో వేతనాలు లేకుండా కార్మికులకు ఎలాంటి చట్టాలూ అమలు కాకుండా చేస్తున్నారని సీఐటీయూ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు అనుకూలంగా కొత్త చట్టాలు తెస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో జరిగే పోరాటాల్లో కార్మికులంతా ఐక్యంగా భాగస్వాములు కావాలని కోరారు. కార్మికులు ఐకమత్యంగా ఉండి హక్కులను కాపాడుకోవాలన్నారు. మేడ్చల్ జిల్లాలో కార్మిక వర్గాన్ని ఏకం చేయాలన్నారు. కొద్దిమంది ప్రయోజనాలకే ఈ ప్రభుత్వాలు పని చేస్తున్నాయని చెప్పారు. కావునా భవిష్యత్ పోరాటాల్లో కార్మికులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ ఫౌండర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.గణేష్, యూనియన్ ఫౌండర్స్ ఆఫీస్ బేరర్స్ బి.వి.సత్యనారాయణ, నారాయణ, రాముడు, రాంబాబు, భాస్కర్, రఫీ, వి.శ్రీనివాస్, దుర్గాప్రసాద్, నాగార్జున, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.
>
> -సీఐటీయూ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.చంద్రశేఖర్

ఇందిర ఓ ఉక్కు మహిళ

- ఆమె జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నెహ్రూ నుంచి అందిపుచ్చుకున్న నాయకత్వ పటిమతో ఉక్కు మహిళ ఇందిరా గాంధీ దేశప్రజలకు ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దేశ తొలి మహిళా ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆమెకు నివాళులర్పించారు. 'జాతీయ సమైక్యతా దినోత్సవం' సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పేదలు, మహిళల అభ్యున్నతికి ఇందిరమ్మ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. 'భారతీయ శక్తికి మహిళలే ప్రతీకలు' అన్న ఇందిరా గాంధీ మాటల స్ఫూర్తితో తెలంగాణ ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యతను ఇస్తోందని ఆయన తెలిపారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడం ఇందిరమ్మ రాజ్యం లక్ష్యాల్లో ఒకటని తెలిపారు.ఆమె జయంతి రోజునే 22 జిల్లాల్లో నూతనంగా నిర్మించబోయే ఇందిర మహిళా శక్తి భవనాలకు భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామని గుర్తు చేశారు. దేశ చరిత్రలో తొలిసారి నాలుగు వేల మహిళా సంఘాలతో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం ప్రజాప్రభుత్వ ఘనతేనని అన్నారు.

'ర్యాగింగ్'లో మలుపులు

- ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో త్రీమెన్ కమిటీ విచారణ
- విద్యార్థికి గుండు గీయించడంపైనే చర్చ
- ప్రిన్సిపల్, స్టాఫ్ మధ్య అంతర్గత పోరే కారణమా?
- అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను బలిపెట్టే వ్యూహమా..?



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ ఖమ్మం

ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ వ్యవహారం మలుపులు తీసుకుంటోంది. ప్రథమ సంవత్సరం విద్యార్థికి గుండు కొట్టించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. 12వ తేదీన చోటుచేసుకున్న ఘటన 16వ తేదీ వరకు వెలుగుచూడకపోవటం వెనుక అనేక అనుమానాలు ఉన్నాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థి మోడ్రన్ కటింగ్ (చెవుల పైకి హెయిర్ కట్) చేయించుకొని రావడంతో హాస్టల్‌లోని సీనియర్లు హేళన చేశారు. సాధారణ కటింగ్ చేయించుకోవాలని ఒత్తిడి తెచ్చారు. ఆ మేరకు కటింగ్ చేయించుకున్నా సంతృప్తి చెందలేదు. ఈ నేపథ్యంలో యాంటి ర్యాగింగ్ కమిటీ ఇన్‌చార్జి, నైట్ మానిటరింగ్ విధుల్లో ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ రెహమాన్ బయటకు వెళ్లే సమయంలో తనతో పాటు బాధిత విద్యార్థిని తీసుకుని వెళ్లారు. స్థానికంగా ఉన్న ఓ సెలూన్ షాప్ వద్ద డ్రాప్ చేశారు. ఈ కారణంతో అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను బాధ్యున్ని చేస్తూ ఆయనపై చర్యలు తీసుకునే దిశగా ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు ముందుకెళ్తున్నారని సమాచారం. దీనిలో భాగంగా కళాశాలలో ముగ్గురు అధ్యాపకులను త్రీమన్ కమిటీగా నియమించి సోమవారం విచారణ చేపట్టారు. అసలు ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులను వదిలివేసి.. అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను బాధ్యున్ని చేయటం వెనుక అనేక అనుమానాలు ఉన్నాయి.

అంతర్గత విభేదాలే కారణమా?

ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, స్టాఫ్ మధ్య అంతర్గత విభేదాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇవే.. ఈ వ్యవహారాన్ని మరింత జఠిలం చేశాయనే చర్చ జరుగుతోంది. ప్రిన్సిపాల్‌కు అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా మరికొందరు సిబ్బంది నడుచుకుంటారని సమాచారం. ప్రిన్సిపాల్‌తో పొసగక పోవడమా? లేక ర్యాంగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకుంటే తన పర్యవేక్షణా లోపాలు ఎక్కడ బయటపడతాయోననే ఆందోళనా.. తెలియదు కానీ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కొన్ని విషయాలను కప్పిపెడుతున్నారనే చర్చ ఉంది. ఈ అంశంపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) నుంచి ఓ కమిటీ వేసి విచారణ చేయిస్తేనే అసలు నిజాలు వెలుగు చూస్తాయని కొందరు సిబ్బంది అంటున్నారు.

డ్రాప్ చేయటం తప్పెలా అవుతుంది?

ర్యాగింగ్ అంశంపై ప్రిన్సిపాల్ మీడియాతో మాట్లాడుతుండగా అక్కడే ఉన్న డాక్టర్ రత్నాకర్.. 'ఆ రోజే ములుగు జిల్లా నుంచి వచ్చి జాయిన్ అయిన విద్యార్థికి ఖమ్మంలోని సెలూన్‌లు ఎక్కడుంటాయో తెలియదు కాబట్టి అసిస్టెంట్ ప్రొఫెసర్ డ్రాప్ చేసి ఉంటారని, అంతమాత్రానికే అతనిది తప్పెలా అవుతుందని' ప్రశ్నిస్తూ కనిపించారు. అదే క్రమంలో ప్రిన్సిపాల్ త్రీమెన్ కమిటీ విచారణలో అసిస్టెంట్ ప్రొఫెసరే తప్పు చేసినట్టు నిర్ధారణైందని వెల్లడించడం గమనార్హం. మెడికల్ కళాశాలలో స్టూడెంట్ వెల్ఫేర్ కోసం మొత్తం 14 రకాల కమిటీలు ఉంటాయి. వీటిలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఒక్కటి.

ఈ కమిటీలో కళాశాల సిబ్బందితో పాటు లాయర్, సీఐ కూడా సభ్యులుగా ఉన్నారు. అయితే సోమవారం విచారణ జరిపిన కమిటీలో మెడికల్ కళాశాలలోని వివిధ విభాగాల హెచ్‌ఓడీలు రవి, సరిత, రాజు ఉన్నారు. వీరి విచారణలో అసిస్టెంట్ ప్రొఫెసరే ఈ ఘటనకు బాధ్యునిగా తేటతెల్లం అయినట్టు ప్రిన్సిపల్ తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు రిపోర్టు పంపించామని, ఆ రాత్రికో.. రేపో.. సస్పెన్షన్ ఆర్డర్లు రావచ్చని స్పష్టం చేశారు. బాధిత మెడికో చెప్పిన అంశాలనే రిపోర్టులో పొందుపరిచామని అన్నారు. ఆ విద్యార్థి అసిస్టెంట్ ప్రొఫెసరే తనకు గుండు గీయించినట్టు త్రీమెన్ కమిటీకి చెప్పారని ప్రిన్సిపాల్ అంటున్నారు.

చెరువులను కబ్జా చేస్తే చర్యలు

- హైడ్రా కమిషనర్ రంగనాథ్
- చందానగర్‌లో పర్యటన



నవతెలంగాణ-చందానగర్

చెరువులను కబ్జా చేస్తే చర్యలు తప్పవని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్‌లో ఆయన పర్యటించారు. ఇటీవల హైడ్రా కమిషనర్ చెరువుల సుందరీకరణపై బెంగుళూరులో పర్యటించిన నేపథ్యంలో అక్కడ లేక్ మెన్ ఆఫ్ ఇండియా, ఆనంద్ మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన చెరువుల సుందరీకరణ పనులను పరిశీలించారు. అదే స్ఫూర్తితో వారి ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చేపట్టిన భక్షుకుంట, రేగులకుంటలను సుందరీకరణ చేసిన తీరుపై ఫౌండేషన్ ప్రతినిధులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో సుందరీకరణ మాటున కొంతమంది బిల్డర్లు కాలనీ కమ్యూనిటీ స్థలం ఎకరం 20 గుంటలు కబ్జా చేశారని, అలాగే చెరువు సుందరీకరణ వల్ల మురుగు నీరు కాలనీని ముంచెత్తుతున్నదని, కలుషిత నీటితో చర్మ వ్యాధులు సంక్రమిస్తున్నాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. హైడ్రా పరిధి మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. అంతకు ముందు భక్షుకుంట చెరువును పరిశీలించగా అక్కడ కొంతమంది షెడ్లు వేసిన నిర్మాణదారులు వ్యర్థాలను చెరువులోకి వదులుతున్నట్టు కమిషనర్ దృష్టికి రాగా వారు వ్యర్థాలు వదలకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎం ఆదేశాల మేరకు నగరంలోని అన్ని చెరువులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, డీఈ నళిని, ఏఈ పావని, హైడ్రా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోడీజీ ఎరుపంటే ఎందుకంత భయం?

మీ రక్తం ఎరుపే కదా : మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాని నరేంద్ర మోడీకి ఎరుపంటే ఎందుకంత భయం అని తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రశ్నించారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు సోమవారం మంత్రి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పొరుగున ఉన్న బల్లార్షా, చంద్రపూర్, రజురా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సహచర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి విస్తృతంగా పర్యటించారు. రజురాలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని కాంక్షిస్తూ భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే సుభాష్ దోటేను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. బీజేపీ కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను మంత్రి సీతక్క ఎండగట్టారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఎరుపు రంగు కవర్‌తో ఉన్న రాజ్యాంగ పుస్తకాన్ని చూపిస్తే ప్రధానికి భయం దేనికని ప్రశ్నలు సంధించారు. ప్రధాని నరేంద్ర మోడీ రక్తం కూడా ఎరుపు రంగులో ఉందనీ, ఎరుపు రంగు అంటే బెదిరిపోవాల్సిన అవసరం లేదన్నారు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అందరికీ జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కు, మత స్వేచ్ఛను కల్పించిన రాజ్యాంగాన్ని మార్చడం అంటే ప్రజలు జీవించే హక్కును కాలరాయడమేనని విమర్శించారు. అందుకే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్న సందేశంతో రాహుల్ గాంధీ రాజ్యాంగ రక్షణ యాత్ర చేస్తుంటే మోడీ, బీజేపీ నేతలు తట్టుకోలేకపోతున్నారని సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఆమె కోరారు.దేశానికి, మహారాష్ట్రకు బీజేపీ ప్రమాదకారిగా మారిందని హెచ్చరించారు. కుటుంబాల ను, పార్టీలను, సమాజాన్ని చీలుస్తూ విధ్వంస రాజకీయాలకు బీజేపీ పాల్పడుతున్నదని వెల్లడించారు. కులం, మతం, వర్గం పేరుతో ప్రజలను విభజిస్తూ, అదానీ, అంబానీ, ప్రధాని కలిసి దేశాన్ని లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. దోపిడీ సొమ్మును ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పది సంవత్సరాల్లో కేంద్రంలో, మహారాష్ట్రలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు చేసిన మేలు శూన్యమని సీతక్క విమర్శించారు. రూ.400 ఉన్న వంటింటి గ్యాస్ సిలిండర్ ధరను రూ.1200 పెంచిన ఘనత బీజేపీ సొంతమని ఎద్దేవా చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటు తున్నాయని గుర్తు చేశారు. ప్రజల భారాలని గుర్తించిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నదని వెల్లడించారు. గృహిణుల వంటింటి భారాన్ని తగ్గించేం దుకు రూ.500కే సిలిండర్ ఇస్తున్నట్టు తెలిపారు. పంట రుణమాఫీ, 200 యునిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పంట బోనస్...ఇలా ఎన్నో పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నట్టు చెప్పారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ కూటమిని గెలిపిస్తే తెలంగాణ తరహాలోనే గ్యారెంటీలను అమలు చేస్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా, సరిహద్దులో గల మహారాష్ట్ర గ్రామాల అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 19-11-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 270
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar
12 పేజీలు | వెల : 6.50

ఢిల్లీ కాలుష్యంపై చర్యలకు జాప్యమా..? సుప్రీంకోర్టు ఆగ్రహం

వివరాలు 11లో



హింసకు అడ్డుకట్ట వేయండి

వెంటనే జోక్యం చేసుకోండి : మణిపూర్‌పై కేంద్రాన్ని కోరిన సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై సీపీఐ (ఎం) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రం తక్షణమే జోక్యం చేసుకొని, హింసకు అడ్డుకట్ట వేయాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడింది. శాంతి పునరుద్ధరణకు, మణిపూర్‌లోని అన్ని జాతుల వారి హక్కుల పరిరక్షణకు తీవ్రమైన కృషిని ప్రారంభించాల్సి ఉన్నదని తెలిపింది. మొదటి నుండీ రాష్ట్రంలో పరిస్థితి దిగజారడానికి ముఖ్యమంత్రి బీరేన్ సింగే కారణమని ఆరోపిం చింది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కానీ, అధికార పార్టీగా బీజేపీ కానీ ఆయనను తొలగించేందుకు నిరాకరించిందని, పదవిలో కొనసాగేందుకు అనుమ తించిందని ఆక్షేపించింది. రాష్ట్రంలో ప్రభుత్వం కానీ, పాలనా యంత్రాంగం కానీ పనిచేయలేని పరిస్థితి తలెత్తిం దని తెలిపింది. ఈ మేరకు సీపీఐ (ఎం) పొలిట్ బ్యూరో సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆ వివరాలు... మణిపూర్‌లో పరిస్థితి తీవ్ర రూపం దాల్చింది. జాతుల మధ్య హత్యలు, ప్రతి హత్యలతో హింస పెచ్చరిల్లింది. నవంబర్ 7వ తేదీ నుండి జరిగిన వివిధ ఘటనలలో 20 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అపహరణకు గురైన ఐదుగురు మహిళలు, చిన్నారుల మృత దేహాలు లభించడంతో లోయలో పరిస్థితి తీవ్ర రూపు దాల్చింది. మొదటి నుండీ పరిస్థితి ఈ విధంగా క్షీణించడానికి ముఖ్యమంత్రి బీరేన్ సింగే కారకుడు. కేంద్రం కానీ, రాష్ట్రంలోని అధికార బీజేపీ కానీ ఆయనను తొలగించలేదు సరికదా పదవిలో కొనసాగించింది. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని హింసకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది. రాష్ట్రంలో శాంతి పునరుద్ధరణకు, జాతుల హక్కుల పరిరక్షణకు రాజకీయ పరి ష్కారం సాధించే దిశగా కేంద్రం చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన అవసరం ఉంది.



కాల్చేస్తున్నారు...

మణిపూర్‌లో ఆగని హింస

భద్రతాదళాల తూటాలకు మరో నిరసనకారుడు మృతి

ఎమ్మెల్యేలతో రాష్ట్ర సీఎం బీరెన్ సమావేశం

ఇంఫాల్ / న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులకు అడ్డుకట్ట పడటం లేదు. ఆదివారం రాత్రి జిరిబామ్‌లో జరిగిన హింసలో భాగంగా పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒక నిరసనకారుడు చనిపోయాడు. చనిపోయిన వ్యక్తిని ఖుంద్రక్‌పామ్ అతౌబా (20)గా గుర్తించారు. కె. బిషన్ (26) అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఇదిలా ఉండగా.. రాష్ట్ర సీఎం ఎన్. బీరెన్ సింగ్.. సోమవారం సాయంత్రం ఆరుగంటలకు నాన్-కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సీఎం సమావేశానికి కాంగ్రెస్ నుంచి ఐదుగురిని మినహాయించి.. మిగతా అందరి ఎమ్మెల్యేలను ఆహ్వానించినట్టు బీజేపీ ఎమ్మెల్యే చెప్పారు.

జిరిబామ్ పట్టణంలోని వీధుల్లోకి చేరి నిరసనకారులు విధ్వంసం సృష్టించారు. అధికార బీజేపీతో పాటు కాంగ్రెస్ కార్యాలయాలపై దాడికి దిగారు. ఈ సమయంలో కాల్పుల ఘటన చోటు చేసుకున్నది. ప్రస్తుతమున్న అస్థిర పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు ఇంఫాల్ తూర్పు, ఇంఫాల్ పశ్చిమ జిల్లాల్లోని అన్ని విద్యా సంస్థల మూసివేతకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఈ రెండు జిల్లాల్లో కర్ఫ్యూ అమలులో ఉన్నది. అల్లర్లతో ప్రభావితమైన ఏడు జిల్లాల్లో అధికారులు ఇంటర్నెట్, మొబైల్ డేటా సర్వీసులను నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు కేసులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించిందని విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి. జిరిబామ్‌లో చోటు చేసుకున్న నవంబర్ 8న గిరిజన మహిళను సాయుధ బలగాలు చంపటం, 11న జరిగిన సీఆర్పీఎఫ్ పోస్ట్‌పై దాడి, పౌరుల ఇండ్లకు నిప్పుపెట్టి, చంపటానికి సంబంధించినవే. ఇక రాష్ట్రంలో 19 నెలలుగా కొనసాగుతున్న జాతిహింస సమస్యకు పరిష్కారం లభించక పోవటంపై మణిపూర్ ఆరెస్సెస్ శాఖ ఆందోళనను వ్యక్తం చేసింది. ఈ ఘర్షణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని ...11లో

21న లగచర్లకు వెళ్తాం

వామపక్ష నేతల పర్యటనను అడ్డుకోవద్దు



- సమస్యను పరిశీలించి పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తాం
- గ్రామాల్లో నిర్బంధాన్ని ప్రయోగించడం సరికాదు
- ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దు
- వ్యవసాయేతర భూములనే పరిశ్రమలకు తీసుకోవాలి
- 2013 చట్టం ప్రకారమే పరిహారమివ్వాలి
- భూసేకరణపై ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయం తగదు
- అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వికారాబాద్ జిల్లాలో ఫార్మా సంస్థ కోసం 1,375 ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. అందులో 600 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందనీ, మిగతాది రైతుల నుంచి సేకరించాలని నిర్ణయించిందన్నారు. ఇందుకు ప్రజాస్వామ్య పద్ధతిని పాటించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకెళ్లడం సరైంది కాదన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేయడాన్ని ఖండించారు. భౌతిక దాడి పరిష్కారం కాదన్నారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తే బాగుండేదని సూచించారు. కానీ లగచర్ల పరిసర గ్రామాల్లో నిర్బంధాన్ని ప్రయోగించడం, ఇంటర్‌నెట్‌ను బంద్ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రైతాంగానికి అండగా నిలబడేందుకు బాధిత కుటుంబాలను పరామర్శించడానికి ఈనెల 21న లగచర్లకు వామపక్ష నేతలు వెళ్తారని చెప్పారు. తమను వెళ్లనివ్వకుంటే లగచర్లకు పరిమితమైన ఆ సమస్యను రాష్ట్రవ్యాప్త సమస్యగా మారుస్తామన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల ...12లో



ప్రజల జీవనోపాధుల రక్షణకు

26న దేశవ్యాప్త నిరసన

- ప్రజాసంఘాల రాష్ట్ర సదస్సు తీర్మానం
- ప్రయివేటీకరణను ఆపాలంటూ పిలుపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రైతులు, కార్మికులు, సమస్త ప్రజల జీవనోపాధుల రక్షణకు ఈనెల 26న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ప్రజాసంఘాల రాష్ట్ర సదస్సు తీర్మానించింది. ఈ మేరకు అందరూ ఐక్యంగా కదలాలని విజ్ఞప్తి చేసింది. ప్రయివేటీకరణను అడ్డుకోవడం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చింది. సంయుక్త కిసాన్ మోర్చా, జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర పాలకుల కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాల మూలంగా దేశ ప్రజలు, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలు, ...10లో

ట్రిబుల్ ఆర్‌లో

ముందడుగు

ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఐఏఎస్ హరిచందన

డీపీఆర్ తయారీకి కన్సల్టెంట్

సర్కారు ఉత్తర్వులు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రీజినల్ రింగ్ రోడు (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టు నిర్మాణానికి సర్కారు కీలక చర్యలు తీసుకుంది. గత కొంతకాలంగా ఈ ప్రాజెక్టు విషయమై స్తబ్దత కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పలు నియామకాలు చేస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆర్ఆర్ఆర్ పరిపాలన అనుమతులు, ఇతర అంశాలు ఇక వేగంగా ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి దాసరి హరిచందనను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అలాగే ఆర్ఆర్ఆర్ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్), ఆర్థిక, సాంకేతిక ...11లో

30లోగా సమగ్ర కుటుంబ

సర్వే పూర్తి చేస్తాం



ఇప్పటి వరకు 58.3 శాతం పూర్తి

- అత్యధికంగా ములుగు జిల్లాలో 87 శాతం
- అత్యల్పంగా హైదరాబాద్‌లో 38.3 శాతం
- 2014 సర్వే ఫలితాలను త్వరలో వెల్లడిస్తాం : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఈ నెల30లోగా పూర్తి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో1,16,14,349 కుటుంబాలను గుర్తించామనీ, అందులో ఇప్పటి వరకు సగటున 67,72,246 కుటుంబాల సర్వేను పూర్తి చేశామని తెలిపారు. ఆ చొప్పున ఇప్పటి వరకు 58.3 శాతం సర్వే పూర్తయిందని వెల్లడించారు. అత్యధికంగా ములుగు జిల్లాలో 87.1 శాతం, అత్యల్పంగా హైదరాబాద్ జిల్లాలో 38.3 శాతం పూర్తయిందని తెలిపారు. రాష్ట్రంలోని కుటుంబాలు, గ్రామాలు, మండలాలు, డివిజన్లు, జిల్లాలకు భవిష్యత్‌లో కావాల్సిన అవసరాలు ఈ సర్వే ద్వారా తెలుస్తాయనీ, తద్వారా వాటి అమలుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సర్వేపై ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌తో పాటు విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. సమాచారం చెప్పటం వల్ల ఎవరికీ ప్రభుత్వ పథకాలు నిలిచిపోవనీ, కొత్తగా మరిన్ని పథకాలను అమలు చేసేందుకే సర్వేను నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో ప్రజలకు ఉపయోగపడే విధంగా, శాస్త్రీయంగా ...11లో



"మా ప్రభుత్వం మరోమారు అధికారంలోకి రానుంది. స్టాక్ మార్కెట్లు దూసుకెళ్తాయి. ఇప్పుడే షేర్లు కొనుగోళ్లు చేసుకోండి. ఆ తర్వాత ధరలు పెరిగిపోతాయి." అని లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ నేత అమిత్ షా వ్యాఖ్యలు చేశారు. కానీ ఎన్నికల ఫలితాల తర్వాత కొన్ని నెలలు సానుకూలంగా ట్రేడింగ్ అయినప్పటికీ.. గడిచిన రెండు నెలలుగా అనేక ప్రతికూలాంశాలతో దలాల్ స్ట్రీట్‌లో ఫలితాలు తారుమారయ్యాయి. మోడీ, అమిత్‌షా ప్రభుత్వాన్ని నమ్మి పెట్టుబడులు పెట్టిన లక్షలాది మంది ఇన్వెస్టర్లు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. షా హామీలకు భిన్నంగా గత రెండు నెలలుగా దలాల్ స్ట్రీట్ అమాంతం పడిపోతోంది.

మోడీషా దెబ్బ..

మునిగిన ఇన్వెస్టర్లు..మార్కెట్ల వరుస పతనం

- రూ.50 లక్షల కోట్లు ఫట్..లక్షల కోట్ల ఎఫ్ఐఐలు వెనక్కి
- ఆగని దలాల్ స్ట్రీట్ నష్టాలు

న్యూఢిల్లీ : లక్షల కోట్ల రూపాయాల ఇన్వెస్టర్ల సొమ్ము కరగిపోతోంది. అందులోనూ ముఖ్యంగా సాధారణ ఇన్వెస్టర్లు భారీ నష్టాలను ఎదుర్కొంటూ బోరుమంటున్నారు. గడిచిన ఒక్క నెలలోనే సెన్సెక్స్, నిఫ్టీలు ఏకంగా 10 శాతం పతనమయ్యాయి. అనేక కంపెనీల స్టాక్స్ 20, 30 శాతం మేర పడిపోయాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ)లు గడిచిన ఒక్కటిన్నర నెలలోనే రూ.1.20 కోట్ల తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. చివరి సారిగా 2008 ఆర్థిక సంక్షోభ సమయంలో సెన్సెక్స్ 40 శాతం పతనమయ్యింది. ఆ సమయంలో మొత్తంగా 15 బిలియన్ల ఎఫ్ఐఐలు తరలిపోగా.. గడిచిన ఏడు వారాల్లోనే ఆ స్థాయిలో విదేశీ పెట్టుబడులు వెనక్కి తీసుకోవడంతో భారత మార్కెట్లలోని ప్రమాద ఘంటికలు స్పష్టమవుతున్నాయి. గడిచిన నెలన్నర రోజుల్లోనే రూ.47 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరై.. బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.427 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. సెప్టెంబర్ 27న మార్కెట్ క్యాపిటలైజేషన్ రికార్డ్ స్థాయిలో రూ.474 లక్షల కోట్లుగా ఉంది. ఆ సమయంలో సెన్సెక్స్ 85,978, నిఫ్టీ 26,277 గరిష్ట స్థాయిలను తాకాయి.

దేశంలో అధిక ద్రవ్యోల్బణం, పట్టణ వినిమయం తగ్గడం, సెప్టెంబర్ త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల రెవెన్యూలో పతనం తదితర పరిణామాలు భారత స్టాక్ మార్కెట్లను అమాంతం పడేస్తున్నాయి. అధిక ద్రవ్యోల్బణం మధ్యతరగతి ప్రజల వాస్తవ ఆదాయాన్ని దెబ్బతీస్తున్నందున పట్టణ వినియోగం మరింత బలహీనపడుతుందని నెస్లే, ...11లో

ట్రంప్‌తో భంగం..

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ టారీఫ్‌ల పెంపు ప్రతిపాదనలు అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల సమతుల్యతకు భంగం కలిగిస్తాయని జెపి మోర్గాన్ ప్రతినిధి జహంగీర్ అజీజ్ పేర్కొన్నారు. వర్ధమాన దేశాల కరెన్సీలను బలహీనపర్చుతుందన్నారు. తద్వారా వ్యాపార విశ్వాసం దెబ్బతిననుందన్నారు. చివరిసారిగా 2018లో ట్రంప్ భారీ దిగుమతి సుంకాలను విధించినప్పుడు, చైనా వెంటనే తమ కరెన్సీని తగ్గించి, తమ ఎగుమతులను ఆసియా, లాటిన్ అమెరికన్ మార్కెట్‌లకు పెంచారని అజీజ్ గుర్తు చేశారు. చైనా ఈసారి కూడా అదే చర్యను పునరావృతం చేయవచ్చన్నారు. చైనా ...11లో

మా గోస వినండి!

లగచర్ల ఘటనపై మానవ హక్కుల, మహిళ, ఎస్సీ,ఎస్టీ కమిషన్‌లకు ఫిర్యాదు

బాధితులతో కలిసి వినతి పత్రాలు అందించిన బీఆర్ఎస్ నేతలు



న్యూఢిల్లీ : రాష్ట్రంలో లగచర్ల ఘటనపై బాధితులతో కలిసి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. సోమవారంనాడిక్కడ జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ), జాతీయ మహిళ కమిషన్ (ఎన్‌డబ్ల్యూసీ), జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ ఎస్టీ కమిషన్‌లను కలిసి బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు, ఎంపీలు, బాధితులు వినతి పత్రాలు అందించారు. అనంతరం కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బాధితులతో కలిసి మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడారు. మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదనీ, ఈ ఘటనపై ప్రధాని మోడీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఏం జరుగుతుందో దేశానికి తెలియాలనీ, పేద గిరిజనుల భూములను రేవంత్ సర్కార్ బలవంతంగా గుంజుకుంటోందని ఆరోపించారు. అర్ధరాత్రి పోలీసులు, ప్రయివేటు వ్యక్తులతో కలిసి దళిత రైతుల ఇండ్లపై దౌర్జన్యకాండ జరుగుతున్నదనీ, సీఎం సోదరుడు గిరిజన రైతులపై దాడి చేసినా కేసులుండవని విమర్శించారు. ప్రజాప్రతినిధి కాకున్నా సీఎం సోదరుడికి కలెక్టర్ స్వాగతం పలుకుతున్నారని అన్నారు. లగచర్లలో అర్ధరాత్రి మహిళలపై పోలీసుల దాడి చేశారనీ, గిరిజన రైతులపై అక్రమంగా అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారని అన్నారు. లగచర్ల ఘటనపై మోడీ, రాహుల్, ఖర్గే ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. కొడంగల్‌లో మూడు వేల ఎకరాల్లో ఫార్మా విలేజీ కోసం సీఎం ...11లో

ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

రాష్ట్రవ్యాప్తంగా 50.24 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-3 పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-3కి రాష్ట్రవ్యాప్తంగా 5,36,400 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. వారిలో 76.4 శాతం మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొన్నారు. అందులో 2,69,483 (50.24 శాతం) మంది పరీక్షలకు హాజరయ్యారని ...11లో



జీ 20 సదస్సు షురూ

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, వాతావరణ మార్పులపై చర్చ

రియోలో కళారూపాలతో మోడీకి స్వాగతం

రియో డీ జెనీరో : వాతావరణ సంక్షోభం, పశ్చిమాసియాలో, యూరప్‌లో యుద్ధాలు, ఉద్రిక్తతలతో యావత్ ప్రపంచం సతమతమవుతున్న వేళ సోమ, మంగళవారాల్లో జీ 20 దేశాల నేతలు సమావేశమయ్యారు. ఆకలి, దారిద్ర్యం, అసమానతలపై పోరాటమే ప్రధాన ధ్యేయంగా ఈ సదస్సు సాగుతోంది. ఆర్థిక, సామాజిక, పర్యావరణపరమైన ...11లో

నవతెలంగాణ

ఉపాధ్యాయుడు ఒక నటుడిగా, కళాకారుడిగా తన పనిపట్ల ఎంతో తీవ్రమైన ఆపేక్షతోటి వుండాలి - టాల్‌స్టాయ్

మంగళవారం 19 నవంబరు 2024
www.navatelangana.com

సంపాదకీయం

'కల్తీ' సర్వాంతర్యామి



బతకటానికి తిండి తింటాం మనం. కానీ, తింటే బతకలేమని తెలుస్తోంది నేడు. ఇందుగలదు.. అందు లేదన్న సందేహం వలదు.. అన్న చందంగా నేడు ఆహార పదార్థాల్లో కల్తీ, నకిలీలతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. బ్రాండెడ్‌లను పోలిన విధంగా నకిలీలను తయారు చేస్తున్నారు. కల్తీ వస్తువులతో చేసిన ఆహారాన్ని అంటగడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఆహార కల్తీ తీవ్రమైంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ బృందం, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇటీవల దాదాపు 500ల చోట్ల తనిఖీలు చేయగా, 90శాతం కేంద్రాల్లో కల్తీలు బయటపడటమే అందుకు నిదర్శనం. దాంతో భాగ్యనగరవాసులు బయట తినాలంటే వణికిపోతున్నారు.

అసలు కల్తీ మాఫీయాను అడ్డుకోవడానికి ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులేమిటి? ప్రజల ప్రాణాలను హరిస్తున్న ఈ మాఫియాపై చర్యలకెందుకు ఉపక్రమించడం లేదు. ప్రజల ప్రాణాలకంటే ముఖ్యమైన ప్రయోజనాలు పాలకులకేమైనా ఉన్నాయా? అన్న అనేక సందేహాలు కలుగుతున్నాయి. గతంలో వినియోగదారుల ఫోరమ్ వంటివి కల్తీ వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తేలా చట్టాల కొరడా ఝుళిపించేవి. నేడా వ్యవస్థను ఎందుకు నిర్వీర్యమైంది? 'కల్తీ' సర్వాంతర్యామి అయి అన్ని వ్యవస్థలను కలుషితం చేస్తోంది. ఈ వ్యాపార సామ్రాజ్యాన్ని పెకిలించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

వరుసగా దాడులు చేస్తున్నప్పటికీ కొందరు యజమానులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోన్నారు. కుళ్లిన మాంసం, కూరగాయలను వంటలకు ఉపయోగిస్తూ ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. ఆహార కల్తీని, నకిలీల తయారీని అరికట్టాల్సిన ఆహార ప్రమాణాల పరిరక్షణ శాఖలో సిబ్బంది కొరత కూడా కల్తీ కేటుగాళ్లకు కలిసివస్తోంది. యాజమాన్యాలతో కుమ్మక్కయిన కొందరు అధికారులు ప్రయోగశాల నివేదికలను తొక్కిపెడుతున్నారనే విమర్శలొస్తున్నాయి.

హైదరాబాద్‌లోనే దాదాపు 70 వేలకు పైగా ఆహార విక్రయ కేంద్రాలుంటాయని అంచనా. ఇవి కాకుండా చిరుతిళ్ల అమ్మే తోపుడు బండ్లు, ఫుడ్‌ట్రక్‌లు మరో 20 వేల వరకు ఉంటాయని సమాచారం. అధికారికంగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆహార భద్రతాధికారులు (ఎఫ్ఎస్‌వో)ఈ ఏడాదిలో ఇప్పటివరకు జారీ చేసిన లైసెన్సులు 16,274 మాత్రమే కావడం గమనార్హం. దాదాపు కోటిన్నర జనాభా, సుమారు 90 వేల ఆహార విక్రయ కేంద్రాలున్న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్నది కేవలం 21 మంది ఎఫ్ఎస్‌వోలు మాత్రమే. క్రమపద్ధతిలో హోటళ్ల తనిఖీ చేపడితే అన్నింటినీ తనిఖీ చేయడానికి వీరికి ఏండ్లు పట్టవచ్చు. రాష్ట్ర ఆహార పరిరక్షణ విభాగంలో మొత్తం 62 సర్కిళ్ల పరిధిలో లక్షల సంఖ్యలో ఉన్న ఆహార కేంద్రాల తనిఖీకి ఉన్న అధికారుల సంఖ్య 76 మాత్రమే కావడం గమనార్హం.

'కల్తీకి కానిదేదీ అనర్హం' అన్నట్టు ప్రస్తుతం మన నిత్యావసర వస్తువులన్నీ 'కల్తీ'మయమే. పండ్లు, పాలు, నూనెలు, కూరగాయలు ఇలా చెబుతూ పోతే సమస్త ఆహార ఉత్పత్తుల్లో కల్తీ కాని పదార్థాలు వేళ్లమీద లెక్కబెట్టే అన్ని కూడా లేవు. ఏది కొనాలో, ఏది తినాలో, ఏది మంచిదో, ఏది చెడ్డదో నిర్ధారించుకోలేని స్థితికి నెట్టివేయబడ్డాం. నిత్యం బిర్యానీలోనో.. కూరల్లోనో.. కప్పలు, బల్లులు, బొద్దింకలు వచ్చాయంటూ జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కల్తీ మాయాబజారులో డబ్బులిచ్చి మరీ రోగాలను కొని తెచ్చుకుంటున్నాము. అనారోగ్యాలతో దవాఖానాల పాలైతే అక్కడిచ్చే మందులను కూడా అనుమానించక తప్పని ప్రపంచంలో బతుకుతున్నాం. వీటిపై చర్యలు తీసుకుని ప్రజారోగ్యానికి భద్రత కల్పించాల్సిన ప్రభుత్వాలకు ఇది కనీస సమస్యగా కూడా కనపడకపోవడం వైచిత్రి.

తూతూ మంత్రంగా ఏడాదికి ఒకసారి తనిఖీలు చేస్తే ఫలితం శూన్యం. పైపెచ్చు కల్తీ నిరోధక వ్యవస్థ బలహీనత, సిబ్బంది కొరతను గమనించి, ఇది 'మూడు పువ్వులు ముప్పయి ఆరు కాయలు'గా వర్ధిల్లుతున్నది. కల్తీ ఆహార పదార్థాలపై పర్యవేక్షణ చేసేందుకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల ఉద్యోగాలను నింపాలని హైకోర్టు ఆదేశించి ఏండ్లు గడుస్తుంటే...కొత్తగా పదిహేడు మంది ఫుడ్ సేఫ్టీ అధికారులను ఈ ప్రభుత్వం నియమించింది. ప్రతి ఐదువందల మంది జనాభాకు ఒక ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమిస్తామని సర్కార్ ప్రకటించడం సంతోషమే. కానీ, అది ఆచరణ రూపం దాల్చకపోతే మాత్రం మార్పేమి ఉండదు.

అసలు కల్తీ మాఫీయాను అడ్డుకోవడానికి ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులేమిటి? ప్రజల ప్రాణాలను హరిస్తున్న ఈ మాఫియాపై చర్యలకెందుకు ఉపక్రమించడం లేదు. ప్రజల ప్రాణాలకంటే ముఖ్యమైన ప్రయోజనాలు పాలకులకేమైనా ఉన్నాయా? అన్న అనేక సందేహాలు కలుగుతున్నాయి. గతంలో వినియోగదారుల ఫోరమ్ వంటివి కల్తీ వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తేలా చట్టాల కొరడా ఝుళిపించేవి. నేడా వ్యవస్థను ఎందుకు నిర్వీర్యమైంది? 'కల్తీ' సర్వాంతర్యామి అయి అన్ని వ్యవస్థలను కలుషితం చేస్తోంది. ఈ వ్యాపార సామ్రాజ్యాన్ని పెకిలించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ, రాజకీయాలు అంతకంటే కల్తీగా మారిపోయాయి. చెప్పేదొకటి చేసేదొకటిగా, బయటకొకటి, లోనొకటిగా మారింది. సేవ అనేది మారి స్వాహా మొదలైంది. ఈ కల్తీల నుండి సమాజాన్ని కాపాడాల్సిన బాధ్యతను విస్మరిస్తే ఈ ప్రభుత్వాలను కదిలించాల్సింది చైతన్యవంతమైన ప్రజలే.

సంక్షోభంలో ఉదారవాద రాజకీయాలు



ప్రభాత్ పట్నాయక్

ప్రపంచవ్యాప్తంగా ఉదార, మధ్యేవాద రాజకీయ పార్టీలు బలహీనపడి దెబ్బతిని పోతున్నాయి. వామపక్ష శక్తులు బలంగా ఉన్నచోట్ల ఆ వామపక్షాలకు మద్దతు పెరుగు తోంది. అవి బలంగా లేనిచోట్ల పచ్చి మితవాద, ఫాసిస్టు శక్తులకు బలం పెరుగుతోంది. అమెరికన్ ఎన్నికల్లో ట్రంప్ గెలుపు ప్రస్తుతం ప్రపంచ రాజకీయాల్లో కనిపిస్తున్న ఈ ధోరణికి అనుగుణంగానే ఉంది. ఫ్రాన్స్‌లో మాక్రాన్ పార్టీ బాగా బలహీనపడింది. అప్పటికప్పుడు హడావుడిగా కూడగట్టుకుని ఏర్పడిన వామపక్ష కూటమి బలంగా ముందుకు రావడంతో అక్కడ నయా ఫాసిస్టు శక్తులు ఆధిపత్యం సాధించకుండా అడ్డుకట్ట వేయడం సాధ్యపడింది. మన పొరుగున ఉన్న శ్రీలంకలో కూడా ఇదే మాదిరిగా వామపక్ష అభ్యర్థి గణనీయంగా ఓట్లు పెంచుకుని దేశాధ్యక్ష పదవిని చేపట్టాడు. అక్కడ ఓడిపోయిన అభ్యర్థి ఉదారవాద మధ్యేవాద పార్టీకి చెందినవాడు. ఇలా ఉదారవాద, మధ్యేవాద పార్టీలు అన్నిచోట్లా దెబ్బతినిపోవడం వర్తమాన కాలంలో ఉదారవాదం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని సూచిస్తోంది. రాజకీయ ఉదారవాదం ఆర్థిక నయా ఉదారవాదంతో గట్టిగా పెనవేసుకుని వుంది. ఆ నయా ఉదారవాద ఆర్థిక విధానాలే సంక్షోభంలో పడిపోవడంతో రాజకీయ ఉదారవాదం కూడా సంక్షోభంలో పడి దెబ్బ తినిపోతోంది.

సాంప్రదాయంగా ఉదారవాద రాజకీయ పార్టీలు పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలను బలపరుస్తూ వచ్చాయి. గతంలో అమలైన ఉదారవాద ఆర్థిక విధానాలను కాని, తర్వాత అమలౌతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలను కాని ఇవి అమలు చేస్తూ వచ్చాయి. ఈ రెండు రకాల ఆర్థిక విధానాలూ స్వేచ్ఛా మార్కెట్‌కు పెద్దపీట వేశాయి. మార్కెట్‌లో ప్రభుత్వ జోక్యాన్ని కుదించడం అనేదానికి అత్యంత అధిక ప్రాధాన్యతనిచ్చాయి.

మొదటి ప్రపంచ యుద్ధకాలంలోను, ఆ తర్వాత రెండో ప్రపంచ యుద్ధ కాలంలో తలెత్తిన మహా మాంద్యం కాలంలోను ఈ ఉదారవాద ఆర్థిక విధానాల వైఫల్యం స్పష్టంగా బయటపడింది. స్వేచ్ఛా మార్కెట్ విధానాలు అప్పుడప్పుడు తాత్కాలికంగా హుషారు పుట్టించవచ్చు. కాని అంతకుమించి అవి కార్మిక వర్గాన్ని దెబ్బతీసి, నిరుద్యోగాన్ని విపరీతంగా పెంచుతాయి. దాని ఫలితంగా పెట్టుబడిదారీ విధానం యావత్తూ ప్రమాదంలో పడి సోషలిజం బల పడటానికి దారితీస్తుంది. ఈ వైనాన్ని కీన్స్ చాలా పద్ధతి ప్రకారం వివరించాడు. అయితే అతడు స్వతహాగా ఉదారవాది. అందుచేత బలపడుతున్న సోషలిస్టు ప్రమాదాన్ని నివారించడం ఎలా అన్నదే ఆలోచించాడు. అందుకోసం ఒక కొత్త తరహా ఉదారవాదాన్ని అతడు ప్రతిపాదించాడు. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం నిత్యం జోక్యం చేసుకుంటూ స్థూల డిమాండ్‌ను పెంచే దిశగా చర్యలు తీసుకుంటూ వుండాలని, అప్పుడు ఉపాధి అవకాశాలు బాగా పెరుగు తాయని కీన్స్ సూచించాడు. ప్రభుత్వ జోక్యాన్ని అంతకంతకూ తగ్గించాలనే సాంప్రదాయ ఉదారవాదానికి కీన్స్ చెప్పింది భిన్నంగా ఉంది.

ప్రపంచవ్యాప్తంగా ఉదారవాద మధ్యేవాద పార్టీలు దెబ్బతినిపోవడం అనే ధోరణికి అనుగుణంగానే అమెరికాలోనూ జరిగింది. అందుచేత ట్రంప్ ఎన్నిక ఆశ్చర్యం కలిగించదు. కాని అమెరికన్ ప్రజానీకం ట్రంప్ ప్రకటిం చిన ఆర్థిక ఎజెండా వెనుక నయా ఉదారవాద సూత్రాలే ఉన్నాయని గుర్తించలేకపోయారు. ట్రంప్ రక్షణాత్మక చర్యలు దేశీయ పరిశ్రమల్లో కొన్ని ఉద్యోగాలు కల్పించవచ్చు. కాని అవే రక్షణాత్మక చర్యల వలన దిగుమతులు మరింత ఎక్కువ ఖరీదవుతాయి. దాని వలన ద్రవ్యోల్బణం తీవ్రం అవుతుంది. అది సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుంది.

కీన్స్ సిద్ధాంతాన్ని ద్రవ్య పెట్టుబడి ఏనాడూ అంగీకరించలేదు. ఇది కీన్స్‌కే అంతుబట్టలేదు. తన సిద్ధాంతాన్ని అర్థం చేసుకోలేకపోవడమే దీనికి కారణమని అతడు భావించాడు. కాని అసలు కారణం ఇంకా లోతైనది. ప్రభుత్వం గనుక జోక్యం చేసుకోవడాన్ని ఒక విధానంగా చేపడితే అప్పుడు పెట్టుబడిదారుల ఉనికి, వారు నిర్వహించే పాత్ర క్రమంగా సమాజ ఆమోదాన్ని కోల్పోతాయని పెట్టుబడిదారులు, ముఖ్యంగా ద్రవ్య పెట్టుబడి రంగంలో ఉన్న తరగతి ఆందోళన చెందారు (ఈ తరగతి పెట్టుబడిదారులను 'పని లేని పెట్టుబడిదారులు' అని కీన్స్ అభివర్ణించాడు.).వారి భయం నేటికీ కొనసాగుతోంది.

రెండో ప్రపంచ యుద్ధానంతర కాలంలో కీన్స్ విధానాలు ప్రభుత్వ విధానాలుగా అమల్లోకి వచ్చాయి. ద్రవ్య పెట్టుబడి ఆ యుద్ధం వలన గణనీయంగా దెబ్బతినడంతో కీన్సియన్ విధానాలను స్వీకరించిన సోషల్ డెమోక్రసీ బలంగా ముందుకొచ్చింది. ఆ తర్వాత కాలంలో సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో ఆర్థికాభివృద్ధి వేగం పుంజుకుంది. ద్రవ్య పెట్టుబడి మళ్లీ బలం పెంచుకుని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిగా పెరిగింది. అదే సమయంలో పెట్టుబడిదారీ వ్యవస్థ మార్కెట్‌లో ప్రభుత్వ జోక్యం ఉన్నప్పటికీ మరొక తరహా సంక్షోభంలోకి జారిపోయింది. 1960, 1970 దశకాల్లో కనిపించిన ద్రవ్యోల్బణ సమస్యకు కారణం స్థూల డిమాండ్ తగినంత లేకపోవడమే. కాని సంక్షోభపు మూలాలు అంతకన్నా తీవ్రమైనవి. ఉపాధి అవకాశాలు ఎక్కువ మందికి రావడంతో పెట్టుబడిదారీ శక్తులు అదనపు విలువను ఆశించినంత మేరకు పొందలేకపోతున్నాయి. రెండోపక్క అంతకు ముందు వలసలుగా ఉన్న కాలంలో మూడవ ప్రపంచదేశాల నుండి ముడిసరుకును చౌకగా కాజేసినట్టు, వలసలు స్వాతంత్య్రం పొందిన తర్వాత కాలంలో చౌకగా పొందగలిగే ఏర్పాటు ఏదీ లేకుండా పోయింది. ఈ పరిస్థితిని అడ్డం పెట్టుకుని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి శక్తులు కీన్స్ విధానాలను తప్పుబట్టడం ప్రారంభించాయి. మళ్లీ పాతకాలపు స్వేచ్ఛా మార్కెట్ విధానాలు అమలైతేనే పరిష్కారం దొరుకుతుందని ప్రచారం మొదలుబెట్టాయి. ఈ ప్రచారానికి బూర్జువా ఆర్థికవేత్తలు తమ గొంతులు కలిపారు. క్రమంగా అన్ని ప్రభుత్వాలూ నయా ఉదారవాద విధానాలనే తమ ప్రభుత్వ విధానాలుగా అమలు చేయడం మొదలైంది.

తమ దేశాల్లోకి పెట్టుబడులను ఆకర్షించడం లేదా వచ్చిన పెట్టుబడులను వెనక్కి మళ్లకుండా నిలుపుకోవడం అనేది అన్ని ప్రభుత్వాలకూ ప్రధాన కర్తవ్యంగా మారిపోయింది. ఈ పరిస్థితిలో ఉదారవాద మధ్యేవాద పార్టీలు- వాటిలో ఎక్కువ భాగం సోషల్ డెమొక్రటిక్ పార్టీలు-కొన్ని చోట్ల వామపక్ష పార్టీలు సైతం, కీన్స్ విధానాలను పూర్తిగా విడిచిపెట్టి నయా ఉదారవాద విధానాలకే కొమ్ము కాశాయి.

అయితే నయా ఉదారవాద విధానాలు అటు సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మికవర్గానికి, ఇటు మూడవ ప్రపంచ దేశాలలోని అన్ని తరగతుల కష్టజీవులకు భరించలేని కష్టాలను తెచ్చిపెట్టాయి. ఈ విధానాలు ఏ సంక్షోభంలోనూ పడక మునుపే కష్టజీవులు కష్టాల్లో పడ్డారు. ఇక అవి సంక్షోభంలో చిక్కుకున్నాక శ్రామిక ప్రజల కష్టాలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయి. ప్రభుత్వ జోక్యంతో కీన్స్ విధానాలు అమలు జరిగిన కాలంలో సాధిం చిన వృద్ధిరేటు క్రమంగా నయా ఉదారవాద కాలంలో తగ్గిపోతూ వచ్చింది. 2008లో అమెరికాలో రియల్ ఎస్టేట్ బుడగ బద్దలైన దరిమిలా ఏర్పడ్డ సంక్షోభం అనంతరం ఈ వృద్ధిరేటు ఇంకా వేగంగా పడిపోతూ వచ్చింది. సంపద లోని అసమానతలు చాలా తీవ్రంగా పెరిగిపోవడంతో ప్రపంచపు స్థూల డిమాండ్ తగినంత లేకుండా పోయింది (స్వేచ్ఛా మార్కెట్‌లో ఉత్పత్తి మీద కూడా నియంత్రణ ఉండదు కనుక అది అధికోత్పత్తికి దారితీస్తుంది. అత్యధికుల వద్ద ఉండే సంపద తరిగిపోయి కొద్దిమంది దగ్గరే కేంద్రీకృతం కావడం వలన ఈ అధికోత్పత్తి చెల్లుబాటు కాదు. అందువలన సంక్షోభం అనివార్యంగా ఏర్పడుతుంది.) .అమెరికాలో రియల్ ఎస్టేట్ బుడగ పెరుగుతూన్నంత కాలమూ ఈ సంక్షోభాన్ని తాత్కాలికంగా వెనక్కి నెట్టగలిగారు. ఒక్కసారి ఆ బుడగ బద్దలవడంతో సంక్షోభం విరుచుకుపడింది. ఈ సంక్షోభాన్ని నయా ఉదారవాద విధానాల చట్రం లోపలే పరిష్కరించడం అసాధ్యం. మళ్లీ ఏదో ఒక బుడగను సృష్టిద్దామనుకున్నా, గతకాలపు చేదు అనుభవాలతో తలలు బొప్పికట్టిన ప్రజలు ఆ బుడగల పట్ల ఉత్సాహంగా స్పందించరు. వాస్తవానికి ద్రవ్య విధానంలో మార్పుల ద్వారా అటువంటి ఓ బుడగను సృష్టించే ప్రయత్నం జరిగింది. అదనపు డిమాండ్ ప్రజల దగ్గర లేకపోయినా, మార్కెట్‌లోకి అదనపు ద్రవ్యాన్ని ఈ ద్రవ్య విధానం ద్వారా (మానెటరీ పాలసీ) పంపి లాభాలను పెంచుకునే ప్రయత్నం జరిగింది. అది మరింత ద్రవ్యోల్బణానికే దారితీసింది. సంక్షోభం మరింత ముదిరింది.

ఇటువంటి పరిస్థితుల్లో మధ్యేవాద ఉదారవాద పార్టీలు నయా ఉదారవాద విధానాలతోటే ముడివేసుకుని ఉన్న కారణంగా, అవి చేయగలిగినది ఏమీ లేకుండా పోతోంది. ప్రజల కడగండ్లను తీర్చగలిగే శక్తిని అవి కోల్పోయాయి. అందువలన ప్రజలు ఈ పార్టీలను విడిచిపెట్టి తక్కిన పార్టీల వైపు మళ్లుతున్నారు. వాటిలో అటు మితవాద అభివృద్ధి నిరోధక పార్టీలూ ఉన్నాయి, ఇటు వామపక్ష పార్టీలూ ఉన్నాయి. ఈ మితవాద అభివృద్ధి నిరోధక పార్టీలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల కష్టాలను తొలగించగలిగే స్థితిలో లేవు. ఆ పార్టీలు కూడా నయా ఉదారవాద విధానాలను సమర్థించేవే. ఎన్నికల సమయంలో ప్రజలను ఆకర్షించే నినాదాలను ఇవ్వగలవు. కాని అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి పని ఆ నినాదాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. అవి నయా ఉదారవాద విధానాలనే మరింత వేగంగా అమలు చేయడం ప్రారంభిస్తాయి. ఇటలీలో అధికారం చేపట్టిన మెలొనీ విధానాలు చూస్తే ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఫ్రాన్స్ లో పచ్చి మితవాద మరైన్ లీపెన్ పార్టీ తాలూకు ప్రధానమంత్రి అభ్యర్థి ఇంకా ఎన్నికలకు ముందే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి అనుకూలతను ప్రకటించేశాడు!

అయితే ఈ మితవాద పార్టీలు ఏదో ఒక రూపంలో రాజకీయ చర్చను "బయటవాళ్లు" వైపు తిప్పుతాయి. ఈ "బయటవాళ్లు" ఏదో ఒక మైనారిటీ మతానికి చెందినవారైనా కావచ్చు లేదా ఏదైనా మైనారిటీ జాతికి చెందిన వారు కావచ్చు లేదా బతుకు తెరువుకోసం బయటనుంచి వచ్చిన వారైనా కావచ్చు. ప్రజలు అనుభవిస్తున్న కష్టాలకు ఈ "బయటవాళ్లే" కారణమని ఆందోళనలు



కీన్స్ సిద్ధాంతాన్ని ద్రవ్య పెట్టుబడి ఏనాడూ అంగీకరించలేదు. ఇది కీన్స్‌కే అంతుబట్టలేదు. తన సిద్ధాంతాన్ని అర్థం చేసుకోలేకపోవడమే దీనికి కారణమని అతడు భావించాడు. కాని అసలు కారణం ఇంకా లోతైనది. ప్రభుత్వం గనుక జోక్యం చేసుకోవడాన్ని ఒక విధానంగా చేపడితే అప్పుడు పెట్టుబడిదారుల ఉనికి, వారు నిర్వహించే పాత్ర క్రమంగా సమాజ ఆమోదాన్ని కోల్పోతాయని పెట్టుబడిదారులు, ముఖ్యంగా ద్రవ్య పెట్టుబడి రంగంలో ఉన్న తరగతి ఆందోళన చెందారు (ఈ తరగతి పెట్టుబడిదారులను 'పని లేని పెట్టుబడిదారులు' అని కీన్స్ అభివర్ణించాడు.).వారి భయం నేటికీ కొనసాగుతోంది.

రెచ్చగొట్టి మితవాద పార్టీలు తమ ప్రాబల్యం పెంచుకోడానికి పూను కుంటాయి. మరోవైపు ఉదారవాద మధ్యేవాద పార్టీలు అసలు ఏ సంక్షోభమూ లేనే లేదన్నట్టు ప్రవర్తిస్తాయి. ఇటు వంటి సందర్భాల్లో గుత్త పెట్టుబడిదారీ శక్తులు మితవాదుల వైపు, లేదా నయా ఫాసిస్టు శక్తుల వైపు మొగ్గి వాటికి తమ మద్దతునందిస్తాయి. రాజకీయంగా పరిస్థితులు చేజారిపోకుండా వుండాలంటే వాటి ముందున్న మార్గం అదొక్కటే. ఈ గుత్త పెట్టుబడిదారీ శక్తుల మద్దత్తు కోల్పోవడంతో ఉదారవాద, మధ్యేవాద పార్టీలు మరింత రాజకీయ సంక్షోభంలో పడతాయి.

పైకి చూసినప్పుడు ట్రంప్ ప్రకటించిన ఆర్థిక ఎజెండా ప్రభుత్వ జోక్యాన్ని మరింత పెంచే దిశగా ఉన్నట్టు అనిపించవచ్చు. అమెరికన్ ఆర్థిక వ్యవస్థను చైనా నుండి మాత్రమే కాక, యూరోపియన్ యూనియన్ దేశాల నుండి కూడా వచ్చిపడే దిగుమతుల తాకిడి నుండి కాపాడుతానని ట్రంప్ ప్రకటించాడు. ఇలా దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడేం దుకు జోక్యం చేసుకోవడం అంటే అది నయా ఉదారవాద విధానాల నుండి పక్కకు మళ్లినట్టే కనిపిస్తుంది. కాని ట్రంప్ ఎక్కడా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి కదలికల మీద ఆంక్షలు పెడతానని ప్రకటించలేదు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి స్వేచ్ఛగా ఎక్కడబడితే అక్కడికి సంచరించడమే నయా ఉదారవాద విధానాలలో అత్యంత కీలకమైన అంశం. అంతేకాదు, అమెరికా మార్కెట్‌కు దిగుమతుల నుండి రక్షణ కల్పిస్తానని ట్రంప్ కన్నా ముందే ఒబామా కాలంలోనే చెప్పారు. ఇటువంటి రక్షణ విధానం వలన అమెరికాలో దేశీయంగా ఉత్పత్తి అయ్యే సరుకుల వరకూ కొంత ఊరట లభించవచ్చు. కాని దానివలన అమెరికాలో డిమాండ్ పెరగడం అనేది జరగదు. డిమాండ్ పెరగాలంటే ప్రభుత్వ వ్యయం పెరగాల్సిందే. అందుకోసం ద్రవ్యలోటు పెంచి రుణాలైనా తేవాలి లేదా సంపన్నుల మీద అదనంగా పన్నులైనా వేయాలి. కాని ట్రంప్ ఇప్పుడు విధిస్తున్న కార్పొరేట్ పన్నులనే మరింత తగ్గిస్తానని ప్రకటిం చాడు. కాబట్టి ప్రభుత్వ వ్యయాన్ని ట్రంప్ పెంచే ప్రసక్తే ఉండదు. ట్రంప్ కల్పించే రక్షణతో స్వల్పకాలం పాటు దేశీయ ఉత్పత్తులకు రక్షణ లభించడం మినహా ఇంకేమీ ఒరిగేది ఉండదు. ఆర్థిక మాంద్యంలో, సంక్షోభంలో అమెరికన్ ఆర్థిక వ్యవస్థ మరింత కూరుకుపోతుంది.

ప్రపంచవ్యాప్తంగా ఉదారవాద మధ్యేవాద పార్టీలు దెబ్బతినిపోవడం అనే ధోరణికి అనుగుణంగానే అమెరికాలోనూ జరిగింది. అందుచేత ట్రంప్ ఎన్నిక ఆశ్చర్యం కలిగించదు. కాని అమెరికన్ ప్రజానీకం ట్రంప్ ప్రకటిం చిన ఆర్థిక ఎజెండా వెనుక నయా ఉదారవాద సూత్రాలే ఉన్నాయని గుర్తించలేకపోయారు. ట్రంప్ రక్షణాత్మక చర్యలు దేశీయ పరిశ్రమల్లో కొన్ని ఉద్యోగాలు కల్పించవచ్చు. కాని అవే రక్షణాత్మక చర్యల వలన దిగుమతులు మరింత ఎక్కువ ఖరీదవుతాయి. దాని వలన ద్రవ్యోల్బణం తీవ్రం అవుతుంది. అది సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుంది.

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో ఈ సంక్షోభం నుండి బయట పడవేయగల ఎజెండా ఉన్నది వామపక్షాల వద్ద మాత్రమే. నయా ఉదారవాద విధానాలకు తెరదించడం ద్వారా ప్రత్యామ్నాయ విధానాలను అవి అమలు చేయగలవు. ఇప్పుడు కొనసాగుతున్న యుద్ధాలకు సైతం అవి మాత్రమే ముగింపు పలకగలవు (ఈ యుద్ధాలు తలెత్తడంలోగాని, అవి కొనసాగడంలో గాని ఉదారవాద, మధ్యేవాద పార్టీలు ప్రధాన కారణం) ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి వామపక్ష శక్తులు సమాయత్తం కావాలి.

(స్వేచ్ఛానుసరణ)

టీజీఎస్ఆర్టీసీ ప్రయివేటు సంస్థగా మారనుందా?



వి.ఎస్.రావు
9490098890

దేశ ప్రజలకు అర్థవంతమైన ప్రజా రవాణాను అందించేందుకు గాను "ఆర్టీసీ యాక్ట్-1950" అమల్లోకి వచ్చింది. ఆ తర్వాతనే అనేక రాష్ట్రాల్లో రోడ్డు రవాణా సంస్థలు ఏర్పడ్డాయి. 11 జనవరి 1958న ఏపీఎస్ఆర్టీసీ ఏర్పడింది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2015 జూన్ 3నుంచి ఏపీఎస్ఆర్టీసీ, టీఎస్ఆర్టీసీలుగా పనిచేస్తున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఆర్టీసీ అభివృద్ధి చెందుతుందనుకున్న ప్రజల ఆలోచనలు తప్పని ఈ పదేండ్ల అనుభవం రుజువు చేసింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ "నిటి ఆయోగ్" లెక్కల ప్రకారం భారతదేశంలో ప్రతి వెయ్యి జనాభాకు 1.2 బస్సులు ఉండాలని, కనీసం 0.6 బస్సులు ఉండాలి. ఆ లెక్కన తెలంగాణ ఆర్టీసీలో కనిష్ఠంగా 24,600, గరిష్ఠంగా 49,200 బస్సులు ఉండాలి. కానీ కేవలం 9,150 బస్సులే ఉన్నాయి.

దేశ ఆర్టీసీల్లో బస్సులు పెంచకుండా అడ్డుకున్నది కేంద్ర ప్రభుత్వమే. ప్లానింగ్ కమిషన్ ద్వారా 1989లో ఆదేశించింది.2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గద్దెనెక్కాక రవాణా రంగాన్ని, ప్రత్యేకించి ఆర్టీసీలను ప్రయివేటు కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు పథకాలు ప్రవేశపెట్టింది. అందుకనుగుణంగా ఎంవీ యాక్ట్-2019ను ముందుకు తెచ్చింది. అలాంటి పథకమే విద్యుత్ బస్సుల పథకం. పర్యావరణ పరిరక్షణను నినాదంగా తీసుకున్నది. నిజంగా పర్యావరణ రక్షణ కోసమే అయితే కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు వారికి ఇచ్చే నిధులతో బస్సులు కొని ఆర్టీసీలకు దామాషా పద్ధతిన ఇవ్వొచ్చు. కానీ, ఆపని కేంద్రం చేయడం లేదు. అదే సమయంలో వ్యక్తిగత వాహనాలను తగ్గించి, ప్రజా రవాణా సంస్థలు అయిన ఆర్టీసీ, రైల్వేలను అభివృద్ధి చేయాలి. అది కూడా చేయడం లేదు. ఉదాహరణకు తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 1.80 కోట్ల వాహనాలుంటే అందులో ఆర్టీసీ బస్సులు కేవలం 9,150 మాత్రమే. కానీ పర్యావరణ పరిరక్షణ బాధ్యత ఆర్టీసీది మాత్రమేనన్నట్లు వ్యవహరిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం చేస్తున్నదేమిటి?

పర్యావరణ పరిరక్షణ పేరున కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టేందుకు "FAME -1ను 2015 ఏప్రిల్‌లో ముందుకు తెచ్చింది. రూ.895 కోట్ల పెట్టుబడి పెట్టిన పథకం 2019 మార్చిలో ముగిసింది.ఇది పూర్తిగా జీసీసీ (గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు) పద్ధతి. కోటి రూపాయలను సబ్సిడీగా బస్ కాన్సారటియంకు కేంద్రం ఇచ్చింది. ఈ స్కీంలో 40 బస్సులు టీజీఎస్ఆర్టీసీలో సమకూర్చుకుని, ఎయిర్‌పోర్ట్‌కు నడుపుతున్నది. ఆ తర్వాత రూ.11,500 కోట్ల పెట్టుబడితో FAME -2 పథకాన్ని కేంద్రం తెచ్చింది. ఈ స్కీం 1 ఏప్రిల్ 2019 నుంచి 2024 మార్చి 31 వరకు అమలులో ఉంది. దీని అమలులో ఇబ్బందులొచ్చాయి. ఆ తర్వాత NEBP (నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రాం)ను తీసుకొచ్చింది. దీని ద్వారా ఎంపిక చేసిన రూరల్ రూట్లలో బస్సు నడపడానికి తెచ్చిన పథకం ఇది. ఈ పథకంలో రూ.50 లక్షలు సబ్సిడీని ఆ సంస్థలకు ఇచ్చింది. ఆ తర్వాత పీఎం 'ఈ' బస్ పథకం ద్వారా బస్సులు సమాకూర్చే పని కేంద్రం ప్రకటించింది. ఇందుకు రూ. 57,613 కోట్లు ఖర్చయితే అందులో రూ.20వేల కోట్లు కేంద్రం, రూ.37,613 కోట్లు రాష్ట్ర ప్రభుత్వాలు సమాకూర్చాలని పథకం నిర్దేశిస్తున్నది. ఇది కూడా జీసీసీ పద్ధతిలోనే. అయితే, స్టాండర్డ్ మోడల్ బస్సుకు కిలోమీటర్‌కు రూ.24, మిడిల్ మోడల్‌కు రూ.22, మినీ మోడల్‌కు రూ.20 కేంద్రం సబ్సిడీగా ఇస్తున్నది. వాయిబిలిటీ ఫండ్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఉండటమే కాక అనేక విషయాల్లో లోకల్ బాడీ సంస్థలు గ్యారెంటీ ఇవ్వాలి.

ఈ పద్ధతిని విస్తరిస్తూ కేంద్రం నిర్ణయం చేసింది. ఇందుకు రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి విద్యుత్ బస్సులు సమకూర్చాలని, 2025 నుండి 2030 వరకు అమలులో ఉంటుందని పేర్కొంది. దీంతోపాటు 29 సెప్టెంబర్2024న "పీఎం 'ఈ' డ్రైవ్" పథకాన్ని ప్రకటించింది. 2026 మార్చి వరకు అమలులో ఉండే ఈ పథకం ద్వారా రూ.10,950 కోట్లు ఖర్చు చేయనుంది. కేంద్రం తీసుకొచ్చిన ఈ పథకాలన్నీ జీసీసీ పద్ధతి పైనే నడుస్తాయి. కేంద్రం ఇచ్చే సబ్సిడీ కేవలం ప్రయివేటు/ కార్పొరేట్ సంస్థలకు తప్ప ఆర్టీసీలకు ఇవ్వడం లేదు. ఈ స్కీంల ద్వారా ఖర్చు చేస్తున్న డబ్బుల ద్వారా విద్యుత్ బస్సులను కొని నేరుగా ఆర్టీసీలకు దామాషా పద్ధతిలో ఇవ్వాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్, ఎస్‌డబ్ల్యూఎఫ్‌లు డిమాండ్ చేస్తున్నా, పాలకులు పెడచెవిన పెడుతున్నారు.



ద్వాక్రా గ్రూప్‌ల ద్వారా బస్సులు సమకూర్చి ఆర్టీసీలో అద్దె బస్సులుగా పెడతామని ప్రభుత్వం విధాన ప్రకటన చేసింది. తొలి దశలో 600 మండలాల నుండి 600 అద్దె బస్సులు ప్రవేశ పెట్టి, క్రమంగా విస్తరిస్తామని ప్రకటించింది. అంటే ఆర్టీసీలో నేడున్న 2900 అద్దె బస్సులకు తోడుగా ద్వాక్రా గ్రూప్‌ల ద్వారా వచ్చే బస్సులు జత కానున్నాయి. దీన్నిబట్టి చూస్తే ఆర్టీసీలో అద్దె బస్సులు పెరుగుతాయి. అంటే విద్యుత్ బస్సుల పేరుతో కార్పొరేట్ కంపెనీలు ఒక వైపు, ఆర్టీసీలో అద్దె బస్సు ఓనర్స్, ద్వాక్రా గ్రూప్ యజమానులు మొత్తం ఆర్టీసీలో నిండిపోతుంది. ఆర్టీసీగా సొంత బస్సులు ఉండే పరిస్థితి ఉండదు. దాని తర్వాత ఆర్టీసీ సిబ్బంది, ఉద్యోగులు నామమాత్రమే అవుతారు.

టీజీఎస్ఆర్టీసీలో ఏం జరుగుతున్నది?

2019-2023 సంవత్సరాల మధ్యలో FAME -1 ద్వారా 40 బస్సులు జీసీసీ పైన తీసుకుని ఎయిర్‌పోర్ట్‌కు నడుపుతున్నది. 2023-24 మధ్యలో టీజీఎస్ఆర్టీసీ టెండర్ల ద్వారా 550 విద్యుత్ బస్సులు సమాకుర్చుకుంటున్నది. అవి హైదరాబాద్‌లో నడుపుతారు. కొన్ని బస్సులు నడుస్తున్నాయి. మిగతావి దశల వారీగా రానున్నాయి. అలాగే రూరల్ ప్రాంతంలో నడపడానికి మరో 500 విద్యుత్‌బస్సులు సమకూర్చుకొంటున్నది.రాబోయే కాలంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ విద్యుత్ బస్సులనే తీసుకొస్తామని, రూరల్ ప్రాంతంలో కూడా విద్యుత్ బస్సులను నడుపుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా అదే నిర్ణయం చేసి అమల్లోకి తెచ్చింది. ఈ ప్రభుత్వం కూడా కొనసాగించే నిర్ణయమే చేసింది.

కేంద్ర ప్రభుత్వం నిటిఆయోగ్ ద్వారా విద్యుత్ బస్సులను ప్రోత్సహిస్తున్నది. ఈ స్కీంలను వాడుకున్నట్లయితే రాష్ట్ర ప్రభుత్వాలు డబ్బులు పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేకుండానే, వాటి ద్వారా వచ్చే ప్రయోజనాలు పొందవచ్చని భావిస్తున్నాయి. కాలంచెల్లిన బస్సుల స్థానంలో విద్యుత్‌బస్సులు తీసుకొని రావాలని ఆర్టీసీలను నిటిఆయోగ్ ద్వారా ఆదేశిస్తున్నారు. అందుకని రాబోతున్న రెండు, మూడేండ్లలో టీజీఎస్ఆర్టీసీలో అత్యధిక విద్యుత్ బస్సులు వస్తాయి. అవన్నీ కార్పొరేట్ సంస్థలవే అయి ఉంటాయి.

ఇవి కాక, డ్వాక్రా గ్రూప్‌ల ద్వారా బస్సులు సమకూర్చి ఆర్టీసీలో అద్దె బస్సులుగా పెడతామని ప్రభుత్వం విధాన ప్రకటన చేసింది. తొలి దశలో 600 మండలాల నుండి 600 అద్దె బస్సులు ప్రవేశ పెట్టి, క్రమంగా విస్తరిస్తామని ప్రకటించింది. అంటే ఆర్టీసీలో నేడున్న 2900 అద్దె బస్సులకు తోడుగా డ్వాక్రా గ్రూప్‌ల ద్వారా వచ్చే బస్సులు జత కానున్నాయి. దీన్నిబట్టి చూస్తే ఆర్టీసీలో అద్దె బస్సులు పెరుగుతాయి. అంటే విద్యుత్ బస్సుల పేరుతో కార్పొరేట్ కంపెనీలు ఒక వైపు, ఆర్టీసీలో అద్దె బస్సు ఓనర్స్, డ్వాక్రా గ్రూప్ యజమానులు మొత్తం ఆర్టీసీలో నిండిపోతుంది. ఆర్టీసీగా సొంత బస్సులు ఉండే పరిస్థితి ఉండదు. దాని తర్వాత ఆర్టీసీ సిబ్బంది, ఉద్యోగులు నామమాత్రమే అవుతారు.

ప్రయివేటు విద్యుత్ బస్సులు, అద్దె బస్సులు పెరుగుతుండటం వల్ల ఉన్న ఉద్యోగాలు కోల్పోవడమే కాక, అనేక సామాజిక సమస్యలు ముందుకొస్తాయి. డ్రైవర్లను కంపెనీలే తెచ్చి పెట్టుకుంటాయి. కాబట్టి ఆర్టీసీ డ్రైవర్స్ మిగులు తేలి, అభద్రతకు లోనవుతారు. ప్రయివేటు కంపెనీల వద్ద పనిచేసే సిబ్బంది శ్రమ,ఆర్థిక దోపిడీకి గురవుతారు.అంతే కాక రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తించే అవకాశం ఉండదు. ప్రభుత్వ రంగ సంస్థ ఆర్టీసీలో ఉద్యోగాలు పొందే అవకాశం కోల్పోయి నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతుంది.

మనమేం చేయాలి?

ఆర్టీసీని ప్రజా రవాణా సంస్థగా నిలబెట్టుకోవడానికి, ఆర్టీసీ ద్వారానే బస్సులు సమాకుర్చుకోవడానికి ఆర్టీసీ కార్మికులు మాత్రమే చేసే పోరాటాలు సరిపోవు. ప్రజలు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు అందరూ కలిసి అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం పైన తీవ్రమైన ఒత్తిడి తీసుకురావాలి. అలా జరగని పక్షంలో "టీజీఎస్ఆర్టీసీ" బోర్డు మాత్రమే ఉంటుంది. దాని లోపల మాత్రం కార్పొరేట్స్, ప్రయివేటు బస్సు యజమానులు తిష్ట వేసుకుని కూర్చుంటారు. అంటే టీజీఎస్ఆర్టీసీ ప్రయివేటు సంస్థగా మారుతుందన్నమాట! ఆలా కాకుండా ఆర్టీసీని కాపాడుకోవాలంటే ఐక్య ఉద్యమాలే మన ముందున్న ప్రధాన కర్తవ్యం.

కాల్ సెంటర్ ఫిర్యాదులను డిజిటలైజ్ చేయాలి : కలెక్టర్

నవతెలంగాణ- ఖమ్మం

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్‌లో ఉన్న కాల్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కాల్ సెంటర్‌లో నమోదైన ఫిర్యాదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే, ధాన్యం కొనుగోలు, పత్తి కొనుగోలులో ప్రజలకు, రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్ 1077కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని, ఆ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. 1077కు వచ్చే ప్రతి ఫిర్యాదులను డిజిటలైజేషన్ చేసి ప్రతిరోజు నివేదిక అదనపు కలెక్టర్‌కు అందించాలని కలెక్టర్ అన్నారు. కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారం లభించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజ, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, కాల్ సెంటర్ ఇంచార్జ్ రజిత పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన సీపీ

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిధిలోని సువర్ణాపురం రెవిన్యూలో ఉన్న ఉషశ్రీ కాటన్, జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఖమ్మం సీపీ సునీల్ దత్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పత్తి కొనుగోలు, ట్రాన్స్పోర్ట్ బిల్లులతో పాటు, తేమ శాతాన్ని ఆయన నిశితంగా పరిశీలించి రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పత్తి విక్రయదారుల్లో దళారులు ఉన్నారా అని ఆయన ఆరా తీశారు. పత్తి కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని సీపీ సునీల్ దత్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ముదిగొండ సీఐ మురళి, నేలకొండపల్లి ఏఎంసి సెక్రెటరీ నాగేశ్వరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశాలు

- ఘనంగా జరిగిన శాఖ, మండల మహాసభలు
- డిసెంబర్ 18, 19 తేదీలలో సత్తుపల్లిలో జిల్లా మహాసభలు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం




డిసెంబర్ 18,19 తేదీలలో సీపీఐ(ఎం) జిల్లా 22వ మహాసభలు సత్తుపల్లి పట్టణంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27, 28 తేదీలలో ఖమ్మం సుందరయ్య భవనంలో జిల్లా కార్యదర్శివర్గం, జిల్లా కమిటీ సమావేశాలు జరుగుతాయని, ఈ సమావేశాలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య పి.సుదర్శన్‌రావులు హాజరవు తారని తెలిపారు. పార్టీ శాఖా మహాసభలు సెప్టెంబర్ నెలలో, మండల మహాసభలు అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించుకొని ఈ మహాసభల్లో కొత్తగా మండల కార్యదర్శులుగా యువకులు ఎన్నికయ్యారని తెలిపారు. డివిజన్ మహాసభలు డిసెంబర్ నెల మొదటి వారంలో జరుగుతాయని, జిల్లా మహాసభ డిసెంబర్ 18, 19 తేదీల్లో సత్తుపల్లి పట్టణంలో నిర్వహిస్తున్నట్లు తన ప్రకటనలో కోరారు. ఈ మహాసభల్లో ఈ మూడు సంవత్సరాల కాలంలో పార్టీ నిర్వహించిన అనేక పోరాటాలు, ఆందోళనలు, పార్టీ నిర్మాణంపైన చర్చలు జరుగుతాయని, భవిష్యత్‌లో రాబోయే 3 సం.లలో పార్టీ బలోపేతానికి మహాసభల్లో రాజకీయ నిర్మాణ కర్తవ్యాలను తీసుకోనున్నట్లు తెలిపారు. డిసెంబర్ నెలలో జరిగే పార్టీ డివిజన్ మహాసభలను, జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.



పండ్రేగుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో పండ్రేగుపల్లిలో ముదిగొండ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి సోమవారం లాంఛనీయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను నమ్మకుండా నేరుగా రైతులు కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించుకొని మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో కె.వెంకటరత్నం, ఏఈఓ ఇందు భవాని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, మాజీ జడ్పిటిసిలు పసుపులేటి దేవేంద్రం, మందరపు నాగేశ్వరరావు, గ్రామ మాజీ సర్పంచ్ ఓబినబోయిన అమరయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుపులేటి వెంకట్, ఉసికల రమేష్, మల్లెల అజయ్, మందరపు ఉపేందర్ రావు, ముత్తినేని సత్యనారాయణ, సొసైటీ సిబ్బంది పలువురు రైతులు పాల్గొన్నారు.



రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలి


- ముమ్మరంగా ధాన్యం కొనుగోలు చేయాలి
- ఐకేపి ప్రాజెక్టు జిల్లా మేనేజర్ బి.దర్గయ్య

నవతెలంగాణ-కల్లూరు

ధాన్యం కొనుగోలు ముమ్మరం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని ఐకెపి ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ బీ.దర్గయ్య ఆదేశించారు. సోమవారం పుల్లయ్య బంజర గ్రామ శివాలయం వద్ద ఐకెపి, డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. చినిగిపోయిన గన్నీ సంచులు పంపుతున్నారని ఆరోపిస్తూ రైతులు చిరిగిపోయిన గన్నీ సంచులు చూపించారు. ఇక నుండి చినిగిపోయిన సంచులు రాకుండా జాగ్రత్త పడతామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకట్రామారావు, ధాన్యం కొనుగోలు గ్రూప్ సభ్యులు పి.రామలక్ష్మి, బుర్రి లక్ష్మి, నున్న రజిని, వాసిని భద్రమ్మ, రైతులు అబ్బూరి శ్రీనివాసరావు, చిత్తూరు రామారావు, గంగవరపు రాంబాబు, కృష్ణశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక గ్రూపుల్లో కొత్త సభ్యులను చేర్చుకోండి

స్వయం సహాయక గ్రూపుల్లో 18 నుండి 60 సంవత్సరాల లోపు ఉన్న వారిని అందర్నీ సభ్యులుగా చేర్చుకోవాలని ఐకెపి ప్రాజెక్టు జిల్లా మేనేజర్ బి.దర్గయ్య కోరారు. సోమవారం స్థానిక ఉషోదయ మండల మహిళ సమాఖ్య సమావేశంకి ఆయన హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఏపిఎం వెంకట్రామారావు, గ్రామ దీపికలు, గ్రామ సమాఖ్య అధ్యక్షులు, సీసీలు హాజరయ్యారు.



ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలుచేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని నాయుడుపేట గ్రామంలో సీపీఐ(ఎం) శాఖ మహాసభ షేక్ ఖాసీం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ మహాసభలో ప్రసాద్ మాట్లాడారు. ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయలకు అతీతంగా గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని, ఎటువంటి పక్షపాతం లేకుండా అర్హులైన పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలని కోరారు. రాజకీయ వివక్ష చూపెడితే దానికి తగిన ప్రతిఫలం అనుభవిస్తారని హెచ్చరించారు. కుటుంబ సమగ్ర సర్వే పేరుతో ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు. పెన్షన్లు, రేషన్ కార్డులు, రుణమాఫీ, రైతు భరోసా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన శాఖ కార్యదర్శిగా కస్తాలా అంటోనీ, సహాయ కార్యదర్శిగా లింగాల సునీల్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సీపీఎం నాయకులు తోట పెద్ద వెంకటరెడ్డి, నందిగామ కృష్ణ, పి.మోహన్‌రావు, వై.ప్రసాదరావు, లింగాల సుజాత, నరసింహారావు, మధుసూదన్‌రావు, కృష్ణ, రవి, శ్రీకాంత్, శ్రీను, రవీందర్, వెంకన్న, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఇళ్లల్లో మేం ఉండలేమ్..!

భయం గుప్పెట్లో డబల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు

- ఇల్లు వదిలి వెళ్లిపోయిన ఓ కుటుంబం
- నరకకూపంలో నివాసం ఉంటున్నాం : లబ్ధిదారులు

నవతెలంగాణ - బోనకల్

"ఈ డబల్ బెడ్ రూమ్ ఇల్లు మాకు వరం కాదు నరకం... ఈ ఇళ్లల్లో మేము ప్రతిరోజు భయంతోనే జీవనం సాగిస్తున్నాం. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో బతుకు బండి లాగిస్తున్నాం... ప్రతిరోజు ఏదో ఒక ఇంటిలో ప్రమాదం జరుగుతూనే ఉంది. వర్షం వస్తే ఈ ఇళ్లల్లో ఉండే పరిస్థితి ఉండదు. అయినా మరొక మార్గం లేక గత్యంతరం లేక ప్రాణ భయంతో బతుకు బండి లాగిస్తున్నాం. ఇవి ఇల్లు కాదు మా పాలిటి మృత్యువుకూపాలు". ప్రాణ భయంతో ఓ ఇంటి యజమానురాలు ఇంటిని వదిలి మరో ఇంట్లో నివాసం ఉంటుంది. ఇది ఎక్కడో గిరిజన ప్రాంతంలో జరిగిన సంఘటన కాదు. సాక్షాత్తు ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ హాయంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్ల బాగోతం.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని, కానీ తాము అలా కాదు అంటూ కేసీఆర్ ప్రగల్భాలు పలుకుతూ తాము కట్టించే ఇల్లు విశాలంగా నాణ్యంగా ఉంటాయని ప్రకటిస్తూ మండల



స్లాబ్ పెచ్చులు ఊడిన దృశ్యం



మెట్లు కూలిపోయిన దృశ్యం

పరిధిలోని రావినూతల గ్రామంలో 20 డబల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించారు. ఏ ఒక్క ఇల్లు కూడా స్లాబ్ పెచ్చులు ఊడకుండా, గోడల నెర్రెలు ఇవ్వకుండా లేవంటే ఆ ఇల్లులు ఎలా ఉన్నాయో అర్థం అవుతుంది. తాజాగా చితిరాల రామకృష్ణ కుటుంబం డబల్ బెడ్ రూమ్ ఇంటిలో నివాసం ఉంటున్నాడు. అయితే భార్య సుహాసిని ఇంట్లో ఉండగా ఒక్కసారిగా స్లాబ్ పెచ్చు ఊడి ఆమె భుజంపై పడింది. వెంటనే తప్పించుకోవటంతో చిన్న పాటి గాయంతో బయటపడింది. తాళ్లూరి భవాని తన ఇల్లు మెట్లు కూలిపోవడంతో భయంతో ఆ ఇంటిని వదిలి మరోచోట నివాసం ఉంటుంది. ఏ ఇంటికి వెళ్లినా లబ్ధిదారుల కన్నీరు గాదే. 20 డబల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా ప్రమాదకరంగానే ఉన్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది లబ్ధిదారులు ఇల్లు వచ్చిన తర్వాత స్లాబులు ఊడిపోవడం, గోడలు నెర్రలు ఇవ్వడంతో మరమ్మత్తులు కూడా చేయించుకున్నారు. అయినా స్లాబ్ పెచ్చులు ఊడి పడుతూనే ఉన్నాయి. ప్రతి గోడ స్లాబ్ నుంచి పగుళ్లు పడి ఉన్నాయి. డబల్ బెడ్ రూమ్ ఇల్లు చూస్తే ఏ పక్క చూసినా గోడలు మొత్తం పగుళ్లు వచ్చి ఉన్నాయి. ఏ ఇంటి స్లాబు కూడా నాణ్యంగా లేదు. ప్రతి ఇంటి స్లాబ్ పెచ్చులు ఊడి పడుతూనే ఉన్నాయి. అయినా దినదిన గండంతో ఆ ఇంటిలోనే మరో మార్గం లేక నివాసం ఉంటున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తున్నారంటే ఎంతో ఆనందపడ్డామని, కానీ ఐదు ఆరు నెలలకే ఆ ఇళ్లల్లోకి ఎందుకు వచ్చామని బాధపడని రోజు లేదంటూ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి ప్రమాదకరమైన డబల్ బెడ్ రూమ్ ఇంట్లో భయం గుప్పెట్లో బతుకుతున్నామని లబ్ధిదారులు ఆవేదన ఆక్రందన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలతో ఇల్లు మొత్తం నీటిలో మునిగిపోయాయని ఎవరికి చెప్పినా కనీసం వచ్చి చూసిన వారే లేరని నవతెలంగాణ ముందు లబ్ధిదారులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

బయట వర్షపు నీరు ఇంట్లోకి వస్తున్నాయి : బాణాల ఏసు పాదం



ఇంటి గోడల పునాదులు నాణ్యంగా, బలంగా లేకపోవడంతో బయట వర్షపనీరు కూడా తన ఇంట్లోకి వస్తుంది. వర్షం వస్తే బయట వర్షపు నీరు వంటగది నిండా చేరుతుంది. ఆ నీటిని భార్యాభర్తలం కలిసి ఎత్తి బయట పోస్తున్నాం. ఇల్లు మొత్తం గోడలో నెర్రెలు ఇచ్చాయి. స్లాబ్ మొత్తం అప్పుడప్పుడు పెచ్చులు ఊడి పడుతున్నాయి. వర్షాలు సమయంలో భయం గుప్పెట్లోనే ప్రాణాలు అరచేతిలో పట్టుకొని జీవిస్తున్నాము. ఈ ఇళ్లల్లోకి ఎందుకు వచ్చామా అని బాధపడని రోజు లేదు.

వర్షం వస్తే స్లాబ్ కురుస్తుంది : తాళ్లూరి దయామణి



వర్షం వస్తే ఇంట్లో ఉండే పరిస్థితి ఉండదు. ఆ రోజంతా ఎవరో ఒక ఇంటిలో తల దాచుకోవాల్సిందే. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని బతుకుతున్నాము. ఇంతటి నరకయాతన తాము ఏనాడు పడలేదు. ప్రభుత్వం ఆనాడు ఎంతో గొప్పగా చెబితే తమకు ఇల్లు వచ్చిందని ఎంతో ఆనందపడ్డాం. ఆ తర్వాత ఐదారు నెలలకే ఈ ఇంట్లోకి ఎందుకు వచ్చామని అర్థమైంది. మా బాధల గురించి పట్టించుకున్న వారే కరువయ్యారు.

రైతు, కార్మిక హక్కుల పరిరక్షణకై

26న కలెక్టరేట్ వద్ద ధర్నా

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్

నవతెలంగాణ- ఖమ్మం



నరేంద్ర మోడీ అధికారంలో వచ్చిన నాటి నుండి రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక హక్కులను హరిస్తూ కార్పొరేట్ శక్తుల, మతోన్మాద శక్తుల అభివృద్ధికి పాలన కొనసాగిస్తున్నాడని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ అన్నారు. సోమవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్య నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దు చేస్తూ పని గంటలను పెంచుతున్నారని, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ పెట్టుబడుదారులకు కారుచౌకగా అమ్మే వేస్తున్నారని, దాని ఫలితంగా మరింత నిరుద్యోగం పెరుగుతుందని, ఆర్థిక సంక్షోభం విపరీతంగా పెరుగుతున్నదని, అధిక ధరలు పెరుగుతున్నాయన్నారు. మరోవైపు రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధర రావటం లేదని అన్నారు. గతంలో ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ రంగంలోని మూడు నల్ల చట్టాలను రైతుల పోరాట ఫలితంగా రద్దు చేసినప్పటికీ రైతాంగానికి ఎలాంటి మేలూ కలగటం లేదని, పురుగుల, ఎరువుల మందుల ధరలను విపరీతంగా పెంచుతున్నారని అన్నారు. ఆరుగాలం కష్టపడ్డ రైతులకు ధర లేక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలకు గురవుతున్నారని, ఇవన్నీ కూడా ప్రభుత్వ హత్యలే అన్నారు. రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధరలు ఉంటే రైతాంగ పంటలకు ప్రోత్సాహకాలు ఉంటే రైతు పండించిన పంటలు 50 శాతం ప్రభుత్వం పెట్టుబడిగా సహకరిస్తే ఇలాంటి ఆత్మహత్యలు ఉండవని అన్నారు. రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మరోవైపు రెక్కల కష్టమే ఆస్తిగా చెమట చుక్కలే పెట్టుబడిగా పనిచేస్తున్నటువంటి వ్యవసాయ కార్మికులకు ఎలాంటి హక్కులు లేవు అన్నారు. వారికి కేటాయించిన ఉపాధి హామీ పనిని రద్దు చేయాలనే కుట్ర ప్రధాని మోడీ చేస్తున్నారని అన్నారు. సంవత్సరం బడ్జెట్ నుండి నిధులను తగ్గిస్తున్నారని, వంద రోజులు జరగవలసిన పని కేవలం 30, 40 రోజులు మాత్రమే జరుగుతున్నదని, చేసిన పనికి బిల్లులు రాక వ్యవసాయ కూలీలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉపాధి కూలీల పనిలో అనేక కొర్రీలు పెడుతున్నారని, డోన్ కెమెరాలతో పని పరిశీలనని ఆన్లైన్ పేమెంట్ అని, రెండు ఫోటోలు అని కూలీలను భయభ్రాంతులను చేస్తున్నారు. వారు పనికిరాకుండా చేసేందుకు కుట్ర చేస్తున్నారని, వ్యవసాయ రంగాన్ని పరిరక్షించాలని, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రెండు వందల రోజులు పని కల్పించాలని, బడ్జెట్లో రెండు లక్షల 50 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని, రోజుకు 600 కూలీ వేతన ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మరోవైపు దేశంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తు ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా కట్టబెడుతుందని అన్నారు. ఈ పది సంవత్సరాల కాలంలో బడా పెట్టుబడి దారులు కట్టవలసిన 20 లక్షల కోట్ల రూపాయల అప్పులను రద్దు చేయటం దుర్మార్గమన్నారు. ఈ తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని పరిరక్షించాలని సంయుక్త కిసాన్ మోర్చా అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా ఖమ్మం కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక, రైతు సంఘం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు జరుగు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, వత్సవాయి జానకి రాములు, పొన్నగంటి సంగయ్య, తాళ్లపల్లి కృష్ణ, కొండెబోయిన నాగేశ్వరరావు, జాజిరి శ్రీనివాసరావు, బంధం రాజ్యం, తేలపోలు రాధాకృష్ణ, తన్నీరు కృష్ణార్జునరావ్, వడ్లమూడి నాగేశ్వరరావు, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, బంధం శ్రీనివాసరావు, బాదావత్ శ్రీనివాస్, గామాస్ జోగయ్య, గాయం తిరుపతిరావు, అంగిరేకుల నరసయ్య, మూడు గన్యానాయక్, ఇటికల లెనిన్, తూము సుధాకర్,. ప్రసాద్, విశ్వనాథం, వేల్పుల భద్రయ్య, నంద ప్రసాద్, నెర్సుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తిలో ఉన్నవారు....

సేవాభావం కలిగి ఉండాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు

నవ తెలంగాణ - బోనకల్



వైద్య వృత్తిలో ఉన్నవారు ప్రధానంగా సేవ భావం కలిగి ఉండాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. మండల పరిధిలోని పెద్ద బీరవల్లి గ్రామంలో ఎనమద్ది సురేష్ నూతనంగా ఏర్పాటు చేసిన సాయి మణికంఠ మెడికల్ షాపును సోమవారం పోతినేని సుదర్శన్‌రావు ప్రారంభించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో గల మెడికల్ షాపులు సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. ప్రతి రోగానికి మందుల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బంది కరమన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో మెడికల్‌షాపులలో ప్రాథమిక చికిత్సకు సంబంధించిన అన్ని రకాల మందులు దొరుకుతున్నాయన్నారు. విద్య, వైద్య రంగాలలో ఉన్నవారు ప్రధానంగా సామాజిక స్పృహ కలిగి ఉండాలని కోరారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారి సురేష్, గ్రామస్తులు ఎనమద్ది వేణు, ఎనమద్ది రాధాకృష్ణ, రెడ్డిబోయిన ఉద్దండు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఆళ్ల పుల్లమ్మ, మిరియాల వెంకటకృష్ణ, సిపిఎం మండల కమిటీ సభ్యులు చట్టు వీరబాబు, సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శిలు చింతలచెరువు రమేష్, పెద్దపోలు రామారావు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎనమద్ది శ్రీనివాసరావు, టిడిపి గ్రామ అధ్యక్షుడు ఎనమద్ది ఆదినారాయణ, సిపిఎం నాయకులు పెద్దపోలు కోటేశ్వరరావు, ఆళ్ళ ప్రసాద్, మెడికల్ షాప్ యజమాని ఎనమద్ది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సత్యనారాయణకు పరామర్శ



పెద్ద బీరవల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు ఎనమద్ది సత్యనారాయణను పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు సోమవారం పెద్ద బీరవల్లి గ్రామంలో పరామర్శించారు. ఎనమద్ది సత్యనారాయణ గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలిసి పోతినేని సుదర్శన్‌రావు సత్యనారాయణను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారి సురేష్, సిపిఎం నాయకులు పెద్దపోలు కోటేశ్వరరావు, చింతలచెరువు రమేష్, పెద్దపోలు రామారావు, చట్టు వీరబాబు, ఎనమద్ది రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కళ్యాణం వెంకటేశ్వరరావు, తుమ్మ విష్ణువర్ధన్
- ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎంపీ రఘురాంరెడ్డికి వినతి

నవతెలంగాణ- ఖమ్మం



ఆటో, కారు, ట్రాక్టర్, లారీ, గూడ్స్, ఆటోమొబైల్ మెకానిక్స్, పెట్రోల్ బంకు వర్కర్లు రవాణా రంగం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, నూతన చట్టాలను సవరణ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కళ్యాణం వెంకటేశ్వరరావు, తుమ్మ విష్ణువర్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలోని ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎంపీ రఘురాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు రవాణా రంగం, కార్మికుల సమస్యలను జోక్యం చేసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయం తర్వాత ఉపాధి అవకాశాలను కల్పించటంలో రవాణా రంగం రెండవ స్థానంలో ఉందని, రవాణా లేని సమాజాన్ని మనం ఊహించలేమన్నారు. అటువంటి ముఖ్యమైన కీలకమైన రంగం నేడు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిందనానరు. డీజిల్ ధరలు, బీమా ప్రీమియం, టోల్ ఛార్జీల అసాధారణ పెరుగుదల ఈ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలన్నారు. ఈ రంగాన్ని పునరుద్దరించి, బలోపేతం చేసే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఏఐఆర్టీడబ్ల్యూ ఎఫ్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.విక్రమ్, ఉపేందర్ మాట్లాడుతూ రోడ్డు రవాణా కార్మికులు అన్ని వాతావరణ పరిస్థితులలోను 24 గంటలూ రోడ్లపైనే ఉండాలన్నారు. వారి జీవితం ఎప్పుడూ ప్రమాదంలో ఉంటుందన్నారు. రోడ్డు రవాణా కార్మికులలో 90 శాతం మంది అసంఘటిత కార్మికులే అని, ఈ కార్మికులకు గంటల డ్యూటీ, వారానికోసారి విశ్రాంతి, పిఎఫ్, ఇఎస్ఐ వంటి చట్టబద్ధమైన నిబంధనలు వర్తించవు అని అన్నారు. దారి పక్కన ఉండాల్సి సౌకర్యాలు , భద్రతా ఏర్పాట్లు కూడా తీవ్రంగా 'నిర్లక్ష్యం చేయబడ్డాయన్నారు. పోలీసు, రవాణా శాఖ అధికారుల అక్రమ, అకారణ జరిమానాలు, వేధింపులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ పద్ధతులకు స్వస్తి పలకాలని అన్నారు. నేషనల్ పర్మిట్ వాహనాలపై డబుల్ డ్రైవర్ల నిబంధనను పునరుద్ధరించాలని అన్నారు.అన్ని జాతీయ రహదారులపై డ్రైవర్లకు రహదారి పక్కన విశ్రాంతి గదులతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొట్ల సాగర్ పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-బోనకల్

మండల కేంద్రంలో గల దివ్య దయాల్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం దుప్పట్లను పంపిణీ చేశారు. చేతన ఫౌండేషన్ చైర్మన్ వెనిగళ్ళ రవికుమార్ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు సూర్యదేవర వంశీకృష్ణ తెలిపారు. అనంతరం వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చేతన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెనిగళ్ళ రవికుమార్ సమాజంలో అట్టడుగువర్గాల ప్రజలకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య

నవతెలంగాణ-బోనకల్



ఆర్థిక ఇబ్బందులు కుటుంబ కలహాలతో ఓ వృద్ధుడు మోటమర్రి మధిర రైల్వే స్టేషన్ మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జి ఆర్‌పిఎఫ్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మధిర - మోటమర్రి రైల్వే స్టేషన్‌ల్ల మధ్యన కిలోమీటర్ నెంబర్ 528/12-14 దిగువ మెయిన్ లైన్ రైలు పట్టాలపై వెళుతున్న గూడ్స్ రైలు కింద ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం విభరింతలపాడు గ్రామానికి చెందిన కొత్త శ్రీనివాసరావు (60) ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఖమ్మం జీఆర్‌పి ఎస్ఐ పి. భాస్కర రావు నమోదు చేయగా మధిర జీఆర్‌పి అవుట్ పోస్ట్ ఇన్చార్జ్ ఎస్.వేణుగోపాల్ రెడ్డి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని రైలు పట్టాల నుంచి మధిర ఆర్కే ఫౌండేషన్ దోర్నాల రామకృష్ణ సహాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

ఆనారోగ్యంతో ప్రయివేట్ లెక్చరర్ యేబు మృతి

- నివాళులర్పించిన సీపీఐ(ఎం), ఐలూ నాయకులు

నవతెలంగాణ-కొణిజర్ల



ఆనారోగ్యంతో ప్రయివేట్ లెక్చరర్, సీపీఐ(ఎం) సానుభూతిపరుడు పాపగంటి యేబు (50) సోమవారం మృతి చెందారు. మండల పరిధిలోని చిన్నమునగాల గ్రామానికి చెందిన పాపగంటి యేబు గత ఇరవై సంవత్సరాలుగా రూమాటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధితో బాధపడుతున్నారు. రానురాను వ్యాధి తీవ్రత పెరగడంతో ఆనారోగ్యానికి గురై ఉదయం తన నివాసంలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంఏ, బీఈడీ చేసిన యేబు పట్టణంలోని పలు ప్రయివేట్ విద్యాసంస్థలలో హిస్టరీ లెక్చరర్‌గా సుదీర్ఘ కాలం పనిచేశారు. యేబుకి భార్య, ఇద్దరు కూమారులున్నారు. యేబు సీపీఐ(ఎం) సానుభూతి పరుడు కావడంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) జిల్లా నాయకులు తాళ్లపల్లి క్రిష్ణ, ఐలూ బార్ కౌన్సిల్ సెక్రటరీ చింతనిప్పు వెంకట్ యేబు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, చింతనిప్పు నాగేశ్వరరావు, పాపగంటి నాగార్జున్, ఆశీర్వదం, సుధాకర్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

నవతెలంగాణ-తల్లాడ



తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తల్లాడలో సోమవారం పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకుడు కనగాల సాంబశివరావు, జిల్లా నాయకులు కేతినేని హరీష్ ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేయించుకోవాల్సిందిగా పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కూచిపూడి సూచించారు. ఈ కార్యక్రమంలో మొక్క కృష్ణార్జున, వెంకటేశ్వరరావు, నరసింహారావు, చల్లా వెంకన్న, పెద్దబ్బాయి, బొడ్డు మల్లయ్య, ఎండి.బాబు, సరికొండ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేపై విస్తృత ప్రచారం

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని చెన్నూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దంతాల సుధాకర్ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమగ్ర సర్వేపై ప్రజలకు కొన్ని అపోహలు సందేహాలు ఉన్నాయని గ్రహించి ప్రజలకు సమగ్ర సర్వేపై అవగాహన కల్పించారు. బైకుపై మైకు ద్వారా కార్డు బోర్డు ద్వారా ప్రజల్లోకి వెళ్లి కల్లూరు మండల వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం కల్లూరు లింగాల చెన్నూరు తదితర గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడారు.

నేడు సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం

నవతెలంగాణ-కూసుమంచి



నేడు సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్ (రాజు) సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల కమిటీ సభ్యులందరూ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశం మండల కేంద్రంలోని ఎడవల్లి పద్మారెడ్డి భవనంలో ఏర్పాటు చేయడ జరిగిందని, ఈ సమావేశంలో పార్టీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, మండల ఇన్‌చార్జి బుగ్గావీటి సరళ పాల్గొంటారని పేర్కొన్నారు.

గుండెపోటుతో నాలుగేండ్ల చిన్నారి మృతి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



గుండెపోటుతో నాలుగేండ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలంలోని ఎం.వెంకటాయపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ నాయకుడు కుర్రా వెంకన్న కుమారుడు, కుర్రా వినోద్,లావణ్య దంపతుల కూతురు హర్షిత(4) సాయంత్రం సమయంలో ఇంటి ఆవరణలో ఆడుకుంటుంది. ఆడుకుంటూ ఒకేసారి చాతిలో నొప్పి అంటు కుప్ప కూలిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు ఖమ్మం ఆసుపత్రికి తరలించగా అప్పటికే చిన్నారి మృతి చెందింది. గుండె పోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు స్థానికులు తెలిపారు. అల్లారుముద్దుగా ఆడుతూ పాడుతూ ఉండే ఒక్కగానొక్క కూతురు హఠాత్తుగా కండ్లముందే మృతి చెందడంతో చిన్నారి తల్లితండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. చిన్నారిని చూసేందుకు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, బి.వెంకయ్య, యాదగిరి, పల్లయ్య, సత్యం, రాందాసు తదితరులు చిన్నారి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



జాతీయస్థాయి బాలోత్సవంలో వాణి వివేకానంద విద్యాలయం విద్యార్థులు ప్రతిభ

నవతెలంగాణ-వైరా

జాతీయస్థాయిలో బాలోత్సవం మధిరలో ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించారు. బాలోత్సవంలో ప్రతిభ కనబరిచిన వాణి వివేకానంద విద్యార్థులు జాతీయస్థాయిలో సీనియర్ జానపద నృత్యం విభాగంలో ద్వితీయ బహుమతి సాధించి సత్తాచాటారు. వివిధ విభాగాల్లో ప్రథమ బహుమతి ఎం.సాయి ప్రసన్న, నీతి పద్యాలలో సీనియర్ విభాగంలో కన్సోలేషన్ బహుమతి ఎస్‌కె.సుల్తాన్, మహమ్మద్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ చుండూరు కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ చుండూరు వాణిలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు ఎటువంటి కాంపిటీషన్లోనైనా, అన్ని విభాగాల్లో ముందు ఉంటున్నారని, భవిష్యత్తులో కూడా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ గింజపల్లి జనార్ధన్, ఉపాధ్యాయులు, గాయని ఎస్‌కే. బేగం, డాన్స్ మాస్టర్ కిరణ్, ఉమా విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్




దళిత క్రైస్తవులకు ఎస్సీ హెూదా ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల క్రైస్తవ సమైఖ్య,చర్చి పాస్టర్ల సదస్సులు నిర్ణయించినట్లు బిషప్ సగిలి ప్రకాష్ తెలిపారు. మండలంలోని నాయుడుపేట వద్ద గల కరుణగిరి చర్చిలో సోమవారం పలువురు క్రైస్తవ సంఘ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సగిలి ప్రకాష్ మాట్లాడారు. జస్టిస్ కేజీ బాలకృష్ణ హైదరాబాద్ వస్తున్న సందర్భంగా క్రైస్తవులందరూ ఆయనను కలిసి వినతిపత్రం అందజేసి తమ సమస్యలను వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల రీజనల్ సెక్రెటరీ అశోక్ కుమార్, వికార్ జనరల్ మువ్వా ప్రసాద్, తొప్పెట శౌరి, పాస్టర్లు కొమ్ము బాబురావు, శేఖర్ బాబు, వేముల సత్యం, రాజశేఖర్, జయరాజు మాదాసు రాజు, కొమ్ము ఆంటోనీ, విజయ్, సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు శరగోపం.. దళారులకు అందలం

మోసానికి గురవుతున్న అన్నదాత

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

రైతే రాజు వినటానికి బాగున్నా అడుగడుగునా నిత్యం మోసపోయేది రైతే...ఇది అందరికీ తెలిసిన విషయమే. వ్యవసాయం చేసే రైతు ఉరితాడుకు వేలాడుతుంటే వారిని నమ్ముకొని వ్యాపారం చేసే దళారులు కోట్లకు పడగలు ఎత్తుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెద్ద ఎత్తున అందుబాటులోకి వచ్చిన కూడా రైతుల జీవితాలలో ఎటువంటి మార్పు కనిపించడం లేదు. దీనికి కారణం అడుగడుగునా రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని విత్తనాల దగ్గర నుంచి పురుగు మందుల దగ్గర నుంచి పండించిన పంట మార్కెట్లో అమ్ముకునే వరకు వివిధ రూపాలలో మోసానికి గురయ్యేది ఒక రైతు మాత్రమే. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు దళారులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి దళారులకు కొమ్ము కాస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారు. ఈ మధ్యకాలంలో జిల్లా కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో ఇట్టనే అర్థం చేసుకోవచ్చు. ఎవరు ఎంత ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారుల ఈ కక్కుర్తిలో మార్పు రానంత కాలం రైతుల జీవితాలలో వెలుగులు చూడలేము అన్నది కూడా నిర్వివాదాంశం. ప్రధానంగా రాష్ట్రంలో వరి పంట తర్వాత ఎక్కువగా సాగు అయ్యేది పత్తి పంట ఈ పత్తి పంటలో విత్తనాల దగ్గర విత్తనాల వాడు మోసం చేస్తే పురుగుమందుల దగ్గర పురుగుమందుల షాపు వాడు నాసిరకం మందులు ఇచ్చి రైతును అడ్డంగా దోచుకుంటున్నారు. ఎలా ఓలా అప్పు సపో చేసి పంట పండిస్తే మార్కెట్‌కు తీసుకువచ్చే సరికి దళారులు తాలు పేరుతో, తేమ పేరుతో దోచుకోవటానికి రాబందుల్లా కాచుకొని కూర్చుంటున్నారు. వీటన్నింటినీ పరిశీలించాల్సిన అధికారులు ఆయా స్థాయిలలో లంచాలు పంచుకొని రైతుల నడ్డి విరుస్తున్నారు. రాష్ట్రంలో సీసీఐ పేరుతో జిన్నింగ్ మిల్లుల పేరుతో జరుగుతున్న మోసం అంతా ఇంతా కాదు.. కోట్లాది రూపాయల చీకటి దందాలో రైతు అనబడే ప్రమిదలు ఆరిపోతున్నాయి. ప్రధానంగా పత్తి విషయంలో రైతు పడుతున్న మోసం అంతా ఇంత కాదు.



పాలు పేరుతో తేమ శాతం పేరుతో డబ్బు కటింగ్ పేరుతో రైతులను దోచుకుంటున్నారు. ఈ సమస్యలు పడలేని రైతులు మార్కెట్‌కు తీసుకురావటం దండగా అనే నిర్ణయానికి వచ్చి పండించిన పత్తిని ఇంటి వద్దనే దళారులకు ముట్టజెప్పి నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఈ పత్తి పంటతో వచ్చిన పైసలను మిగతా పెట్టుబడులకు ఉపయోగించుకుందామనుకునే రైతులకు గిట్టుబాటు ధర లభించక చివరకు పురుగుల మందే దిక్కు అవుతున్నది. ఇదంతా తెలిసినా అధికారులు పోయేది రైతు ప్రాణమేగా ఏడబోతే మాకే... మాకు రావాల్సినవి మాకు వస్తున్నాయి కదా అనే ధోరణితో కాసుల వర్షంలో మునిగితేలుతున్నారు. ఒక్క పత్తి సీజన్లోనే అధికారులు, వ్యాపారులు లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు అంటే ఏ స్థాయిలో రైతులను దోచుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇదంతా తెలిసిన ప్రభుత్వాలు కూడా రైతులకు ఎలా న్యాయం చేయాలని ఆలోచించకుండా ఉండటం వల్ల అధికారులు, దళారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. తప్పు జరిగితే సహించను అన్న కలెక్టర్ మాటలను అధికారులు ఆ వస్తారు అంటారు పోతారు అని తేలిగ్గా తీసుకున్నారు తప్ప అధికారులలో భయం ఏ కోశాన కూడా ఉండడం లేదు. ఎంతసేపటికి రోజు మాకు ఎంత వస్తుంది రైతు ఏడ పోతే మాకేంటి అన్న రీతిలో వివరిస్తుండటంతో రైతు నిలువు దోపిడీకి గురవుతున్నాడు. ఈ పరిస్థితి మారనంత కాలం రైతులకు న్యాయం జరగదని రైతులు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్థాయి అధికారులు పూర్తి పర్యవేక్షణలో ఉంటే తప్ప రైతుల జీవితాలలో మార్పు రాదు అని చర్చించుకుంటున్నారు.

రైతులను నష్టపరచ వద్దు

- తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు సత్యనారాయణరెడ్డి

నవతెలంగాణ-తల్లాడ



నిబంధనల ప్రకారం 40 కేజీల చొప్పున ధాన్యం కాటవేయాల్సి ఉండగా 41 కేజీల 200 గ్రాములు ధాన్యాన్ని రైతుల నుండి తీసుకుంటూ రైతులను నష్టపరుస్తున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి ఆరోపించారు. సోమవారం మండల పరిధిలోని నూతనకల్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెలంగాణ రైతు సంఘం మండల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌ఫోర్ట్ అయిన తర్వాత మిల్లర్లు తమ సొంత వే బ్రిడ్జి పై తూకం వేసి 41 కేజీల 200 గ్రాముల చొప్పున లెక్క గట్టి సహకార సంఘం వారు పంపించిన రసీదుపై మిల్లర్లు కొట్టివేసి, తక్కువ ధాన్యం వచ్చినట్లు రాస్తున్నారు. ఈ విషయంపై సివిల్ సప్లై అధికారులతో తాము మాట్లాడామని, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సహకార సంఘం అధికారులు పంపించిన రసీదులను కొట్టి వేసి రాసిన ఆధారాలు రైతు సంఘం వద్ద ఉన్నాయన్నారు. గన్ని సంచులు రైతులకు సరిపడా అందటం లేదని వెంటనే గన్నీసంచలను అవసరమైన రైతులకు అందించాలన్నారు. కాటావేసిన ధాన్యానికి వెంటనే డబ్బులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్తో సహా రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. సంబంధిత అధికారులు సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో రైతులందరినీ సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి నల్లమోతు మోహన్‌రావు, కళ్యాణ కృష్ణయ్య, అయినాల రామలింగేశ్వరరావు, దారెల్లి కృష్ణయ్య, నరసింహారావు, కళ్యాణ పేరయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలు కుంటుంబాలకు ఎంపీ రాఘురాంరెడ్డి పరామర్శ

నవతెలంగాణ-తల్లాడ



ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి సోమవారం తల్లాడ మండలంలో పలు కుటుంబాలను పరామర్శించారు. మిట్టపల్లి ఎర్రమల లక్ష్మీ నరసింహారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం నూతనకల్ గ్రామంలో గణేష్ల రవి తల్లి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దిరిశాల నరసింహారావు, శీలం కోటారెడ్డి, యాకూబ పాషా, సత్యనారాయణ, ఆదోని దాసురావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో చొరవతో ధాన్యం దిగుమతి

- సహకరించిన మిల్లర్లు

నవతెలంగాణ-పెనుబల్లి



ఐకెపి కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని స్థానిక మిల్లర్లు దిగుమతి చేసేందుకు ముందుకు రాకపోవడంతో ఆర్డీవో ఎల్.రాజేంద్రగౌడ్ చొరవతో రైతుల ధాన్యాన్ని సోమవారం మిల్లర్లకు అప్పగించారు. మండలంలోని మండలపాడు గ్రామంలోని ఐకెపి కేంద్రాల వద్ద రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని స్థానిక మిల్లర్లు దించుకోకపోవడంతో రైతులు ఐకెపి అధికారులు, ఆర్డీఓకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్డిఓ కల్పించుకొని మిల్లర్లను సంప్రదించి ధాన్యాన్ని దిగుమతి చేసుకునేలా చేసి సమస్యను పరిష్కరించారు. గన్ని బ్యాగుల కొరత కూడా ఐకెపి కేంద్రాల్లో ఉన్నదని ఆర్డీవో దృష్టికి తేవడంతో అధికారులతో సంప్రదించి సమస్యను పరిష్కరించారు. ఆర్డిఓ వెంట తహసీల్దార్ జి. ప్రతాప్, ఐకెపి ఏపీవో నాగ పుల్లారావు పాల్గొన్నారు.

హోమియోపతి ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేష్ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-ముదిగొండ



మండల కేంద్రమైన ముదిగొండ హెూమియోపతి (యోగ) ఇన్స్‌పెక్టర్‌గా బలుసుపాటి వెంకటేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హెూమియోపతి వైద్యానికి గత పది సంవత్సరాల నుండి ఇన్చార్జి వైద్యాధికారి కొనసాగుతున్నారు. హెూమియోపతి ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతల తీసుకున్న వెంకటేష్ పతాంజలి యోగ టీచర్స్ ట్రైనింగ్‌లో, కోర్స్ పూర్తి చేయటంతో ఆయుష్ వైద్య విభాగంలో ఔట్సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగం పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులోని వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. యోగ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్‌కు వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, సత్యవతి, కుమారి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

నవతెలంగాణ-పెనుబల్లి



వరసదొంగతనాలు పెనుబల్లి మండల ప్రజలను కలవరపెడుతున్నాయి. తాళాలు వేసున్న ఇల్లు, దుకాణాలను టార్గెట్‌గా దుండగులు చోరీకి పాల్పడుతున్నారు. పెనుబల్లి మండలం లింగగూడెం గ్రామంలో శుక్రవారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున మండాలపాడు గ్రామంలో 5 ఇళ్లలో, లంకసాగర్ అడ్డరోడ్‌లోని దుకాణాల్లో తాళాలు పగలుకొట్టి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి దొరికిన సొత్తుని అవహరించుకుపోయారని బాధితులు వీఎం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లింగగూడెం గ్రామంలో చీకటి రాజ శుక్రవారం రాత్రి వీఎం.బంజర్ గ్రామంలోని అన్న గృహప్రవేశ కార్యక్రమానికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ప్రవేశించి బీరువాలను పగలగొట్టి 96 గ్రాముల బంగారు ఆభరణాలను, వెండి సామాగ్రిని అపహరించారని ఫిర్యాదు చేశారు. మండాలపాడు గ్రామంలో దోసపాటి లక్ష్మణరావు సోమవారం తెల్లవారుజామున కార్తీక సోమవారం సందర్భంగా నీలాద్రి ఆలయానికి వెళ్లడంతో దుండగుడు తలుపు గడియను విరగగొట్టి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డాడని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కొన్ని నెలల క్రితం వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను వియ్యం బంజర పోలీసులు పట్టుకొని దొంగిలించిన సొత్తును రికవరీ చేసి దుండగులను రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం, సోమవారం నాడు జరిగిన దొంగతనాలపై బాధితుల ఫిర్యాదుతో వియం. బంజర్ ఎస్సై కే. వెంకటేష్ విచారణ చేపట్టారు.

ఇందిరమ్మ ఇండ్లను తక్షణమే మంజూరు చేయాలి

- ప్రజావాణిలో సీపీఐ(ఎం), సీపీఐ నాయకులు వినతి

నవతెలంగాణ-బోనకల్



గూడు పేదల చిరకాల కల అని, ఇందిరమ్మ ఇళ్లను తక్షణమే మంజూరు చేసి పేదలను ఆదుకోవాలని సీపీఐ(ఎం), సీపీఐ మండల కార్యదర్శులు కిలారి సురేష్, యంగల ఆనందరావు ప్రజావాణిలో సోమవారం ప్రత్యేక అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన దశాబ్ద కాలంలో కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు చెప్పిన తీరు, వాస్తవానికి పొంతన లేదన్నారు. నేటి ప్రజాపాలన ప్రభుత్వంగా చెప్పుకునే ప్రభుత్వం దీపావళికి ఇండ్లకు ముగ్గులు పోస్తామని, పేదలకు దీపావళి కానుక ఇస్తామని, ఈ నెల 5, 6 తేదీల నుంచి దరఖాస్తులను స్వీకరించి గ్రామసభల్లో లబ్ధిదారులను ఎంపికచేస్తామని మభ్యపెడుతూ పేదలను మనోవేదనకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివిధ సందర్భాల్లో చెప్పిన మాటలు నీటి మీద రాతలు గానే ఉన్నాయని, ఆచరణ మాత్రం శూన్యమన్నారు. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా దీపావళి పండుగ పోయి పదిహేడు రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఇందిరమ్మ ఇండ్ల వ్యవహారం ఓ కొలిక్కి రాలేదని విమర్శించారు. మార్చి నెలలో ఇండ్ల పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం ఏడు నెలలు పూర్తయి ఎనిమిదో నెల నడుస్తున్నా ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమన్నారు. నాటి కెసిఆర్ ప్రభుత్వం, నేటి ప్రజాపాలన ప్రభుత్వము ఇళ్ల మంజూరులో చిత్తశుద్ధితో పనిచేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పేదలను ఆదుకోవాలని, లేనియెడల పేదలను పెద్ద ఎత్తున సమీకరించి ప్రభుత్వంపై పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, నాయకులు గుంపుల జయరాజు, జి. మనీష్, సిపిఐ(ఎం) నాయకులు చింతల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వాలంటీర్లకు చట్టాలపై అవగాహన

నవతెలంగాన-ఖమ్మంలీగల్



పారా లీగల్ వాలంటీర్లకు చట్టాలపై న్యాయ చైతన్య అవగాహన సదస్సును ఖమ్మం జిల్లా న్యాయ సహాయ సంస్థ సెక్రటరీ కె.చంద్ర శేఖరరావు ఆధ్వర్యంలో జిల్లా పారా లీగల్ వాలంటీర్ల సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం, చట్టాలపై అవగాహనను కలింపించారు. పేదలకు, మహిళలకు, వికలాంగులకు, జిల్లా న్యాయ సేవా సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా సంస్థ, కేంద్ర న్యాయ సేవా సంస్థ అందించే సేవల గురించి వివరించారు. అలాగే లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తరుపున డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మల్లెబోయిన వలరాజు సమాజంలో జరుగుతున్న, సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి, డ్రగ్స్, మద్యపానం మొదలగు మత్తు వ్యసనాలపై మహిళలు, బాలికలపై జరుగుతున్న అగాయిత్యాలు, అత్యాచారాలపై గ్రామాలలో, పట్టణాలలో సదస్సులు నిర్వహించి వారిలో అవగాహనా చైతన్యాన్ని కలిగించాలని తెలియజేసినారు. అలాగే పారా లీగల్ వాలంటీర్లకు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి కె.చంద్రశేఖర్‌రావు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పారా లీగల్ వాలంటీర్లు, న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ బాలోత్సవంలో బాల భారతీ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-తల్లాడ



మధిరలో ఈనెల 15, 16 తేదీలలో నిర్వహించిన 27 వ రామభక్త సీతయ్య కళాపరిషత్ జాతీయ బాలోత్సవంలో బాలభారతి విద్యాలయ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. సీనియర్ ఉపన్యాసం విభాగంలో ఎస్సి హిరన్మయి ప్రథమ బహుమతిని గెలుచుకుంది. జూనియర్ ఉపన్యాసం విభాగంలో కే.భవాని ప్రథమ బహుమతిని సాధించి సత్తాచాటారు. జూనియర్ విభాగంలో యజ్ఞ అవినాష్ సీనియర్ విభాగంలో, మారుతి లక్ష్మీనరసింహ, ప్రోత్సాహక బహుమతి గెలుచుకున్నారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ఇంచార్జ్ శశాంక్ అభినందించారు.



అంబటికీ నివాళి

చింతకాని : మండల పరిధిలో నాగులవంచ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు తండ్రి, స్వాతంత్ర సమరయోధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబటి వీరయ్య ఇటీవల మరణించారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మెన్ మల్లు నందిని వారి నివాసంలో వీరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు మదుపల్లి భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కన్నబోయిన గోపి, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ పాషా, సీతంపేట మాజీ సర్పంచ్ నారపోగు కొండలు, కూరపాటి కిషోర్, ముదిగొండ మండల మాజీ జెడ్పిటిసి బుల్లెట్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.48 కోట్ల గంజాయి కాల్చివేత

• 54 కేసుల్లోని 993 కేజీల గంజాయి దాహనం



నవతెలంగాణ-కొత్తగూడెం

ఖమ్మం జిల్లా కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లందు, అశ్వరావు పేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో పట్టుబడిన 993 కేజీల గంజాయిని సోమవారం కాల్చి వేశారు. ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ జనార్ధన్ అదేశాల మేరకు 54 కేసుల్లో పట్టుబడిన గంజాయిని దాహనం చేశారు. కాల్చివేసిన గంజాయి విలువ రూ.2,48,25,000 ఉంటుందని అంచనా వేశారు. గంజాయిని తల్లాడ మండలం, గోపాల్‌పేట్ గ్రామంలో ఉన్న ఏడబ్ల్యూ కన్సటింగ్ లిమిటేడ్‌లో దహనం చేశారు. కొత్తగూడెం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 25 కేసుల్లోని 337.790 కేజీల గంజాయిని, పాల్వంచ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 15 కేసుల్లోని 408.371 కేజీల గంజాయిని, మణుగూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 2 కేసుల్లోని 52.520 కేజీల గంజాయిని, ఇల్లందు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 10 కేసుల్లోని 108.372 కేజీల గంజాయిని, ఆశ్వారావుపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 2 కేసుల్లోని 37.500 కేజీల గంజాయిని దాహనం చేయించినట్లు డిప్యూటి కమిషనర్ తెలిపారు. గంజాయిని దాహనం చేస్తున్న సమయంలో డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, అసిస్టేంట్ కమిషనర్ గణేష్, ఎక్సైజ్ సూపరిండెంట్ జానయ్య, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల సీఐలు పాల్గన్నారు. ఒకవైపు గంజాయిని పట్టుకుంటూనే మరో వైపు పట్టుకున్న గంజాయిని కాల్చి వేయిస్తున్న ఖమ్మం జిల్లా ఎక్సైజ్ అధికారులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్ రెడ్డి అభినందించారు.

20న సీపీఐ(ఎం) పట్టణ మహాసభ

• హాజరుకానున్న రాష్ట్ర, జిల్లా నాయకత్వం

• పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ సీపీఐ(ఎం) భద్రాచలం పట్టణ ఎనిమిదోవ మహాసభ ఈనెల 20న పట్టణంలోని గుప్త కన్వెన్షన్‌లో జరుగుతుందని పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి తెలిపారు. సోమవారం స్థానిక చందర్రావు భవనంలో జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రాగణంలో జరగనున్న ఈ మహాసభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మిడియం బాబురావు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్‌తో పాటు సీనియర్ నాయకులు యలమంచిలి రవికుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగని బ్రహ్మాచారిలు హాజరవుతున్నారని అన్నారు. గడిచిన మూడు సంవత్సరాల కాలంలో పార్టీ నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాల తోపాటు ఆటుపోటులపై చర్చించి భవిష్యత్తులో చేయవలసిన పోరాటాలను ఈ మహాసభలలో కర్తవ్యాలుగా తీసుకుంటామని అన్నారు. 300 మంది ప్రతినిదులు హాజరుకానున్న ఈ మహాసభ ఉదయం తొమ్మిది గంటలకు అమరవీరుల స్థూపం వద్ద జండా ఆవిష్కరణ నిర్వహించుకుని పట్టణంలో ప్రదర్శనగా మహాసభ ప్రాంగణానికి చేరుకొని అమరవీరులకు నివాళులర్పించి. మహాసభను ప్రారంభిస్తామని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యురాలు సున్నం గంగా, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, ఎర్రం శెట్టి వెంకట రామారావు, పారిల్లి సంతోష్ కుమార్, నాదెండ్ల లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

• దుమ్ముగూడెం దళిత కాలనీ వాసులు ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మా సమస్యలు పరిష్కరించండి అంటూ దుమ్ముగూడెం డబుల్ బెడ్ రూమ్ పరిధిలోని దళిత కాలనీవాసులు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మా గ్రామానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు రావడంలేదని, దీంతోపాటు గ్రామంలో ఉన్న మంచినీటి బోరు సైతం మరమ్మతులకు గురి అయిందని విన్నవించుకున్నారు. దీంతోపాటు సీసీ రహదారి ఏర్పాటు చేయాలని, పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గ్రామాలలో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించే బాధ్యత తనదేనని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల మృతి చెందిన దుమ్ముగూడెం గ్రామానికి చెందిన కుప్పిలి రాజేశ్వరి దశదినకర్మల్లో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండలంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు లంక శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి

• బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్



నవతెలంగాణ-పాల్వంచ

కొత్తగూడెం బస్టాండ్ ఎదురుగా అనుమతులకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలనే డిమాండ్‌తో బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30వ వార్డు మధురబస్తీలో జరుగుతున్న అక్రమ నిర్మాణంపై బీఎస్పీ ఆధ్వర్యంలో గత 6 నెలలుగా చేస్తున్న పోరాట క్రమంలో భాగంగా ఇటీవల గౌరవ హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ రాసినట్టు తెలిపారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ అట్టి లేఖను రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ వారికి సిఫార్సు చేయగా వారు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ ఈనెల 1వ తేదీన బిల్డింగ్ సీజ్ చేయనున్నట్టు నోటీసులు జారీ చేయగా అట్టి నోటీసుపై స్థల యజమాని హైకోర్టులో ఈనెల 5వ తేదీన రిట్ పిటిషన్ నెంబర్: 31033/2024 దాఖలు చేశారని అట్టి పిటిషన్ పై గౌరవ హైకోర్టు జస్టిస్ కె.లక్ష్మణ్ ఈనెల 7తేదీన ఇచ్చిన తీర్పులో స్థల యజమాని 8-ఫిబ్రవరి 2024న తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను 7రోజుల్లో సీజ్ చేయడం లేదా కూల్చివేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారన్నారు. నేటికీ అట్టి ఆదేశాలను అమలు చేయలేదని కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని గౌరవ హైకోర్టు ఆదేశాలను అమలు చేయని మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకొని, అనుమతులకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు జెట్టి ఆనందరావు, వంగా రవిశంకర్, కవిత, దీపిక తదితరులు పాల్గొన్నారు.

23న సీపీఐ(ఎం) మహాసభలు

• ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు



నవతెలంగాణ-మణుగూరు

కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) మహాసభలు వేదిక కావాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కొడిశాల రాములు అన్నారు. సోమవారం ఈ సందర్భంగా సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలో మండల మహాసభ 23న జరుగుతున్నదని, పార్టీ రాష్ట్ర నాయకులు పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభల్లో మణుగూరు ప్రాంతంలో ఉన్నటువంటి సింగరేణి నిర్వాసితుల సమస్యలు ప్రవేశపెట్టిన ఆరు పథకాలు అమలు తీరు చర్చిస్తారని, గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నటువంటి సమస్యలు ఎక్కడికి అక్కడే పేరుకు పోతున్నాయని అటు సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం యంత్రాంగం పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు, రాజు, పద్మ, గౌరీ, నిర్మల, కమల, హేమంతరావు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మెచ్చా విస్తృత పర్యటన



నవతెలంగాణ-అశ్వారావుపేట

మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజక ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు మండలంలో సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో పలు కుటుంబాలను పరామర్శించి వారికి ఇతోధిక ఆర్థిక సహాయం అందజేసారు. ముందుగా గుమ్మడవల్లిలో సాధనం పెద్ద వెంకటేశ్వరరావు దశదిన కార్యంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. అదే గ్రామంలో స్వర్ణ నాగేశ్వరరావు కుమారుడు ప్రమాదవశాత్తు గుంటూరులో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు ఆర్థిక సహాయం అందజేసారు. ఆసుపాకలో ఇటీవల విద్యుత్ ఘాతంతో పింగళి రాము ఇల్లు పూర్తిగా కాలి పోవడంతో వారి వద్దకు వెళ్లి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసారు. పట్టణంలో ఇటీవలే పాము కాటుకి గురై మృతి చెందిన గుమ్మడి నారాయణమ్మ కుటుంబాన్ని ఓదార్చారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శీమకుర్తి వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల నాయకులు మందపాటి రాజమోహన్ రెడ్డి, సత్యవరపు సంపూర్ణ కార్యకర్తలు ఉన్నారు.

నేడు ప్రజా పాలన-విజయోత్సవాల వేడుకలు

• విజయవంతం చేయాలి

• కలెక్టర్ జితేష్ వి.పాటిల్



నవతెలంగాణ-పాల్వంచ

ప్రభుత్వం ఏర్పడి తొలి ఏడాది కాలంలో సాధించిన విజయాలు చేపట్టిన కార్యక్రమాలు, వివిధ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్ళుటకు గాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజా పాలన-ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఈ నెల 19న వరంగల్‌లో నిర్వహించు ప్రజా పాలన- విజయోత్సవాల వేడుకలకు జిల్లా నుండి మహిళా సంఘాల మహిళలను భాగస్వాములు చేయుటకు గాను చేయాల్సిన ఏర్పాటలపై కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో ఎంపీడీవోలు, ఆర్టీసీ అధికారులు, సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. 19వ తారీఖు వరంగల్ వేదికగా 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమానికి, ప్రజా పాలన విజయోత్సవ వేడుకలకు జిల్లా నుండి పెద్ద ఎత్తున మహిళలను తీసుకువెళ్లాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి పెద్ద ఎత్తున మహిళా సంఘాల సభ్యులను ప్రజా పాలన విజయోత్సవాల వేడుకలకు హాజరు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలన్నారు.జిల్లా నుండి 12 బస్సుల్లో బస్సు కు 45 మంది చొప్పున 540 మంది మహిళలను కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. దూరంగా వున్న మండలా బస్సులు ఉదయం ఏడు గంటలకు, మిగిలిన మండలాల బస్సులు ఎనిమిది గంటలకు మండల కేంద్రం నుండి బయలుదేరాలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాల్గొనే మహిళలందరికీ ఐడీ కార్డులు అందించాలని, అదేవిధంగా ప్రతి ఐడి కార్డు వెనకాల సంబంధిత ఏపిఎం ఫోన్ నెంబర్లు ఉండాలని అధికారులను సూచించారు. హాజరైన మహిళలకు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

బస్సుల్లో మహిళలకు తాగునీరు, అల్పాహారం ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని బస్సులు ఒకే రూట్లో వరంగల్ చేరుకునేలా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలన్నారు. బస్సులన్నిటికీ బ్యానర్లు సిద్ధం చేయాలి అన్నారు. మహిళలకు నర్సంపేటలో మధ్యాహ్నం, రాత్రి భోజనం సౌకర్యాలు ఏర్పాటు చేయాలని దానికి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మహిళల అందరి వివరాలు, ఫోన్ నెంబర్లు నమోదు చేయాలన్నారు. మహిళలు గమ్యస్థానం చేరుకునేంతవరకూ వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

స్టేట్ లెవెల్ కరాటే ఛాంపియన్షిప్ 2024 లో ప్రగతి విద్యార్థుల పతకాల పంట



నవతెలంగాణ-బూర్గంపాడు

రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో ఈ నెల 17న మహబూబాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పది రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన పోటీలలో మండలంలోని సారపాకలో గల ప్రముఖ విద్యాసంస్థ ప్రగతి విద్యా నికేతన్ హైస్కూల్ చెందిన విద్యార్థులు వివిధ విభాగాలలో పతకాలను సాధించారు. ఈ పోటీలలో దామెర ఆదినారాయణ కుమారుడు దామెర చావేజ్, అనుమల వెంకటేశ్వర్ల కుమార్తె తేజశ్రీ రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతిగా గోల్డ్ మెడల్స్ సాధించారు. అదేవిధంగా ఎస్.నవీన, ఏ.రిత్విక్, ఎస్.కిరణ్ కుమార్, ఏ.యోషిక్, శ్యామ్, చక్రి ద్వితీయ, తృతీయ బహుమతులుగా రజిత, కాంస్య పథకాలను సాధించారని పాఠశాల కరస్పాండెంట్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను బ్రహ్మారెడ్డి అభినందించారు. అదేవిధంగా కరాటే మాస్టర్ కిరణ్‌ను సత్కరించారు. ఈ పోటీలకు సహకరించిన పాఠశాల పీఈటీ ఎస్.బాలకృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, హెడ్మాస్టర్ ఎం.సత్యనారాయణ, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాం

• ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

• రూ.1.70కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

• రూ.2.20 కోట్లతో పూర్తయిన పనునులను ప్రారంభించిన కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కొత్తగూడెం పట్టణం మెరిసేలా.....ఇక్కడి ప్రజలు మురిసేలా అభివృద్ధి చేసి మరింత స్ఫూర్తితో ముందుకు సాగుతానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 16, 18, 21, 22వ వార్డులో రూ.1.70కోట్ల డీఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న నిర్మాణం పనులకు శంకుస్థాపన, 17, 19వార్డుల్లో రూ.2.20కోట్లతో పూర్తయిన నిర్మాణాలను ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశాల్లో కూనంనేని మాట్లాడుతూ ప్రజల మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, డిప్యూటీ తహసీల్దార్ అంజద్ పాషా, మున్సిపల్ డిఈ రవికుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ చౌహన్, విద్యుత్ శాఖ అధికారులు, ఆయా వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



ధ్వంసమైన డ్రయినేజీని పరిశీలించిన ఎమ్మెల్యే

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు, మేదరబస్తీలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన డ్రైనేజి ధ్వంసం అవడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం ధ్వంసమైన డ్రైనేజీని నేరుగా వెళ్లి పరిశీలించారు. డ్రైనేజి పునర్నిర్మాణం కోసం సత్వరమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. డ్రైనేజి దుస్థితిపై మున్సిపల్ శాఖ అధికారులపై ఆగ్రహం వక్తంచేశారు, వారి పనితీరుపై మందలించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నిర్మాణంలో నాణ్యత లోపించడం వల్లే డ్రైనేజి ధ్వంసమైందని, ఇది ముమ్మాటికీ అధికారుల్లో పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల అవినీతికి పాల్పడటం వల్లే లక్షలాది రూపాయల ప్రజాధనం వృధా అయిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు జరిగినా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్య సౌకర్యం కల్పించాలి : సీఐటీయూ



నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణిలో అండర్ గ్రౌండ్, ఓపెన్ కాస్ట్‌లలో పనిచేసే కార్మికులకు ప్రకృతికి విరుద్ధంగా పనిచేస్తున్నందున వృత్తిపరమైన జబ్బులతోపాటు ఇతర ప్రాణాంతకమైన వ్యాధులతో సతమతమవుతున్న కార్మికులకు సరైన వైద్యం అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావుతో కూడిన బృందం డైరెక్టర్ (పా) వెంకటేశ్వర్ రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. మెమోరండంలో కార్మికులు సరైన వైద్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. సింగరేణి డైరెక్టర్ స్పందిస్తూ కార్పొరేట్ హాస్పటల్‌కు రిఫర్ చేసే సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్‌లో వైద్యం చేకూరే విధంగా వెంటనే సర్క్యులర్ జారీ చేసేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జెబిసిసిఐ సభ్యులు మంద నర్సింహారావు మాట్లాడుతూ.....సింగరేణి సంస్థ అనేక అవార్డులు సాధిస్తున్న కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు వైద్య సౌకర్యం అందించటంలో యజమాన్యం నిర్లక్ష్యం వహిస్తున్నదన్నారు. కార్మికులకు వైద్య సౌకర్యం అందించడానికి ఈ వ్యవస్థను ప్రక్షాలన చేయాల్సిన అవసరం ఉన్నదని కోరారు.
కొత్తగూడెం, గోదావరిఖనిలో పూర్తిస్థాయి వైద్యం అందించే పద్ధతిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సౌకర్యం కార్మికులకు అందించాలని సిఐటియు డిమాండ్ నాయకులు డిమాండ్ చేశారు.

మన సింగరేణి ఉద్యోగులు, తల్లిదండ్రుల పిల్లలకు రిఫరల్ ఇచ్చేటప్పుడు మైను మీద ఫోటో పెట్టి ఇద్దరు సాక్షుల సంతకంతో రమ్మంటున్నారు. ఇక్కడ పేషెంట్ సీరియస్‌గా ఉన్నప్పుడు ఉద్యోగి తరుపున బొగ్గు గని దగ్గరకు ఎవరు వెళ్లాలి...?, ఎవరు వీటిని కళా సంతకం చేయాలి....? ఎలా ఫోటో పెట్టించాలి...? అని ప్రశ్నించారు.

కార్మికుడికి యాక్సిడెంట్ రిపోర్ట్‌లో హాస్పిటల్లో జాయిన్ అయితేనేమో తొందరగా ఫిట్ చేస్తారు కానీ వేరే జబ్బులతోహాస్పటల్లో జాయిన్ అయితే నెలల తరబడి తిప్పుతూ ఫిట్ చేయకుండా ఈ పద్ధతిని మార్చాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొత్తగూడెం బ్రాంచ్ గాజుల రాజారావు, యూనియన్ రాష్ట్ర నాయకులు సూరం ఐలయ్య, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 జరిగే హింస వ్యతిరేక దినాన్ని జయప్రదం చేయండి

• ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవీటి సరళ

నవతెలంగాణ-కొత్తగూడెం

నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 జరిగే హింస వ్యతిరేక దినాన్ని జయప్రదం చేయాలని, ప్రతి గ్రామంలో సెమినార్ నిర్వహించాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవీటి సరళ అన్నారు. సోమవారం స్థానిక ఐద్వా కార్యాలయంలో జరిగిన అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవీటి సరళ మాట్లాడుతూ ఈనెల 25 నుండి డిసెంబర్ 10 వరకు జరిగే హింసపై ప్రతి వార్డు గ్రామాల్లో అవగాహన సదస్సులు పెట్టాలని పిలుపు నిచ్చారు. దేశవ్యాప్తంగా మహిళలపై హింస అత్యాచారాలు ఎక్కువ అవుతున్నాయని, విద్యార్థిని, విద్యార్థులపై అనేక రకాల ఘటనలు జరుగుతున్నాయని వీటిని అరికట్టే విధంగా ఈ ప్రభుత్వాలు పనిచేయడం లేదని, వాటిని వారించాలని పభుత్వన్ని డిమాండ్ చేశారు. మహిళలు అందరూ వార్డులలో, స్కూళ్లలో, హాస్టల్లో సెమినార్లు అవగాహన సదస్సులు పెట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి, జిల్లా ఉపాధ్యక్షులు సందకూరు లక్ష్మి, అన్నవరపు ఇందిర, పాయం అమల, సంధ్య, సున్నం గంగ, మిరియు జయ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ అంటే ఒక సృష్టి

• సైన్స్ ఫెయిర్ ఇన్స్పైర్‌ను ప్రారంభించిన ఎంపీ



నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

సైన్స్ అంటే ఏదో ఒక కొత్త విషయాన్ని ప్రపంచానికి తెలియజేయడం అని అలాంటి కొత్త కొత్త విషయాలను కనుగొనడానికి ఒక వేదిక సైన్స్ ఫెయిర్ ఇన్స్పైర్ ప్రోగ్రం అని అలాంటి ప్రోగ్రాంను స్థానిక శాసన సభ్యులు జారే ఆదినారాయణతో కలసి ప్రారంభించడం చాల సంతోషంగా ఉందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డి అన్నారు. అన్నపుడ్డిపల్లి మండల కేంద్రంలో సాంఘీక సంక్షేమ గురుకుల బాలురు పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ఇన్స్పైర్ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నర్సారెడ్డి కూడా హాజరు అయినారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ సైన్స్ అంటే ప్రగతి అని సైన్స్ ద్వారా భావితరాల కోసం కొత్త పరిశోధనలు చేసి ఎలా అభివృద్ధి చెందాలి అనేది చూపించాలన్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ తొలిసారిగా శాసన సభ్యుడగా ఎన్నికైన తరువాత విద్య, వైద్యం కోసం ఎంతో కష్టపడుతున్నాను అని ఇప్పటికే విద్య వసతులు కోసం పాఠశాలలో మౌలిక సదుపాయాలు కోసం ఐదు కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా వైద్య సౌకర్యాల కోసం రెండు కోట్లు ఖర్చు చేసినట్టు, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు భావితరాల శాస్త్రవేత్తలు కావాలని అందుకోసం ఎంతో శ్రమిస్తున్నానని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారి మాట్లాడుతూ మానవ జీవితంలో ఎప్పుడు ప్రకృతి వైపరీత్యాలు వస్తాయో తెలియదు అని అలాటి ప్రకృతి వైపరీత్యాలను కూడా ముందే కనిపెట్టి వాటి నుండి ముందే మానవ మనుగడను రక్షించుకోవడంతో పాటు ప్రకృతిని కూడా కాపాడేందుకు సైన్స్ ఎంతో ముందు వుంటుందన్నారు. ముందు జరిగే పరిణామాలను కాలం కంటే ముందే కనిపెట్టడం జరుగుతుందని అన్నారు. ఈ సైన్స్ ఫెయిర్ ఇన్స్‌ఫెయిర్ ప్రోగ్రంలో జిల్లా నలు మూలలు నుండి విద్యార్థులు హాజరు అయి ఎన్నో అద్భుతమైన ప్రాజెక్టలను ప్రదర్శించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఫెయిర్ జిల్లా అధికారి చలపతి రాజు, మండల విద్యాశాఖ అధికారి ఆనంద్ కుమార్, బురాన్, పర్స వెంకట్, దుబాకుల రాము, నేరేళ్ళ లాలయ్య, పారంకుశం రాజ, వేముల రమణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మండల కన్వీనర్‌గా నరసింహారావు ఎన్నిక

• ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని తీర్మానాలు ఆమోదించిన మహాసభ



నవతెలంగాణ-టేకులపల్లి

భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు మండల నూతన కన్వీనర్‌గా ఈసం నరసింహారావును మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టేకులపల్లిలో జరిగిన పార్టీ మండల ఏడవ మహాసభ నూతన కన్వీనర్‌గా ఈసం నరసింహారావు-బోడుకొత్తగూడెం, కమిటీ సభ్యులుగా కడుదుల వీరన్న-టేకులపల్లి, పూనెం స్వామి, పూనెం చంద్రశేఖర్-కోయగూడెం, కుంజ రమేష్-అందుగులగూడెం, దనసరి వీరాస్వామి-కుంటల్ల, దొడ్డ సావిత్రి, దొడ్డ సంపత్-లచ్చగూడెం, పాయం వెంకన్న-సంపత్ నగర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. మహాసభలో ప్రజా సమస్యలపై చర్చించి పోరాటాలు చేయాలని చేసిన తీర్మానాలు ఆమోదించిందన్నారు.

తీర్మానాలు: రాష్ట్ర ప్రభుత్వం పోడు భూముల సాగు దారులకు పెండింగ్‌లో ఉన్న పట్టాలు ఇవ్వాలని, కోయ గూడెం ఓసి 2, పిట్-2, 3లో భూములు కోల్పోయిన గిరిజన నిర్వాసితులకు గౌరవ హైకోర్టు తీర్పు అమలు జరిపి నష్టపరిహారం, భూమి, ఉద్యోగాలు ఇవ్వాలి. జాతీయ రహదారి విస్తరణలో భూములు, ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ఎకరానికి 40లక్షల నష్టపరిహారం చెల్లించాలి. గోదావరి నీళ్ళు టేకులపల్లి మండలానికి తీసుకురావాలని, ముర్రేడు వాగు నీళ్ళు గడ్డి చెరువు, తెల్లవాగు చెరువుకు మళ్ళించాలని, రెవెన్యూ, జంగుసిఫాయి, సీలింగ్, అసైన్డ్ భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలి. రైతు బంధు, రైతు బీమా ఇవ్వాలని, టేకులపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తీర్మానాలు చేసినట్లు తెలిపారు. రాబోయే కాలంలో ఈ సమస్యలపై ఉద్యమాలు ఉధృతం చేస్తామని తెలిపారు.

పోడు భూములకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి

• టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్



నవతెలంగాణ-చర్ల

మండల ఏజెన్సీ వాసులకు పోడు పట్టాలు వచ్చిన పోడు భూములకు త్రి ఫేస్ విద్యుత్ లైన్ అనుమతితో పాటు, వ్యవసాయ బోరు బావులు నిర్మించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్)జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం భద్రాచలం ఐటీడీఏ పీఓకి వినతిపత్రం ఆయన ఆధ్వర్యంలో అందజేశారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల పరిధిలోగల సత్యనారాయణపురం గ్రామం కు సంబంధించిన 180 కుటుంబాలు సుమారు 500 ఎకరాల సాగులో ఉన్నాయని ఆదివాసీ పోడు రైతులు మాకు పట్టాలు అయితే వచ్చాయి గాని సరైన పంటలు వేసుకోవడానికి సాగు నీరు అందించడానికి అవకాశం లేదన్నారు. ఆ భూములకు వ్యవసాయ బోర్లు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని పీవోకి వినతిపత్రం ఇచ్చినట్టు తెలపారు. ఆకాశం మీద ఆధారపడి పత్తి, మిర్చి వేస్తున్నాం అని కారం పుల్లయ్య వాపోయారు. సానుకూలంగా స్పందించిన పీవో రాహుల్ అదేవిధంగా త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం, వ్యవసాయ బోర్లు అనుమతి మీ గ్రామపంచాయతీలో గ్రామసభ జరిపి మీ సమస్యను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పుల్లయ్య మాట్లాడుతూ చర్ల మండలం విజయ కాలనీ సంబంధించిన ఆదివాసి రైతులు రెవెన్యూ పట్టాలు 23 మందికి ఉన్నాయి కానీ సొంతంగా వ్యవసాయ బోర్లు, త్రీఫేస్ విద్యుత్ లైన్‌కు డీడీ కట్టేంత స్తోమత లేని కారణంగా తమరు మాకు మా భూములకు పంట బోర్లు, త్రి ఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించి మమ్మల్ని ఆదుకోగలరని ఆ ఆదివాసీ మహిళా రైతులు పివోను కోరారు.

ఈ కార్యక్రమంలో టీఏజీఎస్ భద్రాచలం పట్టణ కార్యదర్శి కుంజా శ్రీను, చర్ల మండలం ఐద్వా మండల కార్యదర్శి పొడుపుగంటి సమ్మక్క, ఆదివాసీ రైతులు శ్యామల కాంతయ్య, పర్శిక రామ్ కిరణ్, గట్టుపల్లి సురేష్, సోడి నాగమణి, సోయం రవి, కారం మహేష్, తెల్లం నాగేశ్వరావు, తుర్రం సమ్మక్క పెద్ద ఎత్తున రైతులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలి

నవతెలంగాణ-దమ్మపేట

గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని సీపీఐ, ఏఐటీయూసీల మండల కార్యదర్శులు సుంకుపాక ధర్మ, బెజవాడు రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మండలంలోని 31 గ్రామపంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలతో దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ స్పందించి సమస్యను డీపీఓ, కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్షులు గొర్రెపాటి బసవయ్య, పెంకె ప్రభాకర్, సహదేవుడు, పద్దం భాస్కర్, కోరం బాబు, అన్నవరం రాములు, పుల్లారావు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, టీజీఎస్ జిల్లా కమిటీలు
- జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కి వినతి

నవతెలంగాణ-పాల్వంచ



ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు నాణ్యమైన కార్పొరేట్ విద్యను అందించాలనే లక్ష్యంతో చేపట్టిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం (బీఏఎస్ఎస్) పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, టీజీఎస్ జిల్లా కమిటీలు కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) ఎం.రమాదేవిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం మాట్లాడుతూ జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం ద్వారా ఎంపిక కాబడిన ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ వందల కోట్ల రూపాయల బకాయిలు పోగు పడ్డాయన్నారు. 2022-23, 2023-24, ప్రస్తుత విద్యా సంవత్సరంతో కలిపి సుమారు రూ.ఐదు కోట్లు జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు చెల్లించాల్సి ఉందన్నారు. జిల్లాలో లిటిల్ ఫ్లవర్స్ భద్రాచలం, సెయింట్ జోసెఫ్ కొత్తగూడెం, స్వర్ణ భారతి కొత్తగూడెం మొత్తం 3 పాఠశాలలుంటే గత 3 సంవత్సరాల నుండి స్కీం నిధులు మంజూరు కావట్లేదున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.175 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే విడుదల చేయాలని, లేకపోతే ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే దశలవారీగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రభుత్వం మెడలు వంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మందా నాగకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రామ్ చరణ్, గిరిజన సంఘం జిల్లా నాయకులు సుధీర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



వేతనాలు వెంటనే చెల్లించండి

- సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) బ్రాంచ్ నాయకులు రమేష్

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు ప్రతినెల 7వ తారీఖు లోపున జీతాలు చెల్లించాలని సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టర్లకు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ కాంట్రాక్టర్లు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనీ, వేతనాలు సకాలంలో చెల్లించడం లేదని, పే స్లిపులు కూడా ఇవ్వడం లేదని సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం (సిఐటియు) బ్రాంచ్ నాయకులు భూక్యా రమేష్ అన్నారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులు శ్రమ నంత ధారపోసి ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి పని చేస్తుంటే సకాలంలో జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రతి నెల 7వ తారీకు లోపు జీతాలు చెల్లించాలని ఎన్నిసార్లు వినతి పత్రాలు ఆందోళన పోరాటాలు చేసినప్పటికీ కాంట్రాక్టు కార్మికుల పట్ల అత్యంత నిర్లక్ష్య వైఖరిని ఆలంబిస్తున్నారన్నారు. సింగరేణి యాజమాన్యం దృష్టికి పదేపదే తీసుకెళ్ళినప్పటికీ కాంట్రాక్టర్లను సింగరేణి యాజమాన్యం పిలిపించి చర్చలు జరిపి ప్రతి నెల 7వ తారీకు లోపు ఇవ్వాలని నిర్ణయాన్ని అమలు చేయకపోతే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సింగరేణి కాంట్రాక్టు కార్మికులు సంఘం బ్రాంచ్ అధ్యక్షులు శ్యామ్, భాస్కర్, సక్రం, ప్రభాకర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



నేడు సీపీఐ(ఎం) 8వ మండల మహాసభ

- ముస్తాబైన సుందరయ్యనగర్
- హాజరుకానున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

నవతెలంగాణ-ఇల్లందు

సీపీఐ(ఎం) ఇల్లందు మండల 8వ మహాసభ నేడు సుందరయ్య నగర్‌లో నిర్వహించనున్నారు. సుందరయ్యనగర్‌లో మహాసభ ఏర్పాట్లను జైభున్నిసా, కోడేం బోస్, అబ్బాస్, విజయ్ మోహన్ సింగ్, సోమ సుజాతా కృష్ణ, బోయిన రాజశేఖర్, బోయిన పద్మ, రాంభరోస్, పూసల చంద్రు, కోడెం బాయమ్మ తదితరులు మహాసభ అలంకరణ ఏర్పాట్లు చేస్తున్నారు. తోరణాలతో ఏరియా కనకలాడుతోంది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మండల కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు సీపీఐ(ఎం) మహాసభలు జరుగుతాయని, ఇప్పటి వరకు నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాలు, పార్టీ నిర్మాణాన్ని సమీక్షించుకుంటామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాబోయే మూడు సంవత్సరాలు ఏ అంశాల మీద పనిచేయాలో దిశా నిర్దేశం మహాసభలో తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పి. సోమయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఎజె.రమేష్ పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభలకు మండలంలో ఉన్న పార్టీ సభ్యులు హాజరవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్‌కుమార్, మన్యం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు చేయడం సిగ్గుచేటు

టేకులపల్లి : హైదరాబాద్ గాంధీ భవన్‌లో రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఇన్‌చార్జికి వినతి పత్రం ఇవ్వాలని సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ ప్రకటిస్తే, జిల్లాలలో ఉన్న సేవాలాల్ సేన నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం చాలా సిగ్గుచేటని నాయకులు సోమవారం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల భూములను లాక్కోవాలని చూస్తున్న ప్రభుత్వం కుట్రను తిప్పి కొడతాం అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల, తదితర గ్రామ గిరిజన రైతుల జోలికి వెళ్లకూడదని, రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తే ఈ గొడవలు అన్నీ కూడా వెంటనే సద్దు మనుగుతాయన్నారు. వెంటనే భేషరతుగా అక్రమ అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆర్యవైశ్య వనభోజన మహోత్సవాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు



ఇల్లందు : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్‌ల సంయుక్త నిర్వహణలో వనభోజన కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, మండల, పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, వాసవి క్లబ్ అధ్యక్షులు పుల్లూరు సతీష్ కుమార్‌లు సోమవారం ఒక ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రొంపేడు దగ్గరలోని సైదులు మామిడి తోట నందు ఆదివారం రాత్రి వరకు వనభోజన మహోత్సవ వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కుటుంబాలన్నీ సపరివార సకుటుంబ సమేతంగా వనభోజన మహోత్సవంలో పాల్గొన్నారు. గత 15 రోజుల నుండి ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్బుల ఆధ్వర్యంలో కండె రమేష్ అధ్యక్షులుగా, తాటిపల్లి సుబ్బారావు ప్రధాన కార్యదర్శిగా, యెలుగూరి మధుబాబు కోశాధికారిగా ఒక కమిటీని ఏర్పాటు చేసుకుని ఆర్యవైశ్య కుటుంబాల అందరి సహకారం తీసుకొని ఈ వనభోజనాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆర్యవైశ్య మహాసభ, వాసవిక్లబ్‌లు నిర్వహించే ప్రతి కార్యక్రమానికి ఇదే విధంగా తమ సహకారాన్ని అందించాలని కోరారు.

బండారుగూడెం పాఠశాలను సందర్శించిన జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి

నవతెలంగాణ-దుమ్ముగూడెం




మండలంలోని బండారుగూడెం పాఠశాలను జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగ నాగ రాజశేఖర్ సోమవారం సందర్శించారు. పరిశీలనలో భాగంగా విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయం నిర్వహణ, పాఠశాల పచ్చని పరిశుభ్ర వాతావరణంలో ఉందని, విద్యార్థులు చదవడం, రాయడంలో చక్కని ప్రతిభ కనబరచడం, కలెక్టర్ పంపిణీ చేసిన నోట్ బుక్స్‌లో చూచిరాత వంటి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిశ్చల్ కుమార్, ఉపాధ్యాయులు వంశీ, మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైట్ కాలర్‌ని వదిలి కార్మికులపై కేసులా..?

- దొంగతనానికి సెటిల్మెంట్ పరిష్కారమా..?
- కార్మికుల పక్షాన లేబర్ ఆఫీసర్‌కి ఫిర్యాదు చేయనున్న కార్మిక సంఘాలు
- 'చోర్ వైట్' కాలర్ పై సుమోటోగా కేసు స్వీకరించాలని హైకోర్టులో అపిల్ చేయనున్న ప్రముఖులు
- నవతెలంగాణ కథనాలపై ఆరా

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలంలో బలవంతుడికో చట్టం బలహీనుడుకో చట్టం నడుస్తున్నట్టు కనిపిస్తుంది. ఒక పథకం ప్రకారం దొంగతనానికి వ్యూహం పన్ని కార్మికుడి అవసరాన్ని ఆసరాగా తీసుకొని తనకు కావలసిన వస్తువులను ఏరి కోరి దొంగతనం చేపించి పట్టుపడ్డాక ఆ నేరం కార్మికులపై మోపి దర్జాగా తప్పించుకోవాలని చూస్తున్న "చోర్ వైట్ కలర్"కి కొంతమంది అధికారులు కొమ్ముకాస్తున్నట్టు స్పష్టమవుతుంది. తప్పు చేసినా తప్పించుకోవచ్చన్న అహంకారంతో తెల్ల చొక్కా మాటున తప్పుడు పనులు చేస్తూ ఫిర్యాదు దారుడు పై బెదిరింపులకు దిగిన ఘన'వాసు'డుపై గత పది రోజుల నుండి ప్రచార మాధ్యమాలతో పాటు పత్రికలలో కథనాలు వెలుపడ్డ నేపథ్యంలో తప్పని పరిస్థితులలో విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. విచారణలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చినప్పటికీ ఇప్పటివరకు నిందితున్ని అదుపులోకి తీసుకోకపోగా ప్రధాన ముద్దాయి స్థానం నుండి తప్పించి కార్మికులపై నేరాన్ని మోపే ప్రయత్నాలు జరుగుతున్నాయని విశ్వసనీయంగా తెలుస్తుంది. ఈ క్రమంలో ఫిర్యాదారున్ని కొంతమంది పెద్దలు నయానా భయానో ఒప్పించి రాజీ కుదిరిస్తున్నారని అందులో భాగంగానే పెద్ద మొత్తంలో సెటిల్మెంట్ కూడా జరుగుతుందని జోరుగా ప్రచారం జరుగుతుంది. జిల్లావ్యాప్తంగా సంచలనం రేపిన వైట్ కలర్ దొంగతనాన్ని సెటిల్మెంట్ పేరుతో రాజీ కుదిరిస్తే భవిష్యత్తులో ఇటువంటి ప్రబుద్ధులు హత్యలు, మానభంగాలు చేసి కూడా సెటిల్మెంటుతో తప్పించుకుంటారేమో అన్న ప్రశ్నలు సామాన్యులలో తలెత్తుతున్నాయి. ఆకలితో చిన్న చిన్న తప్పులు చేసే బలహీనులను చొక్కాలిప్పి నించో పెట్టి పత్రికల ముందు దోషులుగా చూపించే పోలీస్ పెద్దలు ఇంత పెద్ద దొంగతనానికి ఒడిగట్టిన వైట్ కాలర్‌ని ఎందుకు వదిలిపెడుతున్నారో 1000 డాలర్ల ప్రశ్నగానే మిగిలిపోతుంది.



కార్మికుల పక్షాన నిలిచేందుకు సిద్ధమవుతున్న సంఘాలు

అసలు దొంగైన యజమానిని వదిలేసి కార్మికులపై కేసులు బనాయించాలని చూస్తే కార్మిక సంఘాలు చూస్తూ ఊరుకోమని కార్మికుల పక్షాన ఆ శాఖ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయటానికి సిద్ధంగా ఉన్నామని కార్మిక సంఘాలు తేల్చి చెబుతున్నాయి. ఇప్పటికే సీఐటీయూ ఆధ్వర్యంలో ఇతర కార్మికుల నుండి సంఘటనకు జరిగిన పూర్తి వివరాలను సేకరించి బాధితుల పక్షాన పోరాడేందుకు కార్యచరణను రూపొందిస్తున్నారు. అదే బాటలో ఇతర కార్మిక సంఘాలు సైతం ఈ ఘటనపై ఉద్యమానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో పట్టణ వ్యాప్తంగా ఉన్న కార్మికులలో విస్తృతంగా చర్చ మొదలైంది. ఈ ఘటనపై కార్మికులందరూ ఐక్యంగా నిలబడాలని రహస్య మంతనాలు సైతం జరుపుతున్నారని తెలుస్తుంది.

వైట్ కాలర్ పై సుమోటాగా కేసు స్వీకరించాలి

ధన పలుకుబడితో ఏ తప్పు చేసినా తప్పించుకోవచ్చు అన్న అహంకారంతో దొంగతనం చేసి కూడా దర్జాగా తెప్పించుకొని తిరుగుతున్న "చోర్ వైట్ కలర్" ఉదాంతంపై వివిధ పత్రికలలో సామాజిక మాధ్యమాలలో వస్తున్న కథనాలను సుమోటగా తీసుకొని కేసు నమోదు చేసేందుకు హైకోర్టుని పట్టణంలోని కొందరు పాత్రికేయ బృందం ఆశ్రయిస్తున్నట్టుగా తెలుస్తుంది. ఫిర్యాదారుడు గతంలో మాట్లాడిన మాటలను ఆధారాలుగా చూపిస్తూ పత్రికలో వచ్చిన కథనాలను ప్రస్తావిస్తూ ప్రయివేట్ కేసు వేసేందుకు సిద్ధమవుతున్నారని అదే జరిగితే భద్రాచలంలో సెటిల్మెంట్ల పేరుతో జరిగే దందాలకు చెక్ పెట్టచ్చని పట్టణ ప్రముఖులు కొందరు సిద్ధమవుతున్నారని తెలుస్తుంది.

నవతెలంగాణ కథనాలపై ఆరా..?

గత మూడు రోజుల నుండి చోర్ వైట్ కాలర్ పై నవతెలంగాణ అందిస్తున్న కథనాలపై కొందరు అధికారులు ఆరా తీసి ఘన "వాసు"డి బాధితుల నుండి సమాచారాన్ని సేకరిస్తున్నట్టుగా తెలుస్తుంది. గతంలో వ్యాపారంలో అనేక రకాల అక్రమాలకు పాల్పడ్డ నేపథ్యంలో వాటిపై కూడా విచారణ చేపడుతున్నట్టుగా భద్రాచలంలో జోరుగా చర్చ నడుస్తుంది. స్థానిక అధికారుల దగ్గర తప్పించుకున్న సంబంధిత ఘటనపై ఆరాధిస్తున్న రహస్య అధికారుల నుండి "చోర్ వైట్ కలర్" తప్పించుకోవటం అంత సులువు కాదని వ్యాపార వర్గాలు చర్చించుకుంటున్నాయి.

విద్యార్థులకు నేర్పించే తపన...

ఉపాధ్యాయుడిని నేలపై కూర్చోబెట్టింది

నవతెలంగాణ-అశ్వారావుపేట



ప్రతీ రంగంలోనూ ఏదో లక్ష్యంతో పనిచేసే వారు ఉంటారు.అలాగే మనకు ఎందుకులే అనుకుని తేలిగ్గా తీసుకునే వారు ఉంటారు. ప్రస్తుతం విద్యాశాఖలోను ఏ చిన్న అవకాశం వచ్చినా బడికి ఎగనామం పెట్టే ఉపాధ్యాయులు ఉన్నట్లే బడిలో పిల్లలకు ఏదో ఒకటి నేర్పాలి అనే తపన పడే వారు ఉన్నారు. సోమవారం నవతెలంగాణ పలు పాఠశాలలను సందర్శించగా అనేక ఆశక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. మండల పరిధిలోని మల్లాయిగూడెం పంచాయితీ దిబ్బగూడెం(ఆర్) ఎంపీపీ ఏస్‌లో ఈ దృశ్యం కంటపడింది. ప్రధానోపాధ్యాయులు పొడియం రామారావు విద్యార్థులతో పాటు నేల పైనే కూర్చుని పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులతో ఉపాధ్యాయుడు మమేకం అయినప్పుడే వారు నేర్చుకోవాలనే కుతూహలంగా ఉంటారనే అభిప్రాయాన్ని విద్యా నిపుణులు సైతం వ్యక్తం చేస్తుంటారు. ఇంతకీ ఈ పాఠశాలలో 1 నుండి 5 తరగతులకు వరకు 30 మంది విద్యార్థులు ఉండగా సోమవారం 23 మంది హాజరు అయ్యారు.

గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలి

- ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పినపాక



ధాన్యం కొనుగోలు వేగవంతంగా చేయాలని, గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలో ఆకస్మికంగా పర్యటించి, ప్రస్తుత వానాకాలం రైతులు పండించిన ధాన్యం సేకరణ చేయుచున్న ప్రభుత్వ ఏజన్సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉప్పాక గ్రామంలో డీసీఎంఎస్ ద్వారా నిర్వహిస్తున్నటువంటి కేంద్రాన్ని తనిఖీ చేసి నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్ణయించినటువంటి కనీస మద్దతు ధరతో పాటు రాష్ట్ర ప్రభుత్వ అదనముగా కల్పిస్తున్నటు వంటి రూ.500బోనస్ రైతులు సద్వినియోగం చేసుకోవలసినదిగా తెలియజేశారు. అనంతరం పినపాక గ్రామంలో నిర్వహిస్తున్నటువంటి పీఏసీఎస్ కేంద్రాన్ని పరిశీలించారు. స్థానిక ఏఈఓలు నాణ్యతా ప్రమాణాలు ముందుగానే రైతుల పొలాల్లోనే పరిశీలించాలాన్నారు. నాణ్యతా ప్రమాణాలు వచ్చిన తర్వాత మాత్రమే కొనుగోలు కేంద్రానికి పంపవలసినదిగా ఏఈఓలను ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం పాడైపోకుండా సరిపోను టార్పాలిన్స్ అందుబాటులో ఉంచుకోవలసినదిగా ఆదేశించారు. పేడీ క్లీనర్స్ సరిపోను ఉండేట్లు చూడవలసినదిగా ఆదేశించారు. అలాగే ఏ గ్రేడ్ రకాలకు ప్రత్యేకముగా వాహనాలలో పంపాలని, సన్నాలకు ప్రత్యేకముగా వాహనాలు ఏర్పాటు చేయవలసినదిగా ఆదేశించారు. సాదారణ రకాలు ప్రత్యేకముగా వాహనాలు ఏర్పాటు చేయవలసినదిగా ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి కుర్షీద్ అహ్మద్, డీసీఎంఎస్ మేనేజర్, సిబ్బంది, ఏడీఏ బి.తాతారావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ, తహసీల్దార్ నరేష్, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, ఏపీఎం ఐకేపీ జ్యోతి, ఏపీఓ ఈజీఎస్ వీరభద్ర స్వామి, సెక్రటరీలు, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

- కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహించిన అధికారులు
- 13478 అభ్యర్థులకు, 7166 మంది హాజరు
- 53.17 హాజరు శాతం నమోదు
- పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ

నవతెలంగాణ-పాల్వంచ

గ్రూప్-3 పరీక్ష సోమవారంతో ముగిసింది. జిల్లా అధికారుల ప్రత్యేక పర్యవేక్షణలో గ్రూప్-3పరీక్షను కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుండి 12:30 వరకు ఒక పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుండి 5:30 వరకు రెండవ పరీక్ష, సోమవారం ఉదయం 10 గంటల నుండి 12:30 వరకు మూడవ పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 39 సెంటర్లలో పరీక్ష నిర్వహించగా కొత్తగూడెంలో 26 సెంటర్లు, పాల్వంచలో 13 సెంటర్లు ఏర్పాటు చేసారు. మొత్తం 13478 మంది అభ్యర్థులకి గాను 7166 మంది హాజరయ్యారు. 6312 మంది గైర్హాజరయ్యారు. 53.17 హాజరు శాతం నమోదయింది. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్ పరీక్షా సరళని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పలు సెంటర్లను తనిఖీ చేశారు.

అభ్యర్ధులని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. బయోమెట్రిక్ విధానం ఉండడంతో అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి అర్ధగంట ముందే చేరుకున్నారు. వైద్య, పారిశుధ్య, విద్యుత్ శాఖ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ అధికారులు వివిధ ప్రాంతాల నుంచి కొత్తగూడెం, పాల్వంచలకు ప్రత్యేక బస్సులు నడిపారు. అధికారులు పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూయించారు.

పోలీసు యంత్రాంగం పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసింది. ప్రతి అభ్యర్థిని తనిఖీ చేసిన అనంతరం మాత్రమే లోపటికి అనుమతించారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. పరీక్షల నిర్వహణ కోసం అధికారులకు, సిబ్బందికి అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శిక్షణ అందించారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.



వీఓఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్
- కలెక్టరేట్ ఎదురుగా ధర్నా

నవతెలంగాణ-పాల్వంచ

రాష్ట్రంలో వీవోఏలుగా పని చేస్తున్న అందరినీ సెర్పు ఉద్యోగులుగా గుర్తిస్తామని, కనీస వేతనం రూ.20000 ఇస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట 48 గంటల ధర్నాలో భాగంగా కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ధర్నా సందర్భంగా వీవోఎల్ సంఘం జిల్లా అధ్యక్షులు జిలకర పద్మ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో మహిళల సాధికారిక కోసం ప్రభుత్వ పథకాల అమలు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఐకేపీ వీవోఏలాకు గత సంవత్సరం సమ్మె కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమ్మె శిబిరాల దగ్గరికి రేవంత్ రెడ్డి, సీతక్కలు కూడా వీవోలకు మద్దతు తెలియజేస్తూ మా ప్రభుత్వం రాగానే మీ అన్ని సమస్యల పరిష్కరిస్తామని చెప్పి హామీలు ఇచ్చారన్నారు. ఆ హామీలు సంవత్సరం కావస్తున్నా ఇంతవరకు అతీగతి లేకుండా పోయాయని, అలాగే బకాయి ఉన్న స్త్రీ నిధి ఇన్సెంటివ్స్ గ్రామ సంఘం నుంచి ఇవ్వాల్సిన రూ.3000 వెంటనే ఇవ్వాలని ఆయన కోరారు. అర్హత కలిగిన వీవోఏలను సీసీలుగా ప్రమోషన్ ఇవ్వాలని, సెర్ప్ ద్వారా గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని ఆయన కోరారు. రూ.20 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ 48 గంటల ధర్నా అనంతరం అయినా ప్రభుత్వంలో చలనం వచ్చి వారి సమస్యలు పరిష్కరించాలని లేకపోతే భవిష్యత్తులో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వీరన్న, వీవోఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సుల్తానా, చంద్ర లీల, జిల్లా నాయకులు నాగరాజు, రాము, రవి, పద్మ, మున్నీసా, అరుణ, అనురాధ, రమాదేవి కుమారి పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో స్టడీ అవర్స్‌ని పకడ్బందీగా నిర్వహించాలి

- ఐటీడీఏ పీఓ బి.రాహుల్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ సక్రమంగా జరుగుతున్నది, లేనిది సంబంధిత స్పెషల్ ఆఫీసర్లు, హెచ్‌ఎం, వార్డెన్లు పర్యవేక్షణ చేస్తూ ఉండాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన గిరిజన దర్బార్లో వివిధ ఆదివాసీ గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి అర్జీలు స్వీకరించి తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందే విధంగా సంబంధిత యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు.



ఎక్కువ శాతం దరఖాస్తులు పోడు భూముల సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, ట్రైకార్ ద్వారా అందించే సబ్సిడీ రుణాలు, కొత్తగా ఏర్పాటు చేసే మత్స్యకార సొసైటీల అనుమతి, వ్యవసాయానికి సంబంధించి కరెంటు, బోరు, మోటారు, గిరిజన గ్రామాలలో విద్యుత్ సౌకర్యం కల్పించుట, వ్యక్తిగత రుణాలు ఇప్పించుట, ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో ఉపాధి పొందుటకు శిక్షణలు ఇప్పించుట తదితర వాటి గురించి అర్జీలు పెట్టుకున్నారని ఆయన అన్నారు. గిరిజన దర్బార్‌లో వచ్చిన దరఖాస్తులను ఆన్లైన్లో ద్వారా ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు విడతల వారీగా ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఆర్సిఓ గురుకులం నాగార్జున రావు, ఏవో రాంబాబు, ఎస్.ఓ, భాస్కరన్, ఏపీఓ పవర్ ఏఈ మునీర్ పాషా, డీటీఆర్‌ఓఎఫ్ లక్ష్మీనారాయణ, కొండరెడ్ల విభాగం అధికారి మనిధర్, మిషన్ భగీరథ ఏఈఈ నారాయణ రావు, మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం విభాగం మణికుమారి, హెచ్ఈఓ లింగా నాయక్, వివిధ విభాగాలకు జీసీసీ మేనేజర్ జయరాజ్, ఐసీడీఎస్ సూపర్వైజర్ అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులే టార్గెట్గా రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

- రోజుల వ్యవధిలోనే ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు
- మంత్రితో మాట్లాడుతావా అంటూ బెదిరింపులు
- 100 సిబ్బంది రాకుంటే చంపేసే వారేమో : ఎఫ్‌బీఓ హరి

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

"కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం" అన్న చందంగా ఉంది కింది స్థాయి ఉద్యోగుల పరిస్థితి. ఇసుక మాఫియా బరితెగించి వ్యాపారం చేస్తోంది. ప్రశ్నించే ప్రజలు, ఉద్యోగులపై భౌతిక దాడులకు సైతం వెనకాడడం లేదు. జిల్లాలో మాట వింటే సరి.. లేదంటే హద్దు మీరి ప్రవర్తించడం, భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. కొద్దిరోజుల క్రితం బూర్గంపాడు మండలంలో ఓ రెవెన్యూ ఇన్స్పెక్టర్‌ను బెదిరించారు. భౌతిక దాడికి దిగారు. అర్ధరాత్రి ఇసుక రవాణా చేస్తున్న ఆర్ఐకి ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది. పై అధికారికి సమాచారం ఇచ్చి, సంఘటన ప్రాంతానికి వెళ్ళాడు. సమాచార సేకరణలో ఉండగా.. రాత్రివేళ కావడంతో మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. ఆదివారం అర్ధరాత్రి కిన్నెరసాని నది పరివాహక ప్రాంతం నాగారం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు అటవీ అధికారులకు సమాచారం. ఎఫ్‌బీఓ (ఫారెస్ట్ బీట్ అధికారి) హరితో పాటు సిబ్బంది, గస్తీ ఏర్పాటు చేశారు. ఇసుకతో వస్తున్న ట్రాక్టర్‌ను నిలిపి వేశారు. పాల్వంచకు తరలిస్తుండగా కేశవాపురం వద్ద ట్రాక్టర్లోని ఇసుకను అటవీ అధికారి ముందే రోడ్డు పక్క డంపు చేశారు. ఆ సమయంలో తోటి సిబ్బందికి మరో సమాచారం రావడంతో ఒంటరి అయ్యాడు. 100కి కాల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఒక్కడినే ఉంటే ఏం చేసేవారోననే భయాందోళనను ఎఫ్‌బీఓ హరి ఆవేదన వ్యక్తం చేశాడు.



ఫైల్

నీకు మంత్రితో ఫోన్ చేయించాలా..

అర్ధరాత్రి మాఫియా బెదిరింపులు

మర్యాదగా ట్రాక్టర్‌ని వదిలిపెట్టు.. మంత్రి నా జేబులో మనిషి.. నేను ఎంత చెబితే అంత.. నీ సంగతి తేలుస్తా అంటూ ట్రాక్టర్ యజమాని బెదిరింపులకు పాల్పడ్డట్లు ఎఫ్‌బీఓ పేర్కొన్నడాన్ని గమనిస్తే.. ఇసుకసురులు ఎంతకైనా తెగించడానికి సిద్ధమనే సంకేతాన్ని ఇచ్చినట్టు స్పష్టమవుతుంది. అర్ధరాత్రి పట్టుకున్న ట్రాక్టర్‌ను ఇంటికి తీసుకెళ్లడం యజమాని ధర్నానికి పరాకాష్ట. అటవీ కార్యాలయానికి రమ్మని సమాచారం ఇస్తే, కార్యాలయంలోనే బెదిరింపులకు పాల్పడడం విశేషం. ఘటనను రేంజ్ అధికారి దృష్టికి తీసుకెళ్లినట్టు ఎఫ్‌బీఓ తెలిపారు. ఎఫ్ఆర్ఓ సూచన మేరకు నడుచుకుంటామని స్పష్టం చేశారు.

గ్రూప్-4 ఉద్యోగాలు సాధించిన అన్నాదమ్ములు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



మండలంలోని గోళ్ళపాడు గ్రామానికి చెందిన గీత కార్మికుడు గడ్డమీది వెంకటేశ్వర్లు-వెంకట్రావమ్మా దంపతులకు లెనిన్ కుమార్, మనోజ్ కుమార్ అనే ఇద్దరు కుమారులు కలరు. వీరిద్దరూ గతంలోనే ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో మరోసారి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. చిన్ననాటి నుండి విద్యలో ప్రతిభ కనబరుస్తున్న ఈ అన్నదమ్ములు గ్రూప్-4లో మరల ఉద్యోగాలు సాధించారు. ట్రెజరీ డిపార్ట్మెంట్లో జూనియర్ అకౌంటెంట్‌గా మనోజ్ కుమార్, రెవిన్యూ డిపార్ట్మెంట్లో జూనియర్ అసిస్టెంట్‌గా లెనిన్‌కుమార్ ఉద్యోగాలు సాధించారు. వారిరువురిని గ్రామస్తులు, బంధువులు, మిత్రులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

రెజొనెన్స్ విద్యార్థుల విహారయాత్ర

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ స్కూల్‌లో విహారయాత్ర, కార్తీకమాస వనసమారాధనను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణిలు మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను, మానసికోల్లాసాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో చెరుకూరి గార్డెన్స్లో విహారయాత్రను నిర్వహించామని, కార్తీక మాసంలో ఇలాంటివి ఏర్పాటుచేయడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. రెజొనెన్స్ స్కూల్ విద్యార్థుల సర్వతోముఖాభివృద్దే ధ్యేయంగా నాణ్యమైన విద్యతోపాటు పిక్నిక్లు, ఫీల్డ్ ట్రిప్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ నిరతంరం మంచి ప్రణాళికలతో విద్యార్థులను విజ్ఞానవంతులుగా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ దామాషాపై బహిరంగ విచారణ

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్

నవతెలంగాణ-ఖమ్మం

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ దామాషాపై బీసీ కమిషనర్ డెడికేటెడ్ ఛైర్మన్ బూసాని వేంకటేశ్వరరావు, సెక్రెటరీ బి.సైదులు, కమిటి సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం విచారణ నిర్వహిస్తున్నారు. బిసి కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు హాజరై వారి అభిప్రాయాలను తెలియజేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా ఓబిసి సెల్ అధ్యక్షులు, టిపిసిసి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 04 గంటల వరకు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ప్రజల అభిప్రాయాలు తెలుసుకొనేందుకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తారని తెలిపారు.

భక్తులకు అన్న వితరణ

నవతెలంగాణ-ఎర్రుపాలెం



జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ సన్నిధిలో వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అన్న వితరణ కార్యక్రమంలో భాగంగా కార్తీక మాసంలో దాతల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సేవా సమితి సభ్యులు తెలిపారు. జమలాపురం గ్రామానికి చెందిన వెలిశెట్టి కృష్ణారావు, వాణి దంపతులు, వంశీ, భార్గవి దంపతుల విరాళంతో భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతలు సేవాగుణం కలిగి ఉండాలని, ఎవరైనా అన్నదానం చేయాలని తలంచితే మీ పేర్లను సేవా సమితి వారికి తెలిపిన యడల వారి పేరు మీద స్వామివారి సన్నిధానంలో అన్నదానం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డి నారాయణరెడ్డి, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, కొడాలి విజయలక్ష్మి, బొబ్బాకృష్ణ ప్రసాద్, చింత కిషోర్, వీరమాచినేని వెంకటకృష్ణ, కాకుమాను లీలాకృష్ణ, మాజీ ఈవో విష్ణుమూర్తి, సేవా సమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

శ్రామిక పండ్ల దుకాణాన్ని ప్రారంభించిన కొలికపోగు

నవతెలంగాణ-సత్తుపల్లి

యువకుడు, నిరుద్యోగి ఆరెంపుల హరిబాబు సీపీఐ(ఎం) కార్యాలయం ఎదుట కొత్తగా ఏర్పాటు చేసుకున్న శ్రామిక పండ్ల దుకాణాన్ని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడుతూ నిజాయితీగా వ్యాపారం చేసుకొనే వారికి కొనుగోలుదారుల నుంచి మంచి ప్రోత్సాహం ఉంటుందన్నారు. కష్టపడి ఉన్నత చదువులు చదివినా పాలకులు కొలువులు ఇవ్వని నేపథ్యంలో నిరుద్యోగం కుటుంబానికి భారం కాకూడదనే ఉద్దేశంతో యువకులు హరిబాబు చిన్న వ్యాపారాన్ని ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ ఆర్టీసీ సంఘం ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో సెక్రెటరీ చింతలచెర్వు వెంకట కృష్ణారెడ్డి, రాయల పుల్లారావు, పర్సా వెంకటేశ్వరరావు, ఆలీ పాల్గొన్నారు.

పని కోసం వచ్చిన వలస వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-ముదిగొండ

జాతీయ రహదారి సమీపాన ఉన్న ఓ కంకర మిల్లులో పని కోసం కుటుంబంతో వలస వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన సోమవారం ముదిగొండలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డకల్ గ్రామానికి చెందిన జింకల కృష్ణయ్య అనే వ్యక్తి కుటుంబంతో ఈనెల 8న పని కోసం ముదిగొండ వలస వచ్చి ఓ కంకర మిల్లులో పని చేసుకుంటూ జీవిస్తున్నారు. కృష్ణయ్య పని చేస్తూ ఈనెల 12న రాత్రి కనిపించకుండా అదృశ్యమయ్యాడని పోలీసులు తెలిపారు. భార్య పరిసర ప్రాంతాల్లో భర్త గురించి వెతికి, బంధువులకు ఫోన్ చేసినా ఎక్కడా ఆచూకీ లభ్యం కాకపోవటంతో పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి సీఐ మురళి వివరాలను వెల్లడించారు. కృష్ణయ్య కనిపించకుండా పోయిన రోజు కుంకుమ రంగు చొక్కా, బూడిద రంగు ప్యాంటు ధరించాడని, కుడి చేతిపై బాలమణి అనే పుట్టమచ్చతోపాటు, కనుబొమ్మపై గాయం కలదని తెలిఆపరు. ఎత్తు 5.4 అంగుళాలు ఉంటాడని సీఐ చెప్పారు. కృష్ణయ్య ఆచూకీ లభ్యమైన వెంటనే సీఐ 8712659129, 8712659181 నెంబర్లకు ఫోన్ చేసి పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సిఐ తెలిపారు.

ముత్యాలగూడెం పాఠశాలకు బల్లాల వితరణ


నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం ముత్యాలగూడెం ప్రాథమిక పాఠశాలకు అ పాఠశాల ప్రధానోధ్యాయుడు వాంకుడోత్ శ్రీనివాసరావు రూ.10వేల విలువైన 4 బల్లాలను వితరణ చేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బల్లాలను ఎంఈవో జయరాజు చేతుల మీదిగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో జయరాజు మాట్లాడుతూ విద్యార్థుల సౌలభ్యం కోసం ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు దాతృత్వం చాటటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ అదర్శ కమిటీ చైర్మన్ జ్యోతి, ఉపాధ్యాయులు బీ.సుబ్బారావు, సంతులాల్ పాల్గొన్నారు.

కాలుష్యంపై వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా 5వ రోజు మధ్యాహ్నం పాఠశాల, కళాశాల విద్యార్థులకు పట్టణీకరణ వల్ల జరుగుతున్న కాలుష్యంపై వ్యాస రచన పోటీని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఖమ్మం కార్యదర్శి వి.అర్జున్, గ్రంథాలయ సంస్థ ఉద్యోగ సంఘం అధ్యక్షులు కె.వి.ఎస్.ఎల్.ఎన్.రాజు, కార్యదర్శి యండి.ఇమామ్, గ్రంథాలయ సిబ్బంది లలితకుమారి, రవి బాబు, కిషోర్, అఖిల్, భాస్కర్‌రావు, రోజా, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా నాగండ్ల జగన్ పుట్టినరోజు వేడుక

శుభాకాంక్షలు తెల్పిన ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు

నవతెలంగాణ-కారేపల్లి


కారేపల్లి మండలం సీతారాంపురానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నాగండ్ల జగన్‌మోహన్‌రావు (జగన్) పుట్టిన వేడుకను సోమవారం ఖమ్మం డీసీసీ కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సమక్షంలో నాగండ్ల జగన్‌మోహన్‌రావు పుట్టిన రోజు కేక్‌ను కట్ చేశారు. నాగండ్ల జగన్‌మోహన్‌రావుకు నాయకులు శుభాక్షాంక్షలు తెలిపారు. జగన్ చురుకైన విధేయుడైన కార్యకర్త అని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మహిళ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, జిల్లా నాయకులు బానోత్ రాంమూర్తి, వాంకుడోత్ నరేష్, అజ్మీర ఈరు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి

- కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు

నందిపాటి మనోహర్, టి.ప్రవీణ్

నవతెలంగాణ-ఖమ్మం



భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), తెలంగాణ గిరిజన సంఘం (టిజిఎస్) రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా బెస్ట్ అవైలబుల్ స్కీం కింద విడుదల చేయవలసిన పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కలెక్టర్ ముజామిల్‌ఖాన్‌కు జిల్లా కమిటీల ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి మనోహర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కార్పోరేట్, ప్రైవేటు పాఠశాలలో సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద దళిత పిల్లలు 19వేల మంది, గిరిజన పిల్లలు 6 వేలమంది మొత్తం 25 వేలమంది చదువుకుంటున్నారన్నారు. ప్రతి ఏటా ఫీజులు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా 175 కోట్లు చెల్లించకుండా దళిత, గిరిజన విద్యార్థుల చదువులకు కోత పడే అవకాశం ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 8నెలలు చెల్లించలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఈ బిల్లులు చెల్లించక పోవడంతో పేద విద్యార్థుల తమ చదువులు నష్టపోతు న్నారన్నారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించక పోవడంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పిల్లలకు వసతి, భోజనాలు కూడా పెట్టలేక పోతున్నామని తమ గోడును వెల్లుబోసుకుంటున్నారన్నారు. ఈ స్కీం కింద చదువుతున్న విద్యార్థుల ఫీజులను తల్లిదండ్రులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఈ సమస్య వల్ల ఎందరో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందిచి బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రభుత్వం నుండి బకాయి పడ్డ 175 కోట్ల రూపాయలను చెల్లించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్, కెవిపిఎస్ జిల్లా నాయకులు బొట్ల సాగర్, ఎస్‌కె సైదులు, కుక్కల ముత్తయ్య, తెలంగాణ గిరిజన సంఘం నగర నాయకులు డుంగ్రోత్ శంకర్, ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ అండ్ కాస్మెటిక్ యాక్ట్‌ను విద్యార్థులు రక్షించాలి

- ఫార్మసీ విద్యకు ఉజ్వల భవిష్యత్తు ఉంది
- ఫ్యాకల్టీ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ సమ్మయ్య
- సహస్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కళాశాలలో ఓరియెంటేషన్ పోగ్రాం

నవతెలంగాణ-సత్తుపల్లి



డ్రగ్ అండ్ కాస్మెటిక్ యాక్ట్‌ను రక్షించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ఫ్యాకల్టీ ఫార్మసీ డీన్ గాదె సమ్మయ్య అన్నారు. సోమవారం సత్తుపల్లి మండలం గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఇటీవల కొత్తగా ఏర్పాటైన సహస్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైనెన్స్ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఓరియెంటేషన్ పోగ్రాంలో ప్రొఫెసర్ సమ్మయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ఫార్మసీ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఫార్మసీ ప్రాముఖ్యత, మాదక ద్రవ్యాల దుర్వినియోగ సమస్యలు, సర్టిఫికేట్ అద్దెకు సంబంధించిన అంశాలను ప్రొఫెసర్ సమ్మయ్య వివరించారు. ఫార్మసీ యాక్ట్ 1940, ఫార్మసీ రూల్స్ 1946, డ్రగ్ అండ్ కాస్మెటిక్ యాక్ట్ 1948లను రక్షించాల్సిన గురుతర బాధ్యత విద్యార్థులపై ఆధారపడి ఉందన్నారు. బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఫామ్-డీ చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందనడంలో ఎలాంటి సందేహాలకు ఆస్కారం లేదన్నారు. క్లినికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, రెగ్యులేటరీ అఫైర్స్, ఫార్మకో విజిలెన్స్, డ్రగ్ ఇన్స్‌పెక్టర్, మాన్యుఫ్యాక్చర్ కెమిస్ట్‌గా, మెడికల్ కోడింగ్‌లో ఫార్మకో విజిలెన్స్ కెమిస్ట్‌గా అనేక ఉద్యోగ అవకాశాలు ఫార్మసీ విద్యను అభ్యసించిన విద్యార్థులకు అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో యువ డైనమిక్ డైరెక్టర్ డాక్టర్ తిప్పని, ప్రొఫెసర్ డాక్టర్ గన్ను, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మునగ సాగు రైతులకు ఒక వరం

- ఒక ఎకరంలో అయినా మునగ సాగు చేయండి
- ప్రోత్సాహకాలు అందిస్తాం : కలెక్టర్

నవతెలంగాణ-పినపాక



వ్యవసాయ పొలాల్లో మునగ సాగుతూ రైతులకు మంచి లాభాలు వస్తాయని, వ్యవసాయాన్ని పండుగలా మార్చడమే లక్ష్యంగా అనేక సంస్కరణలు సర్కారు చేపడుతున్నదని, చిన్న సన్నకారు కర్షకులకు అండగా నిలుస్తుందని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం పినపాక మండలంలో పర్యటనలో భాగంగా ఆయన రైతులతో మాట్లాడారు. సాగును లాభసాటిగా మార్చి, ఆర్థిక భరోసా కల్పించేందుకు ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగును ఉద్యాన వన, గ్రామీణాభివృద్ధి శాఖ మునగ సాగుకు ప్రోత్సాహకాలను అందిస్తుందని తెలిపారు. ఐదెకరాల్లోపు భూమి, జాబ్ కార్డు ఉన్న రైతులపై సాగు ఖర్చుల భారాన్ని తగ్గించడంతోపాటు అటు కూలీలకు చేతినిండా పనికల్పించేందుకు మునగ పంటను ఉపాధి హామీ పథకంతో అనుసంధానించిందన్నారు. నాలుగేండ్ల దాకా ప్రభుత్వమే బాధ్యత తీసుకుని మొక్కలు అందించడంతోపాటు నిర్వహణ నిధులను వెచ్చించనుందన్నారు. మునగ సాగు రైతులకు ఒక వరం లాంటిది అన్నారు. ప్రతి ఒక్క రైతు ఒక ఎకరంలోనైనా సరే మునగ సాగు చేయాలన్నారు. పోడు భూముల్లో మునగ సాగు చేసే రైతులకు బోర్ల పర్మిషన్ల కోసం ఫారెస్ట్ ఆఫీసర్లతో మాట్లాడుతానన్నారు. జిల్లాలోని ఆదర్శ రైతులంతా మునగసాగుపై దృష్టి సారించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మునగ సాగు చేపట్టేలా రైతులు ముందుకు రావాలన్నారు. మునగ సాగు రైతులకు అండగా ఉంటామన్నారు. అలాగే ఒక కుంటస్థలంలో చేపల చెరువు సైతం పెంచి కోర మేనలు పెంచడం ద్వారా లాభం పొందవచ్చు అన్నారు. ఆ స్థలంలోనే కోళ్ల ఫారం సైతం ఏర్పాటు చేసి కోళ్ల ద్వారా వచ్చే వ్యర్థాలను చేపల చెరువుకు వాడవచ్చని తెలిపారు. రైతులు ఈ విధంగా ఎకరానికి లక్షల్లో ఆదాయం పొందవచ్చు అని తెలిపారు. పూర్తి వివరాలకు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, తాసిల్దార్ నరేష్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఎన్‌ఆర్ఈజీఎస్ ఏపీవో వీరభద్ర స్వామి రైతులు పాల్గొన్నారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

నవతెలంగాణ-పెనుబల్లి

కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడ్డ ఘటన సోమవారం పెనుబల్లి మండలంలో చోటు చేసుకుంది. ఖమ్మం నుండి వీఎం.బంజర్ వైపు జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారు పెనుబల్లి మండలం టేకులపల్లి స్మశాన వాటిక సమీపంలో అదుపుతప్పి పల్టీలు కొట్టుకుంటూ వరి పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాద సమయంలో కారులో ఖమ్మం నగరానికి చెందిన కళ్యాణి, బిందు, శ్రావణి, కిరణ్, చిన్నారులు హర్షిత, చరిష్‌లు ఉన్నారు. పెనుబల్లి మండలం లంక సాగర్ గ్రామంలోని ఒక శుభకార్యానికి హాజరయ్యేందుకు వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని బాధితులు తెలిపారు. కారు ప్రమాదం తీవ్రత అధికంగా ఉన్న స్వల్ప గాయాలతో బయటపడటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. గాయపడిన వారిని పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14 వ విడత సామాజిక తనిఖీలో భాగంగా నేడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఈదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ విడత సామాజిక తనిఖీలో భాగంగా 1-4-2023 నుండి 31-03-2024 వరకు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందాల ద్వారా తనిఖీ నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. దీనిపై తుది నివేదిక సమర్పించటానికి ప్రజా వేదిక ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదికకు ఈజీఎస్, పంచాయతీరాజ్ సంబంధిత శాఖల సిబ్బంది పూర్తిస్థాయి సమాచారంతో సమయపాలన ప్రకారం ప్రజావేదిక కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆళ్ళపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై ఈ.రతీష్ కథనం ప్రకారం.. మండలంలోని మర్కోడు గ్రామానికి చెందిన జల్లారపు సాగరిక(29) భర్త జల్లారపు రంజిత్‌లకు 11 సంవత్సరాల కితం వివాహం జరిగింది. రంజిత్ సొంత ఊరు అనిశెట్టిపల్లి గ్రామం. కూలి పని నిమిత్తం తల్లి గారి ఊరైన మర్కోడు గ్రామం గత ఎనిమిది సంవత్సరాల క్రితం వచ్చి, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెక్కాడితే డొక్కాడని కుటుంబ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక సోమవారం మనస్థాపానికి గురై ఇంట్లోని ఫ్యాన్‌కి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సాగరికకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.



పోడు పట్టాలను పంపిణీ చేయాలి

- మాజీ ఎంపీ మిడియం బాబురావు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గిరిజన రైతులకు పోడు మంజూరు చేయించి పంపిణీ చేయాలని మాజీ ఎంపీ మిడియం బాబురావు అన్నారు. ఉమ్మడి రేగళ్ళ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గిరిజన రైతులతో కలిసి భద్రాచలం ఐటిడిఏ పివోకి ఈ ప్రాంతంలో ఉన్న పొడుపట్టా సమస్యలను వివరిస్తూ వాటిని వెంటనే పరిష్కారం చేసి గిరిజనులను పోడు పట్టా వెంటనే పంపిణీ చేయాలని కోరడం జరిగింది. ఈ సమస్యపైన స్పందించిన పివో అతి త్వరలో పొడుపట్టాలు అందేలా చర్యలు తీసుకుంటానని హామీఇచ్చారు. ఈ విషయంపైన భద్రాచలం మాజీ ఎంపీ మీడియం బాబురావు మాట్లాడుతూ.. అతి త్వరలో పొడు పట్టా పంపిణీ అవుతాయని ఆ ధైర్యం పడవద్దు అని పట్టా పంపిణీ కాని యెడల తర్వాత దశలవారీగా పోరాటం చెదాంమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం జిల్లా నాయకుడు అన్నరపు సత్యనారాయణ, తెలంగాణ రైతు సంఘం లక్ష్మీదేవిపల్లి మండలం కార్యదర్శి వాంకుడోత్ కొబల్, ఎఫ్‌ఆర్‌సి కమిటీ చైర్మెన్ వాంకుడోత్ అమర్‌సింగ్, పిసా కమిటీ ఉపాధ్యక్షుడు వాంకుడోత్ సురేష్, గిరిజన రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-పాల్వంచ రూరల్



ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచలో ఎం కామ్ పీజీ కోర్సులో స్పాట్ అడ్మిషన్ల కొరకు దరఖాస్తులను ఈనెల 18 నుండి 20వ తేదీ వరకు తీసుకోవడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. పద్మ, పీజీ కోఆర్డినేటర్ పారెల్లి శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంకామ్(పీజీ) కోర్స్ నందు అడ్మిషన్ పొందుటకు డిగ్రీ స్థాయిలో బీకాం నందు 50 శాతానికి తగ్గకుండా పర్సంటేజ్ ఉన్నవారు మాత్రమే అర్హులన్నారు. సీటు మేనేజ్మెంట్ కోటాకు సంబంధించింది కాబట్టి ఎటువంటి స్కాలర్షిప్‌లకు అర్హత ఉండదని తెలిపారు. అడ్మిషన్ కొరకు కోఆర్డినేటర్ పారెల్లి శ్రీనివాస్ 7981259800ను సంప్రదించాలని కోరారు.



యరమల పూర్ణచంద్రారెడ్డి సహకారంతో

పాఠశాలకు వాటర్ ప్లాంట్ వితరణ

నవతెలంగాణ-ఎర్రుపాలెం



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తాగటానికి మంచి నీళ్లు లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితిని గమనించిన దాత యరమల పూర్ణచంద్రారెడ్డి సహృదయంతో తన సొంత ఖర్చులతో ప్యూరిఫైర్ వాటర్ ప్లాంట్‌ను వితరణ చేశారు. బీమవరం గ్రామంలో గల జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు లక్ష రూపాయల విలువ కలిగిన మంచినీళ్ల ప్లాంటును స్థానిక నాయకులతో కలిసి పూర్ణచంద్రారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత పూర్ణ చంద్రారెడ్డి మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులు మంచినీటి కోసం పడుతున్న ఇబ్బందిని తన కళ్లారా చూసి స్వచ్ఛమైన మంచినీళ్లను అందించాలనే తలంపుతో ప్యూరిఫైయర్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పూర్ణ చంద్రారెడ్డికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, ఎర్రమల శ్రీనివాసరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ అనుమోలు కృష్ణారావు, సీపీఐ(ఎం) నాయకులు గొల్లపూడి కోటేశ్వరరావు, నల్లమోతుల హనుమంతరావు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


లైసెన్స్ ఉంటేనే పత్తి కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-కారేపల్లి

ట్రేడింగ్ లైసెన్స్ ఉన్న వ్యాపారులు మాత్రమే రైతుల వద్ద నుండి పంటలు కొనుగోలు చేయాలని, లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, కార్యదర్శి నరేష్‌లు ఉన్నారు. సోమవారం కారేపల్లి సినిమా హాల్ ప్రాంగణంలో కారేపల్లి, కామేపల్లి మండలాలకు చెందిన వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి వ్యాపారి లైసెన్స్‌తోనే వ్యాపారం చేయాలన్నారు. లైసెన్స్ లేని వారు వెంటనే లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో అనాధికార కొనుగోళ్లపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామన్నారు. లైసెన్స్ వ్యాపారులు సైతం తునికల కొలతల శాఖ ధృవీకరణ ఎలక్ట్రానిక్ కాంటాను వినియోగించాలన్నారు. రైతులు మోసకుండా ప్రభుత్వం సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతు క్వింటా పత్తి తీసుకవచ్చిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేస్తామన్నారు. ఇప్పటికి కారేపల్లి సీసీఐ కేంద్రంలో 6వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయటం జరిగింది. ఈనెల 8వ తేది లోపు కొనుగోలు చేసిన పత్తికి రైతుల బ్యాంకు ఖాతాలలో పైకం జమ అయిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరక్టర్లు గప్రునాయక్, బావుసింగ్, సిబ్బంది మున్సీర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడితోటలో హార్వెస్ట్ విద్యార్థుల వనవిహారం

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని హార్వెస్ట్ పాఠశాల ప్రైమరీ విద్యార్థినీ, విద్యార్థులను నగర సమీపంలో ఎంతో సువిశాలమైన కొదుమూరు మామిడితోటకు తీసుకువెళ్లారు. సుమారు 800 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ వన విహారయాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ రకాల ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు మ్యాజిక్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్. పార్వతీరెడ్డి మాట్లాడుతూ పాఠశాల బయట ప్రకృతి ఒడిలో స్వేచ్ఛగా ఆడుకునే విధంగా చక్కటి ఏర్పాట్లు చేసి వారిని కొదుమూరు మామిడితోటకు తీసుకు వెళ్లామన్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా ఈ వనవిహార కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రిక్రియేషన్ గేమ్స్ నిర్వహించి గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రైమరీ హెచ్ఎం. మానస, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, పియిటీలు పాల్గొన్నారు.



'మహాలక్ష్మి'లో వస్తున్న సమస్యలను పరిష్కరించాలి

ఎస్‌డబ్ల్యూఎఫ్ కరపత్రాల పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం

ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల ఉచిత ప్రయాణం కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం అమలులో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని, టికెట్లు ఇచ్చే మిషన్లలో జీరో టిక్కెట్లు, పెయిడ్ టిక్కెట్లు సక్రమంగా వచ్చే విధంగా అవసరమైన మార్పులు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, డ్రంకన్ డ్రైవ్ కేసులకు సంబంధించి నాణ్యమైన బ్రీత్ ఎనలైజర్స్‌ను ఉపయోగించాలని కోరుతూ ఖమ్మం డిపో వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ రూపొందించిన కరపత్రాలు పంపిణీ చేశారు. సోమవారం ఖమ్మం బస్ డిపో వద్ద మొదటి షిఫ్ట్ నుండి డ్యూటీకి వెళ్లే కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం అమలు తరువాత ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగిందని, అందుకు సరిపడిన బస్సులు లేకపోవడంతో ప్రయాణికుల కోపం ఆర్టీసీ కార్మికులపై దాడుల రూపంలో చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విపరీతమైన ప్రయాణికుల రద్దీలో మహిళా ప్రయాణికుల గుర్తింపు కార్డులు పరిశీలించడం ఇబ్బందికరంగా ఉంటుందని, అందువల్ల వెంటనే స్మార్ట్ కార్డులు ప్రవేశపెట్టే అంశం పరిశీలించాలని అందుకు అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని ఆయన కోరారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఖమ్మం రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు మద్యం సేవించి ఉద్యోగం చేయడాన్ని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌గా ఏ పరిస్థితుల్లోనూ సమర్థించబోమని, అయితే మద్యం సేవించే అలవాటు లేకున్నప్పటికీ బ్రీత్ అనలైజర్ టెస్టులలో మద్యం సేవించినట్టుగా చూపిస్తుందని, అదే పోలీస్ డిపార్ట్మెంట్ వారి బ్రీత్ ఎనలైజర్ మిషన్‌తో చెక్ చేస్తే జీరో రీడింగ్ చూపిస్తూ ఉందని అన్నారు. అందువలన నాణ్యమైన బ్రీత్‌ఎనలైజర్ మిషన్లను వాడాలని కోరారు. కార్యక్రమంలో డిపో కమిటీ అధ్యక్షులు పగిళ్లపల్లి నరసింహారావు, డిపో కమిటీ నాయకులు బి.కృష్ణయ్య, బసవయ్య, గుర్రం రామారావు, సీనియర్ నాయకులు దండా కృష్ణమూర్తి, మిర్యాల వెంకటేశ్వర్లు, గుండు మాధవరావు, లలిత, రమా, లక్ష్మి పద్మ, అన్నాబత్తుల అశోక్ కుమార్ పాల్గొన్నారు.



బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

దళిత, గిరిజన బెస్ట్ అవైలబుల్ పథకం కింద గత రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.175 కోట్లను తక్షణం విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్), తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులకు వినతి పత్రాలను అందజేసినట్టు ఆయా సంఘాల రాష్ట్ర కార్యదర్శులు టి.నాగరాజు, టి.స్కైలాబ్ బాబు, ఆర్. శ్రీరాం నాయక్ తెలిపారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల్లో సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 19వేల మంది దళిత పిల్లలు, 6 వేలమంది గిరిజన పిల్లలు చదువుకుంటున్నారని తెలిపారు. ప్రతి ఏటా ఫీజులు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, గత రెండేండ్లుగా రూ. 175 కోట్లు చెల్లించకపోవటంతో దళిత, గిరిజన విద్యార్థుల చదువులకు కోత పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఎనిమిది నెల్లపాటు వాటిని చెల్లించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా అదే పరిస్థితి కొనసాగించటంతో పేద విద్యార్థులు తమ చదువులను నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు పిల్లలకు వసతి, భోజనాలు కూడా కల్పించలేక పోతున్నాయని తెలిపారు. ఆ ఫీజులను విద్యార్థుల తల్లిదండ్రులు చెల్లించాలంటూ యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బకాయి పడ్డ రూ.175 కోట్లను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన, పోరాటాలకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు. సంఘాల ప్రతినిధులతో ముఖ్య కార్యదర్శులు మాట్లాడుతూ ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు ఏం. దశరథ్, గిరిజన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎం. ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమకొండలో సీఎం పర్యటన

- ఇందిరా మహిళా శక్తి సభ, కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం

నవతెలంగాణ–సుబేదారి

హనుమకొండ జిల్లాలో ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాలు, ఇందిరా మహిళాశక్తి సభ సందర్భంగా మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నేటి మధ్యాహ్నం 2.30 నుంచి 3.10గంటల వరకు కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవంలో సీఎం పాల్గొంటారు. తర్వాత ఆర్ట్ గ్యాలరీ సందర్శిస్తారు. 3.20 నుంచి 3.50గంటల వరకు 30 నిమిషాల పాటు ఆర్ట్స్ కళాశాలలో మహిళాశక్తి సభలో ప్రసంగిస్తారు. తర్వాత స్టాల్‌లను పరిశీలిస్తారు. మహిళా సంఘాల సభ్యులతో సీఎం మాట్లాడనున్నారు. తర్వాత మంత్రుల ప్రసంగాలు ఉంటాయి. తర్వాత 22 ఇందిరా మహిళాశక్తి భవనాలకు శంకుస్థాపనలు ఉంటాయి. తర్వాత ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌లు, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద బ్యాంక్ లింకేజీ చెక్కు, బీమా చెక్కు పంపిణీలు పంపిణీ చేస్తారు. తర్వాత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడతారు. సీఎం పర్యటన, కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లు, భద్రతా చర్యలు పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు.

శంకర్‌పల్లిలో భారీ చోరీ

- కౌన్సిలర్ ఇంట్లో 133 తులాల బంగారం, 80 తులాల వెండి అపహరణ
- కూతురి పెండ్లికి తెచ్చిన ఆభరణాలు


నవతెలంగాణ–శంకర్‌పల్లి

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో దొంగలు భారీ చోరీకి పాల్పడ్డారు. మున్సిపల్ కౌన్సిలర్ రాధాబాలకృష్ణ ఇంట్లో సుమారు 133 తులాల బంగారం, 80 తులాల వెండిని అపహరించారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని కౌన్సిలర్ రాధాబాలకృష్ణ కూతురి వివాహం ఈ నెల 20వ తేదీన జరగనుంది. ఇందుకోసం బంగారం, వెండి ఆభరణాలు తీసుకొచ్చారు. ఆదివారం ఇంట్లో మెహందీ ఫంక్షన్ జరిగింది. పెండ్లి కూతురికి బంగారం, వెండి ఆభరణాలు పెట్టాలని చూస్తే 133తులాల బంగారం, 80 తులాలు వెండి ఆభరణాలు,రెండున్నర లక్షల రూపాయల నగదు కనిపించలేదు. దాంతో వెంటనే వారు శంకర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని నార్సింగి ఏసీపీ రమణగౌడ్, సీఐ హరిప్రసాద్‌రెడ్డి, శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు.

క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

బాలిక హత్య కేసులో నిందితుల అరెస్ట్

- ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తే ప్రధాన నిందితుడు
- స్నేహితుడితో కలిసి హత్య చేసిన చింటు
- వివరాలు వెల్లడించిన మియాపూర్ సీఐ క్రాంతి



నవతెలంగాణ–మియాపూర్

ఇటీవల ఇంట్లో నుంచి వెళ్లిపోయి హత్యకు గురైన బాలిక కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. బాలికకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తే ప్రధాన నిందితుడిగా గుర్తించారు. అతనితో పాటు సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మియాపూర్ సీఐ క్రాంతికుమార్ మీడియాకు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా మియాపూర్ పీఎస్ పరిధిలోని టెక్ అంజయ్యనగర్‌కి చెందిన ఐశ్వర్య(17)కు ఉప్పుగూడ ప్రాంతానికి చెందిన చింటూ అలియాస్ విగ్నేష్‌తో ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. ఇది కాస్తా ప్రేమగా మారింది. 20 రోజుల కిందట ఐశ్వర్య ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆ తర్వాత తరచూ ఇంట్లో వారికి ఫోన్ చేసి మాట్లాడేది. ఈ నెల 8వ తేదీ నుంచి ఐశ్వర్య నుంచి కుటుంబ సభ్యులు ఫోన్ రాలేదు. దాంతో వారు మియాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. చింటు అనే వ్యక్తిపై తమకు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ నెల పదో తేదీన తాము పెండ్లి చేసుకున్నట్టు బాలిక కుటుంబ సభ్యులకు చింటు ఫొటోలు పోస్టు చేశాడు. కానీ, చింటు తన స్నేహితుడు సాకేత్, సాకేత్ భార్య కల్యాణితో కలిసి ఐశ్వర్యను హత్య చేశారు. పథకం ప్రకారం తుక్కుగూడలోని ఓ ఇండ్రస్టియల్ ఏరియాలో ఉన్న ప్లాస్టిక్ కంపెనీ పరిసర ప్రాంతంలో ఐశ్వర్యను హత్య చేశారు. సోమవారం ఐశ్వర్య మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు.. చింటుతోపాటు అతనికి సహకరించి సాకేత్, కల్యాణిని అరెస్టు చేశారు. తదుపరి విచారణ జరుగుతుందని, పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని సీఐ తెలిపారు. మియాపూర్ పోలీసులు వేగంగా స్పందించి ఉంటే తమ అమ్మాయి బతికి ఉండేదని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాలిక అదృశ్యం విషయం కూడా గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానిక యువజన సంఘం నాయకుడు కలగజేసుకున్న తరువాతే పోలీసులు స్పందించినట్టు సమాచారం.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధిపై..

బహిరంగ చర్చకు సిద్ధమా?

- మాజీ మంత్రి హరీశ్‌రావుకు టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ సవాల్
- సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశానికి హాజరు



నవతెలంగాణ–సంగారెడ్డి

పదేండ్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ 11 నెలల పాలనలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని మాజీ మంత్రి హరీశ్‌రావుకు టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అధ్యక్షతన సంగారెడ్డిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు గణేష్‌గడ్డ నుంచి సంగారెడ్డి వరకు భారీ ర్యాలీ నిర్వహించి టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జగ్గారెడ్డికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే రూ.18 వేల కోట్ల రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.10లక్షల వరకు ఆరోగ్యశ్రీ పెంపు లాంటి పథకాలు అమలు చేసినట్టు చెప్పారు. త్వరలో రైతుబంధు పథకాన్ని కూడా అమలు చేస్తామని ప్రకటించారు. తెలంగాణ వచ్చిన తర్వాత పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారని, వాటి వడ్డీల కింద నెలకు రూ.10వేల కోట్లు కడుతున్నట్టు చెప్పారు. కేసీఆర్ పదేండ్లలో 50వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే 50 వేల ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. మరోసారి కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఆకాంక్షించారు. హరీశ్‌రావు, ఇతర నాయకులు పక్కచూపులు చూస్తున్నారని, వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్‌లో తండ్రి, కొడుకు, కూతురు తప్పా ఎవరూ మిగలరని తెలిపారు.

దేశ చరిత్రలో ఎన్నడూ చేయని విధంగా కుల గణన : మంత్రి దామోదర రాజనర్సింహ

దేశ చరిత్రలో ఎన్నడూ చేయని విధంగా కాంగ్రెస్ పార్టీ కులగణన చేస్తున్నదని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవానికి వైద్య సేవలు అందించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం తెచ్చిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. 1375 రకాల చికిత్సలను కొత్తగా ఆరోగ్య శ్రీలో చేర్చినట్టు చెప్పారు. జాబ్ క్యాలెండర్ కచ్చితంగా అమలు చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూ కాంగ్రెస్ పార్టీనే గెలిచే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే సంగారెడ్డి తో పాటు మెదక్, సిద్దిపేట జిల్లాలోనూ అన్ని స్థానాలను కైవసం చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐసీసీ చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి, నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కార్పొరేషన్ చైర్మెన్లు గిరిధర్ రెడ్డి, నీలం మధు, గాలి అనిల్ కుమార్, మాజీ మంత్రి చంద్రశేఖర్, సీడీసీ చైర్మెన్ రామ్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మెన్ తోపాజి అనంత కిషన్ నాయకులు పాల్గొన్నారు.

పూడూర్ కస్తూర్బా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత

- విద్యాసంవత్సరం వృథా అవుతుందని ఆందోళనతో పాఠశాల ఆవరణలో విద్యార్థినుల నిరసన
- ఇండ్లకు వెళ్తామంటున్న విద్యార్థులు
- ఆరు నెలలుగా టీచర్ల కోసం ఎదురుచూపు



నవతెలంగాణ–పూడూర్

వికారాబాద్ జిల్లా పూడూర్ కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. విద్యా సంవత్సరం పూర్తికావస్తున్నా పాఠశాలలో పూర్తి స్థాయిలో సిబ్బంది లేరు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ రెండేండ్లకు సంబంధించి కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. మిగతా ఉపాధ్యాయులు వస్తున్నారని చెప్తున్నారు తప్ప ఇప్పటివరకు రాలేదు. దాంతో ఇది ఇలాగే కొనసాగితే తమ విద్యాసంవత్సరం నాశనం అయిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థినులు నిరసన తెలిపారు. ఉపాధ్యాయులు రాకపోతే తాము ఇండ్లకు వెళ్లి పోతామని, తమ టీసీలు ఇవ్వాలని ఉపాధ్యాయుల ఎదుట మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ఆరు నెలలు గడుస్తున్నా ఒక్క టీచర్ కూడా రావడం లేదన్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నా ఇప్పటివరకు పాఠాలు చెప్పడం ప్రారంభం కాకపోతే పరీక్షలు ఎలా రాయాలని ప్రశ్నించారు. గత నెల దసరా పండుగ అయిపోగానే పూర్తిస్థాయిలో అధ్యాపకులు వస్తారని చెప్పినా ఇప్పటివరకు ఎవరూ రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు ఇండ్లకు వెళ్లిపోతామని మొండికేయడంతో ఎస్ఓ ఫాతిమా స్పందించి జీసీడీఓ శ్రీదేవితో మాట్లాడారు. ఆమె విద్యార్థులతో మాట్లాడి రేపటిలోగా ఉపాధ్యాయులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

మెయినాబాద్‌లో బీజేపీ ఎంపీల అరెస్టు, విడుదల

- లగచర్ల వెళ్తున్న డీకే అరుణ, ఈటల రాజేందర్‌ను అడ్డుకున్న పోలీసులు
- అరెస్టు చేసి నార్సింగి పీఎస్‌కు తరలింపు
- పోలీసుల తీరుపై ఎంపీల ఆగ్రహం
- పేదల భూములు లాక్కుంటూ.. సీఎం తమ్ముళ్ల దౌర్జన్యం : బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ
- కంది జైల్లో ఉన్న లగచర్ల బాధితులతో ములాఖత్





నవతెలంగాణ–మొయినాబాద్, సంగారెడ్డి

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల ఫార్మా భూ బాధితులను సోమవారం పరామర్శించడానికి వెళ్తున్న బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్‌ను రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ 144 సెక్షన్ ఉన్న కారణంగా వెళ్లొద్దని పోలీసులు స్పష్టం చేశారు. దాంతో పోలీసుల తీరుపై ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సొంత నియోజకవర్గంలో తిరగనివ్వరా అంటూ పోలీసులపై మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రత్నం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే పోలీసులు ఇద్దరు ఎంపీలను అక్కడి నుంచి నార్సింగి పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజాస్వామ్యం ఉందా చచ్చిపోయిందా అని ప్రశ్నించారు. కొడంగల్ రేవంత్‌రెడ్డి జాగిరా అని నిలదీశారు. సెక్షన్ 151 కింద నాయకులను అడ్డుకునే రైట్ ఉందని పోలీసులు స్పష్టం చేయడంతో పోలీసుల తీరును ఈటల రాజేందర్ తీవ్రంగా ఖండించారు.

కంది జైల్లో ఉన్న లగచర్ల బాధితులతో ఎంపీల ములాఖత్

సంగారెడ్డి జిల్లా కంది జైల్లో ఉన్న లగచర్ల బాధితులతో సోమవారం బీజేపీ ఎంపీలు డీకే ఆరుణ, ఈటల రాజేందర్ ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా డీకే అరుణ విలేకరులతో మాట్లాడుతూ.. లగచర్ల గ్రామం తన పార్లమెంట్ పరిధిలో ఉన్నప్పటికీ సందర్శించేందుకు ఎందుకు అనుమతించడం లేదని ప్రశ్నించారు. అక్కడి పరిస్థితులు నిజానిజాలు బయట ప్రపంచానికి తెలియకుండా ఆపేందుకు ముఖ్యమంత్రి ఎందుకంత తాపత్రయపడుతున్నారని అన్నారు.

ఘటన జరిగిన రోజు రాత్రి ముఖ్యమంత్రి తమ్ముడు, కాంగ్రెస్ కార్యకర్తలు రైతులను భయభ్రాంతులకు గురిచేసి వారి నుంచి భూములు గుంజుకున్న విషయం వాస్తవం కదా అని ప్రశ్నించారు. గర్భిణీ మహిళా భర్తను కూడా తీసుకువచ్చి అందరిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రైతులను జైల్లో పెట్టి విచక్షణా రహితంగా కొట్టడం దారుణమన్నారు. రైతుల పక్షాన బీజేపీ పోరాటం చేస్తదని, వారి కుటుంబాలను కూడా కలుస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజిరెడ్డి, రాజేశ్వర్ రావ్ దేశ్పండే, జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్ రావు, డాక్టర్ రాజు గౌడ్, వెంకట నరసింహారెడ్డి సుభాష్ రెడ్డి, కొండాపురం జగన్, ద్వారక రావి, మీనా గౌడ్, మందుల నాగరాజ్, దోమల విజయ్ కుమార్, మండల అధ్యక్షులు సదానంద్ చారి, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెలివ్వాలి

- జీఎంపీఎస్ రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్
- అంగళ్లను సొసైటీలకు అప్పగించి, తూకం పద్ధతిలో అమ్మకాలు సాగించాలి
- దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలి : రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రెండవ విడుత గొర్రెల పంపిణీనిదళారుల ప్రమేయం లేకుండా నగదు బదిలీ ద్వారా చేపట్టాలని గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "గొర్రెల పెంపకందారుల పట్ల ప్రభుత్వ వైఖరి" అనే అంశంపై జీఎంపీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో చనిపోయిన గొర్ల కాపరులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు 50 ఏండ్లు నిండిన వారికి రూ.5 వేల పింఛన్ మంజూరు చేయాలని కోరారు. పాలమూరు గొర్రెల పరిశోధనా కేంద్రానికి 200 ఎకరాల స్థలాన్ని కేటాయించి అభివృద్ధి చేయాలనీ, కేంద్ర ప్రభుత్వ ఎన్ఎల్ఎం పథకంలో గొల్ల, కురుమలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. గడువు ముగిసిన సొసైటీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెలు, మేకలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ చేయించాలనీ, నట్టల నివారణ మందులతో పాటు అన్ని రకాల వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరారు. సదర్ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామనీ, అయితే దాని నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బీనవేని రామయ్య షెపర్డ్ మాట్లాడుతూ గొర్ల కాపర్లు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందినప్పుడే వారి సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. రాష్ట్రంలోని గొల్ల, కుర్మ సంఘాలన్నీ విభేదాలు పక్కన పెట్టి ఐక్యంగా గ్రామ స్థాయిలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గొర్ల కాపర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, మాదాసి కురుమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డి.రంగన్న, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకులు గుంటి చంద్రుడు, ఒగ్గు కళాకారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బెల్లం పరమేశ్, కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు గొరిగే నర్సింహ కురుమ, తెలంగాణ యాదవ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు గంగుల మధు యాదవ్, బానవేని మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ మెడికల్ కాలేజీలోనూ ర్యాగింగ్

- ఐదుగురు విద్యార్థుల సస్పెన్షన్

నవతెలంగాణ–నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి



నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలలోనూ ర్యాగింగ్ కలకలం రేపింది సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ఫోన్లో వేధించి ర్యాగింగ్ చేసినట్టు బాధితులు కళాశాల ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు వచ్చింది. దీంతో రంగంలో దిగిన యాంటీ ర్యాగింగ్ బృందం విచారణ చేపట్టింది. యాంటీ ర్యాగింగ్ బృందం సభ్యులుగా ఉన్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విచారణ జరిపి కళాశాల ప్రిన్సిపాల్‌కు నివేదిక అందజేశారు. కేరళ రాష్ట్రానికి చెందిన మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను సీనియర్ విద్యార్థులు వేధించింది వాస్తవమేనని తేలింది. దాంతో కళాశాల ప్రిన్సిపాల్ సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేశారు. సస్పెండ్ అయిన వారిలో అభినవ్, మణిదీప్‌ను ఆరు నెలలు, బాలరాజు నగేష్‌ను మూడు నెలల పాటు, శరత్‌ను నెలరోజుల పాటు సస్పెండ్ చేసినట్టు తెలిసింది. ఈ ఘటనలో సీసీ కెమెరా ఫుటేజ్‌లు, విద్యార్థులు మాట్లాడుకున్న ఆడియో క్లిప్పింగ్స్ ఆధారాలుగా నిలిచాయి.

చురుగ్గా నిమ్జ్ భూ సేకరణ



నవతెలంగాణ–న్యాల్‌కల్

సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని న్యామతబాద్‌లో నిమ్జ్ భూసేకరణ ప్రక్రియ చురుగ్గా కొనసాగుతున్నది. వారం రోజులుగా పట్టా, గౌటాన్ 400 ఎకరాలకు పైగా భూములను సేకరించినట్టు సంబంధిత అధికారులు చెప్పారు. సోమవారం జరిగిన సర్వేలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌రావు, సర్వేయరు లాల్‌సింగ్, నర్సింలు, రైతులు నాగేష్, శివశంకర్ తదితరులున్నారు.

ప్రజల జీవనోపాధుల రక్షణకు 26న దేశవ్యాప్త నిరసన

(మొదటిపేజీ తరువాయి)

నష్టాలు, ఇబ్బందులను సుదీర్ఘంగా చర్చించింది. అన్ని పంటలకు మద్దతు ధర వ్యవసాయ ఖర్చుకు 50 శాతం అదనంగా జోడించాలనీ, రుణమాఫీ చట్టాన్ని అమలు చేయాలని అనేక సంవత్సరాలుగా రైతులు పోరాడుతున్న సంగతిని గుర్తు చేసింది.

రాష్ట్ర సదస్సుకు ఆయా సంఘాల నేతలు మూడ్ శోభన్, హనుమంతరావు, కె.రంగారెడ్డి, విస్సా కిరణ్‌కుమార్, మండల వెంకన్న, జె.సత్యనారాయణ, జి గోపాల్, వి. మట్టయ్య యూసుఫ్, భూపాల్, నాగన్నగౌడ్, ఎస్.ఎల్.పద్మ, శివబాబు, అరుణ, అనిల్‌కుమార్ అధ్యక్షతవర్గంగా వ్యవహరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక విధానాలపై పశ్య పద్మ, టి.సాగర్, వేములపల్లి వెంకటరామయ్య, బాలరాజు, జి వెంకటేష్, సూర్యం, ఎం.శ్రీనివాస్, ఐ కృష్ణ, విజయ్‌కుమార్, బి.కొండల్, మామిడాల బిక్షపతి, పెద్దారపు రమేష్, బి భాస్కర్, జక్కుల వెంకటయ్య కాంతయ్య, వెంకట్‌రాములు, జి వెంకటేశ్వర్లు, గోనే కుమారస్వామి తదితరులు మాట్లాడారు.

విస్తృత ప్రచారం

ఎస్కేఎం నాయకులు జె.వెంకటేష్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా పలువురు సమర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలైన బీహెచ్ఈఎల్, బొగ్గు, ఎన్‌టీపీసీ, రక్షణ, చమురు, సిమెంటు తదితర పరిశ్రలను కేంద్రం క్రమేణా నిర్వీర్యం చేస్తూ వస్తున్నదన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రభుత్వ ప్రయివేటు రంగంలోని పరిశ్రమలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఎనిమిది గంటల నుంచి 12 గంటల పని విధానాన్ని తెచ్చేందుకు పరోక్షంగా లేబర్‌కోడ్‌లు అందుబాటు లోకి తెచ్చిందన్నారు. కనీస వేతనాల బోర్డులు ఉనికిలో లేవన్నారు. ఈనెల 18 నుంచి 25 వరకు విస్తృత ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా కేంద్రాల్లో రౌండ్ టేబుళ్ల, సమావేశాలు, సదస్సులు నిర్వహించాలని సూచించారు. రద్దుచేసిన వ్యవసాయ చట్టాలను మరోరూపంలో అమలు చేసేందుకు మోడీ సర్కారు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. బలవంతపు భూసేకరణకే సీఎం నియోజకవర్గంలో ప్రయత్నం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక కార్యాచరణను సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి ఫసల్ బీమాతో రైతులకు ప్రయోజనం లేదనీ, ఆ పథకాన్ని మార్చాలని కోరారు. 15 డిమాండ్లను పరిష్కరించాలంటూ ఈనెల 26 మండల, జిల్లా కేంద్రాల్లో నిరసన చేపట్టాలని రైతులు, కార్మికులకు విజ్ఞప్తి చేశారు. సంపదంతా ప్రయివేటుపరం చేస్తున్న మోడీని ప్రతిఘటించాలని సూచించారు. మార్కెట్ లోపాల మూలంగా రైతులకు అన్యాయం జరుగుతున్నదన్నారు. దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో 56 వేల గ్రామాల్లో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేపట్టాలని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలుకు పోరాటం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ కార్మిక, కర్షక సమస్యల పరిష్కారానికి ఉమ్మడిగా ప్రయత్నం చేయాలని సూచించారు. కేంద్రం బిక్షమేస్తున్నట్టుగా ప్రవర్తిస్తున్నదని తప్పుబట్టారు. రైతులను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. వాగ్దానాలు చేయడమే తప్ప, అమలు చేయడం లేదని వ్యాఖ్యానించారు.

డిమాండ్లు

- 1.అన్ని పంటల ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధరలను ప్రకటించాలి
- 2. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. కాంట్రాక్టు విధానాన్ని నిషేధించాలి
- 3. రైతులందరికీ పంట రుణాలను మాఫీ చేయాలి
- 4. కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్ రూ. 10 వేలు అందరికీ ఇవ్వాలి.
- 5.ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలి. రక్షణ, రైల్వే, ఆరోగ్యం, విద్య, విద్యుత్ రంగాలను ప్రయివేటీకరించొద్దు. ఇండ్లకు 300 యూనిట్ల మేర ఉచిత విద్యుత్ సరఫరా చేయాలి
- 6. ఐసీఏఆర్ కార్పొరేట్ కంపెనీలతో జరిగిన వ్యవసాయ ఒప్పందాలను రద్దు చేయాలి.
- 7. భూసేకరణ చట్టం-2013, అటవీ హక్కుల చట్టం-2006ను అమలుచేయాలి.
- 8. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని 200 రోజులకు పెంచాలి. కనీసం వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలి. పెండింగ్ బకాయిలు చెల్లించాలి. పథకాన్ని పట్టణాలకు విస్తరించాలి. వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి.
- 9. రైతు భరోసాను వానాకాలం, యాసంగి పంటలకు ఇవ్వాలి. మ్యానిఫెస్టో ప్రకారం పంటల బోనస్ ఇవ్వాలి.
- 10. కౌలు రైతులను గుర్తించి అన్ని పథకాలు వర్తించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం చేయాలి
- 11. పంటల బీమా పథకం అమలుచేయాలి.
- 12.అధిక ధరలను తగ్గించాలి. ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి.
- 13. మతాల మధ్య విభజన ఆపాలి. రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకిక సంప్రదాయాలను పాటించాలి
- 14.మహిళా సాధికారతను పెంపొందించాలి. మహిళలు, చిన్న పిల్లలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులు, హత్యలు, లైంగిక వేధింపులను అరికట్టాలి. సత్వర న్యాయం అందించే న్యాయ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
- 15. అసంఘటిత కార్మికులకు 'యూనివర్సల్ సోషల్ సెక్యూరిటీ స్కీమ్' ప్రవేశపెట్టాలి. 2019 మోటారు వాహనాల చట్టాన్ని సవరించి మోటార్ కార్మికులను ఆదుకోవాలి.

సమాజంలోని వివక్షను ఎదిరించి ఓ యక్షగాన కళాకారిణిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ కళారూపాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయురాలిగా మారారు. సాంప్రదాయక కళారూపాన్ని రక్షించేందుకు ఔత్సాహికులను ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నారు. తండ్రి ప్రోత్సాహంతో చిన్నతనం నుండి తాను నేర్చుకున్న కళను బతికించుకునేందుకు, మరింత భిన్నంగా ప్రపంచానికి చూపించేందుకు తన వంతు కృషి చేస్తున్నారు. ఆమే ప్రముఖ యక్షగాన కళాకారిణి ప్రియాంక కె మోహన్. యక్షగానాన్ని స్వయంగా ప్రదర్శిస్తూ.. నేర్పించే అతికొద్ది మంది మహిళల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె పరిచయం నేటి మానవిలో...



కళలోని భిన్న కోణాలు ఆవిష్కరిస్తాం...



బెంగుళూరులో పెరిగిన ప్రియాంక చిన్నప్పటి నుండి యక్షగాన లోకంలోనే పెరిగారు. ఎందుకంటే ఆమె ఇల్లు యక్షగాన కళాకారులకు కేంద్రం. తండ్రి కె మోహన్, దక్షిణ కర్ణాటకలోని ఉడిపి జిల్లాలోని సాలిగ్రామ నుండి 1970ల ప్రారంభంలో బెంగుళూరుకు మారారు. అప్పటికే ఈ ప్రాంతంలో యక్షగానం వేళ్లూనుకుని ప్రజాదరణ పొందుతుంది. సాంప్రదాయ నృత్యం, నాటకం నృత్యం, సంగీతం, పాట, సంభాషణలు, రంగురంగుల దుస్తులతో ఆ ప్రాంతం కళకళలాడేది.

కళల్లో శిక్షణ ఇచ్చేందుకు

కె మోహన్ అప్పట్లో యక్షగాన ఔత్సాహికుడు. కళారూపాన్ని ప్రోత్సహించిన కుటుంబం నుండి వచ్చినవారు. టౌన్ హాల్, రవీంద్ర కళాక్షేత్రతో పాటు బెంగుళూరు నగరంలోని ఇతర సాంస్కృతిక కేంద్రాలలో ప్రదర్శనలు ఇవ్వడానికి దక్షిణ కన్నడ నుండి కళాకారులను తీసుకురావడంలో ప్రముఖ పాత్ర పోషించేవారు. 1981లో యక్షగానాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు విద్యార్థులకు కళల్లో శిక్షణ ఇచ్చేందుకు యక్షదేగుల అనే సంస్థను అధికారికంగా నమోదు చేశారు. 'మా రెండు పడకల ఇంటిలో అనునిత్యం 20-30 మంది కళాకారులు ఉండేవారు. మా అమ్మా, అమ్మమ్మ వాళ్ళకి వండి పెట్టేవారు. ఇలా నేను కళాకారుల మధ్యలో పెరిగాను' అంటూ ప్రియాంక ఓ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు.

నిరుత్సాహపరిచారు...

ప్రియాంకకు కేవలం ఆరేండ్ల వయసులో ఉన్నప్పుడు కె.మోహన్ తన కుమార్తెలిద్దరికీ కళారూపాన్ని నేర్పించాలని నిర్ణయించుకున్నారు. అయితే అప్పట్లో యక్షగానం అంటే కేవలం మగవారు మాత్రమే ప్రదర్శించేవారు. దాంతో చాలా మంది అతన్ని నిరుత్సాహపరిచారు. కానీ ఆయన మాత్రం తన నిర్ణయానికే కట్టుబడ్డారు. యక్షగానాన్ని ఏదో ఒక విధంగా తన కూతుళ్లు ముందుకు తీసుకెళ్లగలరనే నమ్మకంతో ఆయన ఉన్నాడు. 'నేను, నా చెల్లెలు నేర్చుకోవడం ప్రారంభించాము. తక్కువ కాలంలోనే ఇరుగుపొరుగు నుండి ఇతర పిల్లలు కూడా చేరారు. 25 ఏండ్లుగా మా నాన్న స్థాపించిన ఈ సంస్థలో ఎవరి దగ్గర రుసుము వసూలు చేయలేదు' అని ఆమె గుర్తుచేసుకున్నారు. అక్కచెల్లెళ్లు ఇద్దరూ పాఠశాల చదువు పూర్తి చేసే సమయానికి సుమారు 300 ప్రదర్శనలు ఇచ్చారు. ప్రతిరోజు పాఠశాల తర్వాత తరగతులు, రిహార్సల్స్, ఆపై ప్రదర్శనలు ఉండేవి.

యవ్వనంలో సమస్యలు

యుక్త వయసుకు వచ్చిన తర్వాత ప్రియాంక అనేక అడ్డంకులు ఎదుర్కొన్నారు. ఆమె అభ్యాసం కూడా అంత సులభం కాలేదు. ప్రదర్శనల్లో పాల్గొనడానికి కూడా ఎన్నో అవాంతరాలు ఎదురయ్యేవి. దాంతో ఆమె చదువుపై దృష్టి పెట్టారు. 10వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విరామం ఇచ్చారు. కానీ ఆ విరామం కూడా విజయానికి దారితీసింది. 'నేను కళకు విలువ ఇవ్వడం, కళను వేరే దృష్టితో చూడటం ఆ సమయంలోనే ప్రారంభించాను. ఈ కళ గురించి మరింత తెలుసుకోవాలని, అన్వేషించాలనే కోరిక కలిగింది' అంటూ ఆమె పంచుకున్నారు. ఇంటర్ చదువుతున్న రెండేండ్లలో సంస్థలోని పాత ఆర్టిస్టులలో ఒకరు ఆమెను బోధన ప్రారంభించమని అడిగారు. మొదట ఆమె నమ్మలేకపోయారు. కళాకారురాలిగా తనను తాను నిరూపించుకోవడం చాలా కష్టం. కానీ బోధన పూర్తిగా దీనికి భిన్నమైన ప్రపంచం. ఇలా సందేహాలు ఉన్నప్పటికీ ఆమె కేవలం 19 ఏండ్ల వయసులో 2008లో యక్షగానం నేర్పడం ప్రారంభించారు.

అంగీకరించేందుకు సమయం పట్టింది

నేర్పడం అనేది కళ, విద్య పట్ల ఆమెకున్న మక్కువను మరింత ముందుకు తీసుకువెళ్లింది. క్లాస్‌రూమ్‌లో రెండింటినీ ఏకీకృతం చేయడానికి ఆమె టీచ్ ఫర్ ఇండియాలో చేరారు. ఇప్పటి వరకు ప్రియాంక యక్షగానంలో 2,000 మందికి పైగా శిక్షణ ఇచ్చారు. ఈ రంగంలో ఉన్న అతికొద్ది మంది మహిళా గురువులలో ఆమె ఒకరు. ఒక మహిళను గురువుగా ప్రజలు అంగీకరించడానికి కొంత సమయం పట్టిందని, అయితే తన తండ్రి కారణంగా తన ప్రయాణం సులభమైందని ఆమె పంచుకున్నారు. 'ఒక మహిళగా తనను తాను నిరూపించుకోవడానికి చాలా కష్టపడాలి. పూర్వరంగానికి, యక్షగానంలోని ఇతర అంశాలకు కొత్త జోడాన్ని అందించిన 50-60 మంది పిల్లలతో నేను ఒక ప్రదర్శనను నిర్వహించడంతో నా ప్రయాణం ఓ మలుపు తిరిగింది. దీని తర్వాత కళాకారుల సంఘంలో నా పట్ల ఓ మంచి మార్పును నేను చూశాను' అని ఆమె వివరించారు. కళాకారిణిగా ఆమె సుభద్ర, ద్రోణ, అభిమన్యుతో పాటు అనేక పురుష, స్త్రీ పాత్రలను ప్రదర్శించారు. ప్రియాంక హాస్య పాత్రలను ఇష్టపడతారు. ఎందుకంటే అవి వేదికపై ఆమెలోని భిన్నమైన భాగాన్ని తీసుకువస్తాయి.

హద్దులు ఉల్లంఘించకుండా...

'యక్షగానం చెడుపై మంచి అనే సందేశాన్ని కలిగి ఉంది. దేవాలయాలలో కళారూపాన్ని ప్రదర్శించినప్పుడు ఆచారబద్ధంగా, కొన్ని ప్రక్రియలను అనుసరిస్తుంది. ఒక స్త్రీ మేళాలో భాగం కావడం నిషిద్ధం. అయితే ఆచారాలకు వెలుపల చాలా ఆవిష్కరణలు వచ్చాయి. కోవిడ్‌కు ముందు సామాజిక కారణాల గురించి మాట్లాడటానికి యక్షగానాన్ని ఉపయోగించడానికి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కింద యక్షదేగుల ఎంప్యానెల్ చేయబడింది. హెచ్1ఎన్1 విజృంభించినప్పుడు గ్రామాలను సందర్శించి వాటి గురించి మాట్లాడుకునేవాళ్లం. జీఎస్టీ గురించి మాట్లాడేందుకు ఇటీవల ఆదాయపు పన్ను శాఖ మమ్మల్ని సంప్రదించింది. యక్షగానాన్ని ఆవిష్కరించిన తొలితరం వ్యక్తుల్లో మా నాన్న ఒకరు' అని ప్రియాంక పంచుకున్నారు. ■

భిన్నమైన కళారూపాల కోసం...

కళారూపానికి సంబంధించిన హద్దులు, సాంప్రదాయాలు బద్దలు కొట్టకూడదని ప్రియాంక భావిస్తున్నారు. 'మేము ఈ కళారూపాలను మరింత సందర్భోచితంగా, ఆకాంక్షించేలా ఎలా చేయాలి అనే దానిపై దృష్టిపెట్టాము' అని ఆమె అంటున్నారు. యక్షదేగుల భారతదేశం, విదేశాలలో 7,000 ప్రదర్శనలను ప్రదర్శించినప్పటికీ ప్రతిసారీ నిర్వాహకులు రుసుముపై చర్చలు జరుపుతున్నారని ఆమె చెప్పారు. అయితే కాంతారా సినిమా విడుదల యక్షగాన కళాకారులకు ప్రాధాన్యం పెరిగిందేకు సహాయపడింది. కేవలం యక్షగానమే కాకుండా ప్రస్తుత తరానికి మరింత సందర్భోచితంగా ఉండేలా విభిన్నమైన కళారూపాలను రూపొందించేందుకు ప్రియాంక సామాజిక సంస్థలో తన ఉద్యోగానికి స్వస్తి చెప్పారు.

మా గోస వినండి !

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించారనీ, రైతులకు నోటీసులు ఇచ్చి, వాటిని తిరస్కరించిన వారిని బెదిరిస్తున్నారని అన్నారు. రైతులతో చర్చలు జరిపేందుకు ఎవరూ ముందుకురావడం లేదన్నారు. ఫార్మా సిటీ కోసం తమ హయాంలో 14 వేల ఎకరాల భూమిని సేకరించామనీ, ఆ రైతులందరినీ ఒప్పించి భూములను సేకరించామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎత్తి చూపితే అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఈ అంశాలను రాజ్యసభలో లేవనెత్తుతామన్నారు. కందుకూరు, యాచారంలో పర్యటించి రైతుల్లో కాంగ్రెస్ నేతల్లో విషం నింపారన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ఇంత ఆందోళన జరిగితే రేవంత్ మహారాష్ట్రలో ప్రచారం చేస్తారా? అంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీకి మూటలు పంపుతున్నందుకు రేవంత్ ఐదేండ్లు ముఖ్యమంత్రిగా ఉంటారనీ, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఉద్దేశం తమకు లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఐదేండ్లు ఉంటే మేం పదేండ్లు అధికారంలో ఉంటామన్నారు.

మోడీషా దెబ్బ..

(మొదటిపేజీ తరువాయి)

హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్, ఇతర వినియోగదారు కంపెనీల టాప్ సీఈఓల నుంచి ప్రకటనలు రావడం దేశ ఆర్థిక పరిస్థితుల బలహీనతను బయటపెట్టాయి. మరోవైపు చైనా ప్రభుత్వ వృద్ధి విధానాలు ఆకర్షణీయంగా ఉండటంతో ఎఫ్ఐఐలు అక్కడికి తరలిపోతున్నాయి.

ఏడో రోజూ నేల చూపులు..

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఏడో రోజూ నష్టాలు చవి చూశాయి. ఐటీ, ఇంధన రంగాల సూచీల్లో అమ్మకాల ఒత్తిడితో సోమవారం సెషన్‌లో సెన్సెక్స్ ఓ దశలో 600 పాయింట్లు కోల్పోగా.. ఆ తర్వాత కొంత కోలుకుని.. తుదకు 241 పాయింట్ల నష్టంతో 77,339కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 79 పాయింట్ల నష్టంతో 23,453 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30లో టిసిఎస్, ఇన్ఫోసిస్, ఎన్‌టిపిసి, హెచ్‌సిఎల్ టెక్నలాజీస్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బిఎస్ఇలో 2,532 షేర్లు పతనం కాగా.. 1,525 స్టాక్స్ లాభపడగా.. మరో 123 షేర్లు యథాతథంగా నమోదయ్యాయి.

ట్రంప్‌తో భంగం..

(మొదటిపేజీ తరువాయి)

తన కరెన్సీ విలువను తగ్గిస్తే భారతదేశంతో పాటు ఇతర అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు కూడా అనుసరించాల్సి ఉంటుందన్నారు. ట్రంప్ ఎన్నిక ప్రకటనలోనే రూపాయి క్షీణత ప్రారంభమైందన్నారు. వచ్చే ఏడాది వరకు పరిస్థితులు ఎలా మారుతాయో చూడాలన్నారు. చైనా తరహాలో భారత్ తనను తాను రక్షించుకోవడానికి ట్రంపోనోమిక్స్‌కు ప్రతిస్పందన వేగంగా ఉండాలని కొటాక్ మహీంద్రా బ్యాంక్ చైర్మెన్ ఉదయ్ కొటాక్ అన్నారు. ఇప్పటి వరకు మోడీ పెద్ద విధాన ఆలోచనలకు ప్రయత్నించి చాలా సమయాన్ని వృధా చేశారన్నారు. అవి ఆశించిన ఫలితాలను ఇవ్వలేదన్నారు.

త్రిబుల్ ఆర్‌లో ముందడుగు

(మొదటిపేజీ తరువాయి)

అంశాలపై రిపోర్టులు తయారు చేసి ప్రభుత్వ అనుమతికి పంపేందుకుగాను ప్రత్యేకంగా కన్సల్టెంట్‌ను నియమించు కునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రాజెక్టు పనులు త్వరితగతిన చేపట్టడానికి ఈ నియామకం తోడ్పడుతుందని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. ప్రత్యేక కార్యదర్శితోపాటు ప్రభుత్వంతోనూ కన్సల్టెంట్ ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేయడానికి వీలవుతుందని అంటున్నారు. ఇదిలావుండగా ఈ కన్సల్టెంట్ నియామకం కోసం టెండర్లు పిలవాలనీ, ఈ మేరకు రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు అధికారమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో ప్రాజెక్టు డైరెక్టర్‌కు సహకరించేందుకు ప్రత్యేకంగా మూడు విభాగాలను ఏర్పాటు చేస్తూ సర్కారు ఉత్తర్వులిచ్చింది. పర్యావరణ విశ్లేషకుడు, సాంకేతిక విశ్లేషకుడు, పరిపాలనా పరమైన పోస్టులను కొత్తగా మంజూరు చేసింది. డీఎఫ్‌వో, ఒక చీఫ్ ఇంజినీర్, రెండు ఏఈఈ, ఒక అకౌంటెంట్ పోస్టులతో డిప్యూటేషన్ పద్ధతిలో నియమించుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం వేర్వేరుగా మూడు జీవోలు, ఒక సర్క్యులర్ విడుదల చేసింది.

ఢిల్లీ కాలుష్యంపై చర్యలకు జాప్యమా..?

న్యూఢిల్లీ : ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకున్నది. ఢిల్లీ, నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్)లో 12వ తరగతి వరకు అన్ని పాఠశాలలనూ మూసివేయాలని ఆదేశించింది. కాలుష్యం నియంత్రణకు ఎన్‌సీఆర్‌లోని రాష్ట్రాలు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ఏం చేశారంటూ సర్వోన్నత న్యాయస్థానం ఢిల్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఢిల్లీ, ఎన్‌సీఆర్ పరిధిలో కాలుష్యాన్ని నివారించేందుకు కఠిన చర్యలు అమలు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని మండిపడింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) అమలు చేయకపోవటంపై సుప్రీంకోర్టు తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. యాక్షన్ ప్లాన్ కింద కాలుష్య నియంత్రణ చర్యలను అమలు చేయటానికి కొంత తక్షణ అవసరమని ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్‌కు సుప్రీంకోర్టు చెప్పింది. నాలుగో విడత ఎలాంటి ఆదేశాలు అడగకుండా తొలగించొద్దని కఠినమైన ఆదేశాలు ఇచ్చింది. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 300 కంటే ఎక్కువ పెరిగిపోతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్-4ని తప్పనిసరిగా అమలు చేయాలని ఎన్‌సీఆర్ రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. మూడు రోజులు ఆలస్యం ఎందుకైందని అడిగింది. ఆంక్షలను పర్యవేక్షించేందుకు తక్షణమే టీమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించింది. జీఆర్‌పీలో పేర్కొన్న చర్యలపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. తదుపరి విచారణ వరకు నివారణ చర్యలను కోర్టుకు సమర్పించాలని తెలిపింది. నిబంధనలు ఉల్లంఘనలపై ఫిర్యాదులను పరిష్కరించేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ఆదేశించింది. ఏక్యూఐ 450 కంటే తక్కువకు పడిపోయినప్పటికీ.. కోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు యాక్షన్ ప్లాన్ అమలు కొనసాగుతుందని స్పష్టం చేసింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సైతం ఇందుకు సమ్మతి తెలుపుతూ నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది. కాలుష్యం లేని వాతావరణంలో జీవించటం ప్రజల హక్కు అనీ, ఈ మేరకు పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వానికి తెలిపింది. అయితే, పిటిషనర్ తరపు న్యాయవాది విద్యార్థుల తరగతులపై కోర్టు దృష్టికి తీసుకువెళ్లగా.. 12 తరగతి వరకు తరగతులను నిలిపివేయాలని చెప్పింది.

కాల్చేస్తున్నారు..

(మొదటిపేజీ తరువాయి)

కోరింది. భద్రతా బలగాలు ఇంఫాల్‌లో భద్రతను కట్టుదిట్టం చేశాయి. సెక్రెటేరియట్, రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యాలయం, రాజ్‌భవన్‌లకు దారి తీసే రోడ్లు, ఎమ్మెల్యేల ఇండ్లకు భద్రతను పెంచాయి. భద్రతా బలగాల కాల్పుల్లో పది మంది కుకీ యువకుల మృతి తర్వాత జిరిబామ్‌లోని ఒక క్యాంపు నుంచి ఆరుగురు తప్పిపోయారు. దీంతో ఇది కొత్త నిరసనలకు దారి తీసింది.

సాధ్యమైనంత త్వరగా శాంతి భద్రతల పునరుద్ధరణ

మణిపూర్‌లో నెలకొన్న భద్రతా పరిస్థితులు, సైనిక బలగాల మోహరింపుపై వరుసగా రెండో రోజైన సోమవారం కూడా కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమీక్ష జరిపారు. సాధ్యమైనంత త్వరలో మణిపూర్‌లో శాంతి భద్రతలను పునరుద్ధరించాల్సిందిగా ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అత్యంత సున్నితంగా ఉన్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐదు వేలమంది పారా మిలటరీ బలగాలను మణిపూర్‌కు తరలిస్తున్నట్టు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. మణిపూర్‌లో మోహరించిన సైనిక బలగాల పరిస్థితి సమీక్షించిన తర్వాత అక్కడ భద్రత సవాలుగా మారిన దృష్ట్యా అదనంగా ఐదు వేల మంది సైనికులతో కూడిన 50 కంపెనీల భద్రతా సిబ్బంది మోహరించాలని కేంద్రం నిర్ణయించినట్టు సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. జిరిబమ్ జిల్లాలో తలెత్తిన హింస, ఘర్షణలు ఇతర ప్రాంతాలకు విస్తరించిన నేపథ్యంలో ఈ నెల 12న రాష్ట్ర బలగాలకు అదనంగా కేంద్ర బలగాలను పంపాలని ఆదేశాలు వెలువడ్డాయి. సీఏపీఎఫ్‌కు చెందిన 20 కంపెనీలు, సీఆర్పీఎఫ్‌కు చెందిన 15 కంపెనీలు, బీఎస్ఎఫ్‌కు చెందిన ఐదు కంపెనీలను కేంద్ర హోం శాఖ తరలించిన సంగతి తెలిసిందే. వీటికి తాజా బలగాలు అదనం కానున్నాయి. త్వరలో తరలించే కంపెనీల్లో 35 సీఆర్పీఎఫ్, 15 బీఎస్ఎఫ్‌కు చెందినవి ఉన్నాయి. సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ ఎ.డి.సింగ్, కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన సీనియర్ అధికారులు ప్రస్తుతం రాష్ట్రంలోనే ఉన్నారు. ప్రస్తుతం మణిపూర్‌లో మొత్తంగా 218 సీఏపీఎఫ్ కంపెనీల బలగాలు వున్నాయి. హింస, విధ్వంసకర చర్యలకు ఎవరైనా పాల్పడితే కఠినమైన చర్యలుంటాయని కేంద్ర హోం శాఖ హెచ్చరించింది. ఇప్పటివరకు ఇంఫాల్ లోయలో జరిగిన జాతుల ఘర్షణల్లో 220 మందికి పైగా మరణించారు. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు.

నాయకత్వాన్ని మారిస్తేనే బీజేపీకి మద్దతు : కె సంగ్మా

హింసాకాండతో అశాంతి నెలకొన్న మణిపూర్‌లో నాయకత్వాన్ని మార్చే వరకూ బీజేపీకి మళ్లీ మద్దతు ఇచ్చేది లేదని ఎన్‌పీపీ అధ్యక్షులు, మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ కె సంగ్మా సోమవారం స్పష్టం చేశారు. మణిపూర్‌లో హింసాకాండను పరిష్కరించటంలోనూ, సాధారణ పరిస్థితులు నెలకొల్పటంలోనూ విఫలమైనందుకు బీరేన్‌సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్టు ఆదివారం ఎన్‌పీపీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సోమవారం సంగ్మా మాట్లాడుతూ.. 'మణిపూర్‌లో ఏడాదికి పైగా హింసాకాండ కొనసాగుతున్నదనీ, అయినా పరిస్థితులు అదుపులోకి వస్తాయని ఆశించామనీ, కానీ గతవారంలో పరిస్థితి మరింత దిగజారిందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో బీరెన్ సింగ్ ప్రభుత్వంతో కలిసి ముందుకు వెళ్లలేమని చెప్పారు. బీరెన్‌సింగ్‌పై తమ నాయకులు విశ్వాసం కోల్పోయారని అన్నారు.

జీ 20 సదస్సు షురూ

(మొదటిపేజీ తరువాయి)

సుస్థిర అభివృద్ధి, అంతర్జాతీయ సపరిపాలనకు సంస్కరణలు వంటి అంశాలు ప్రధానంగా చర్చిస్తున్నారు. ఆఫ్రికన్ యూనియన్‌ను కొత్తగా గ్రూపులోకి తీసుకున్న తర్వాత జరుగుతున్న మొదటి సదస్సు ఇది. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పటికే ఈ సదస్సు కోసం రియో డీ జెనీరో చేరుకున్నారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆయన నైజీరియాలో పర్యటించి సోమవారం రియో చేరుకున్నారు. ఈ మేరకు విదేశాంగ శాఖ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. విమానాశ్రయంలో మోడీకి స్వాగతం పలికిన చిత్రాలు కూడా పంచుకుంది. పలువురు ప్రపంచ నేతలతో అర్థవంతమైన చర్చలు జరిపేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానంటూ ప్రధాని మోడీ కూడా ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ సదస్సు ముగిసిన అనంతరం ఆయన గుయానా అధ్యక్షుడు మహ్మద్ ఇర్ఫాన్ అలీ ఆహ్వానం మేరకు ఆ దేశం వెళతారు. గత 50ఏళ్ల పై కాలంలో భారత ప్రధాని గుయానాలో పర్యటించడం ఇదే తొలిసారి. భారతీయ వారసత్వంపై బ్రెజిల్ నిర్మించబడిందని ఈ పర్యటనకు ముందు మోడీ వ్యాఖ్యానించారు. "ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్" అన్న మన దార్శనికతను కొనసాగించేలా చర్చలు జరగాలని కోరుకుంటున్నానని చెప్పారు. అనేక దేశాల నేతలతో ద్వైపాక్షిక చర్చలు



జరిపేందుకు, పరస్పరం అభిప్రాయాలు పంచుకునేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటానని చెప్పారు.

రియోలో ఘన స్వాగతం

మోడీ రియో చేరుకోగానే అక్కడి భారతీయులు ప్రధానికి సంస్కృత మంత్రాలతో స్వాగతం పలికారు. ఆయనను స్వాగతిస్తూ సాంస్కృతిక కళా రూపాలను కూడా ప్రదర్శించారు. రియోలో గుర్తుంచుకోదగిన రీతిలో తనకు స్వాగతం లభించిందని, బ్రెజిల్‌లో భారతీయ సంస్కృతి వెల్లివిరిసిందని మోడీ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. వారి స్వాగత సత్కారాలు తన మనసును తాకాయని, ఖండాంతారాల మీదుగా మనల్ని కట్టిపడేస్తున్న వారి ప్రేమాభిమానాలు ఆ స్వాగతంలో ప్రతిబింబించాయని పేర్కొన్నారు.

సీఎంకు గద్దర్ కూతురు వెన్నెల కృతజ్ఞతలు

నవతెలంగాణ -హైదరాబాద్



తనపై ఎంతో నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి గద్దర్ కూతురు వెన్నెల హదయపూర్వక కతజ్ఞతలు తెలియజేశారు. ఈమేరకు ఆదివారం ఆమె ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ పదవి రావడానికి సహకరించిన ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు, పార్లమెంటు సభ్యులు మల్లు రవి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క కొండా సురేఖ, జూపల్లి కష్ణారావు, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు వివేక్, వినోద్‌తోపాటు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మల్కాజ్‌గిరి పార్లమెంటు ఇన్‌చార్జీ సునీతా మహేందర్‌రెడ్డి ధన్యవాదాలు తెలియ జేస్తున్నట్టు చెప్పారు. అలాగే కాంగ్రెస్ పెద్దలు తన కుటుంబాన్ని అభిమానించే పార్టీ కార్యకర్తలందరికీ కతజ్ఞతలు తెలిపారు ముఖ్యంగా తమ కుటుంబానికి అండగా నిలుస్తున్న సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కే వేణుగోపాల్ , కొప్పుల రాజు, జాతీయ కాంగ్రెస్ నేతలందరికీ ఆమె మనస్ఫూర్తిగా కతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు. తనకిచ్చిన పదవికి న్యాయం చేస్తానని తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలను, వత్తి కళాకారులను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకొస్తానని అభిప్రాయపడ్డారు.

ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. గ్రూప్-3 పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,401 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రూప్-3 పరీక్షలు ఆదివారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం మొదటి విడతలో జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీఎస్ పేపర్-1, మధ్యాహ్నం రెండో విడతలో హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ పేపర్-2కు పరీక్షలు జరిగాయి. సోమవారం ఉదయం ఒకే విడతలో ఎకానమి, డెవలప్‌మెంట్ పేపర్-3 పరీక్షను టీజీపీఎస్సీ నిర్వహించింది. తెలంగాణ తొలి గ్రూప్-3 ద్వారా 1,388 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ 2022, డిసెంబర్ 30న నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే.

30లోగా సమగ్ర కుటుంబ సర్వే పూర్తి చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

సమాచారాన్ని సేకరిస్తున్నామని వెల్లడించారు. సర్వేకు రాజకీయాల తో ఎలాంటి సంబంధం లేదనీ, గవర్నర్ నుంచి మొదలుకుని ముఖ్యమంత్రి, మంత్రులం దరూ తమ పేర్లు నమోదు చేసుకున్నారని గుర్తు చేశారు. 2024 కుటుంబ సర్వే ఓ చారిత్రాత్మక కార్యక్రమమనీ, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు విపక్ష నేతలందరూ సర్వేలో పాల్గొనాలని సూచించారు. 2014లో అప్పటి సర్కార్ చేపట్టిన సర్వే వివరాలను త్వరలో బయట పెడతామని మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. ఆ రోజు జరిగిన సర్వేలో గుర్తించిన భూములు, ఇతర ప్రభుత్వ ఆస్తుల సమాచారం ఆధారంగా బీఆర్ఎస్ నేతలు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. గత ప్రభుత్వం హయాంలో జరిగిన తప్పులపై చట్టప్రకారం ముందుకెలుతామే తప్ప ఎవరిపై కక్షపూరిత చర్యలుండ వని స్పష్టం చేశారు. అయితే తగిన సమయంలో బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ శాసన సభ్యులు గణేశ్ పాల్గొన్నారు.

21న లగచర్లకు వెళ్తాం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో ఆయన మాట్లాడుతూ లగచర్ల పరిసర గ్రామాల్లో అధికారులపై దాడి తర్వాత భయానక వాతావరణం ఉందన్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి బీఆర్ఎస్‌కు చెందిన వారినే జైలుకు పంపించారని అన్నారు. ఎవరినీ ఆ గ్రామాల్లోకి వెళ్లనివ్వడం లేదన్నారు. ఎందుకంత నిర్బంధమని అడిగారు. నిర్బంధ చర్యలను ప్రభుత్వం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. గ్రామాలనే జైళ్లలాగా మార్చారనీ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దని కోరారు. సమస్యను ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించాలని సూచించారు. ఈనెల 21న లగచర్లకు వెళ్లి బాధిత రైతాంగాన్ని కలిసి వాస్తవ పరిస్థితులను పరిశీలించి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వారికి న్యాయం చేయాలని కోరతామన్నారు.



ఇబ్రహీంపట్నంలో గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం 15 వేల ఎకరాలను సేకరించిందని చెప్పారు. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పాదయాత్ర చేపట్టామని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఫార్మా సిటీని రద్దు చేస్తామనీ, ఆ భూములను రైతులకు తిరిగి ఇస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని అన్నారు. అధికారంలోకి వచ్చాక ఇంకా ఆ భూమిని రైతులకివ్వలేదని చెప్పారు. ఇప్పుడు ఫార్మాసిటీకి చెందిన 15 వేల ఎకరాలకు మరో 15 వేల ఎకరాలు కలిపి మొత్తం 30 వేల ఎకరాల్లో ఫోర్త్ సిటీని నిర్మిస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని వివరించారు. విదేశీ సంస్థలకు ఆ భూములను కట్టబెట్టడం కోసమేనని విమర్శించారు. ఇది ఎంత వరకు సమంజసమని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, దామగుండం రాడార్ స్టేషన్ ఏర్పాటు, గ్రూప్-1 వివాదం, ఫార్మాసిటీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాల అభిప్రాయాలను తీసుకోవడం లేదన్నారు. అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయలేదని చెప్పారు. ఇది ఏ రకమైన ప్రజాస్వామ్యమో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచించాలని కోరారు. లగచర్లకు వెళ్లిన వారిని అరెస్టు చేస్తున్నారని అన్నారు.

వామపక్ష నేతలకు రైతులను కలిసే అవకాశం ఇవ్వాలనీ, లేకుంటే రాష్ట్రవ్యాప్త సమస్యగా మారుతుందని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటు కోసం జరిగే భూసేకరణ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించాలని కోరారు. లగచర్ల దాడి వెనుక కుట్ర కోణం దాగి ఉందా? లేదా? అనే అంశంపై పరిశీలించాల్సి ఉందన్నారు. భూములు కోల్పోయే వారిలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెందిన రైతులున్నారని వివరించారు. వ్యవసాయానికి పనికిరాని భూములనే పరిశ్రమలకు తీసుకోవాలని సూచించారు. భూసేకరణ కోసం 2013 చట్టం ప్రకారమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు భూసేకరణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చిందన్నారు. అది రైతులను దోపిడీ చేయడమేనని అన్నారు. ఎకరా భూమి మార్కెట్ విలువ రూ.50 లక్షలుంటే, ప్రభుత్వం రూ.10 లక్షలు ఇస్తే ఎలా?అని ప్రశ్నించారు.

రేవంత్‌రెడ్డిపై కేసీఆర్, కేటీఆర్ ఏం కుట్ర చేశారో కానీ, ప్రజలపై ప్రభుత్వం కుట్ర చేయొద్దని కోరారు. రైతులు క్షేమంగా ఉండాలని చెప్పారు. మత విశ్వాసాలను వ్యతిరేకించబోమని అన్నారు. మత విశ్వాసాలున్న ప్రజల కోసం కమ్యూనిస్టులు పనిచేయాలని అన్నారు. భక్తుల్లో కూడా తమ సంఘం ఉండాలన్నారు. పూజారుల సంఘం పెడతామని చెప్పారు. తిరుపతిలో పూజారుల సంఘం, ఇతర కార్మిక సంఘం ఏర్పాటు చేసి హక్కుల కోసం పోరాటం చేశామని గుర్తు చేశారు. మతాన్ని వ్యక్తిగతంగా చూడాలని కోరారు. లౌకికవాదం అంటే పరిపాలనా, రాజకీయాల్లోకి మతాన్ని తీసుకురావొద్దని సూచించారు. కమ్యూనిస్టు రాజ్యాల్లోనూ మతాలున్నాయని గుర్తు చేశారు. మూసీ పరిధిలో ఆక్రమించిన వాటిని తొలగిస్తే అభ్యంతరం లేదన్నారు. కానీ పేదలు, మధ్యతరగతి ప్రజలు కొనుక్కున్న ఇండ్లను కూల్చడం సరైంది కాదన్నారు.

చట్టబద్ధంగా మున్సిపల్ అధికారులు అనుమతి ఇచ్చారనీ, విద్యుత్, నల్లా కనెక్షన్లున్నాయని వివరించారు. వాటికి అనుమతిచ్చిన ఒక్క అధికారిపైనా చర్యలు తీసుకోలేదన్నారు. ప్రజల వల్ల మూసీ కాలుష్యం కావడం లేదనీ, ఫార్మా పరిశ్రమల వల్లేనని అన్నారు. నష్టపరిహారం, డబుల్‌బెడ్రూం ఇండ్లు ఇచ్చిన తర్వాతే పేదల ఇండ్లను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కోసం భూమిని కోల్పోయిన రైతులు ఇంకా పరిహారం కోసం ఎదురుచూస్తున్నారని గుర్తు చేశారు.

మూసీ ప్రక్షాళనను రియల్ ఎస్టేట్ దందాగా మార్చొద్దు: వీరయ్య



మూసీ ప్రక్షాళన పేరుతో 12 వేల పేదల ఇండ్లను ఇరువైపులా తొలగించడం సరైంది కాదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడం,హోటళ్లు నిర్మించడం కోసమే ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తున్నదా అనే అనుమానా లకు తావివ్వ కూడదని సూచించారు. మూసీ పక్కన ఒక్క ఇల్లునూ తొలగించడానికి వీల్లేదన్నారు.రెండువైపులా పెద్దగోడలు నిర్మించాలని సూచించారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఘట్‌కేసర్ నుంచి సూర్యాపేట వరకు వ్యవసాయం చేస్తున్నారని వివరించారు. ఆహార పదార్థాలు,నీరు కలుషితమవుతున్నాయని అన్నారు.మూసీ ప్రక్షాళన, సుందరీకరణను రియల్ ఎస్టేట్ దందాగా మార్చొద్దని డిమాండ్ చేశారు.

పరిశ్రమలకు వ్యతిరేకం కాదు : జూలకంటి



రామన్నపేట వద్ద అదానీ సంస్థ సిమెంటు పరిశ్రమను నెలకొల్పడం కోసం భూమిని కేటాయించడాన్ని పార్టీలకతీతంగా రైతులంతా ఏకమై వ్యతిరేకించారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి చెప్పారు. పర్యావరణం దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఆ ప్రాజెక్టు వద్దంటూ ప్రజలు, రైతులు ప్రతిఘటిస్తున్నారని వివరించారు. వ్యవసాయ భూములు కాకుండా, వ్యవసాయేతర భూముల్లో పరిశ్రమలను పెట్టాలని సూచించారు. పరిశ్రమలకు తాము వ్యతిరేకం కాదన్నారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్ ధర ప్రకారమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజలు, రైతులు నష్టపోకుండా ట్రిబుల్‌ఆర్ భూసేకరణను చేపట్టాలని కోరారు.



తిలక్ వర్మ కెప్టెన్సీలో..

హైదరాబాద్ టీ20 జట్టు ఎంపిక

నవతెలంగాణ-హైదరాబాద్ : సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌కు హైదరాబాద్ తిలక్ వర్మ సారథ్యంలో బరిలోకి దిగుతోంది. గత సీజన్‌లో అద్భుత ప్రదర్శన చేసిన హైదరాబాద్.. నెట్‌రన్‌రేట్ వ్యత్యాసంతో క్వార్టర్‌ఫైనల్ బెర్త్ కోల్పోయింది. జాతీయ జట్టు తరపున వరుస సెంచరీల ఊపుమీదున్న తిలక్ వర్మ రెండో సీజన్‌లో హైదరాబాద్ పగ్గాలు అందుకోనున్నాడు. సోమవారం ఉప్పల్ స్టేడియంలో సమావేశమైన సీనియర్ సెలక్షన్ కమిటీ టీ20 సీనియర్ మెన్ జట్టును ఎంపిక చేసింది. హైదరాబాద్ మ్యాచులు రాజ్‌కోట్ వేదికగా ఈ నెల 23 నుంచి డిసెంబర్ 5 వరకు జరుగనున్నాయి. రాహుల్ సింగ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు.

హైదరాబాద్ టీ20 జట్టు : తిలక్ వర్మ, రాహుల్ సింగ్, తన్మయ్ అగర్వాల్, రోహిత్ రాయుడు, సివి మిలింద్, రవితేజ, బుద్ధి రాహుల్, మికిల్ జైస్వాల్, ప్రతీక్ రెడ్డి (వికెట్ కీపర్), రాహుల్ రాదేశ్ (వికెట్ కీపర్), శరణు నిశాంత్, రక్షణ్ రెడ్డి, తనయ్ త్యాగరాజన్, అనికెత్ రెడ్డి, అమన్ రావు.

సమస్య ఏదైనా మాకు చెప్పండి!

బీసీసీఐకి పీసీబీ చైర్మెన్ సూచన



ఇస్లామాబాద్ : 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు భారత జట్టు పాక్ గడ్డపై కాలుమోపుతుందా లేదా అనే ఉత్కంఠ కొనసాగుతుంది. భద్రతా కారణాలతో భారత జట్టు పాక్‌లో పర్యటించలేదని ఇటీవల ఐసీసీకి బీసీసీఐ లేఖ రాసింది. బీసీసీఐ అభ్యంతరాలను పీసీబీకి ఐసీసీ తెలియజేయలేదని తెలుస్తోంది. ' అన్ని జట్లు పాక్‌కు వచ్చేందుకు సుముఖంగా ఉన్నాయి. భారత్‌కు అభ్యంతరాలు ఉన్న విషయం మాకు తెలియదు. ఐసీసీ నుంచి ఎటువంటి సమాచారం లేదు. బీసీసీఐ అభ్యంతరాలు ఏమైనా చెప్పి ఉంటే మాకు చెప్పాలని ఐసీసీకి లేఖ రాశాం. సమస్య ఏదైనా బీసీసీఐ మాతో మాట్లాడితే.. మావైపు నుంచి పరిష్కారానికి ప్రయత్నం చేస్తాం. భారత జట్టు పాక్‌కు వస్తుందనే ఆశావహ దృక్పథంతో ఉన్నామని' పీసీబీ చైర్మన్ మోహిసిన్ నక్వీ తెలిపాడు.

గెలుపు లేకుండానే..!

2024ను ముగించిన బ్లూ టైగర్స్
1-1తో భారత్, మలేషియా పోరు డ్రా



నవతెలంగాణ-హైదరాబాద్

2024 ఏడాదిని భారత ఫుట్‌బాల్ విజయం లేకుండానే ముగించింది. ఆదివారం హైదరాబాద్‌లోని జిఎంసి బాలయోగి అథ్లెటిక్ స్టేడియంలో మలేషియాతో జరిగిన ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్‌ను భారత్ 1-1తో డ్రా చేసుకుంది. 90 నిమిషాల పూర్తి ఆటతో పాటు ఐదు నిమిషాల అదనపు సమయంలోనూ భారత్, మలేషియాలు స్పష్టమైన ఆధిక్యం సాధించలేదు. మ్యాచ్ 19వ నిమిషంలో మలేషియా ఆటగాడు పౌలో జోశ్ గోల్ కొట్టగా.. 39వ నిమిషంలో రాహుల్ బెకు భారత్‌కు గోల్ అందించి స్కోరు సమం చేశాడు. ఈ మ్యాచ్‌తో ఈ ఏడాదిలో భారత ఫుట్‌బాల్ జట్టు సీజన్ ముగిసింది. వచ్చే ఏడాది మార్చిలో ఏఎఫ్‌సి ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లోనే టీమ్ ఇండియా మళ్లీ బరిలోకి దిగనుంది. దీంతో భారత జట్టు చీఫ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి విజయం కోసం ఎదురుచూస్తున్న మనాలో మార్కెజ్‌కు సైతం నిరాశ తప్పలేదు.

గోల్ వేటలో హెూరాహెూరీ : భారత్, మలేషియా మ్యాచ్ ప్రథమార్థం హెూరాహెూరీగా సాగింది. బ్లూ టైగర్స్ సహజంగానే ఆరంభంలో దూకుడు చూపించారు. ఫారుఖ్ చౌదరి, సందేశ్‌లకు చింగల్‌సేన జతకలవటంతో మలేషియాపై ఎదురుదాడి చేశారు. కానీ గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు అంచనా తప్పటంతో భారత్ తొలి గోల్ కోల్పోయింది. ఆట 19వ నిమిషంలో డైరెక్ట్ హిట్‌ను అంచనా వేయటంలో గుర్‌ప్రీత్ సింగ్ సంధు విఫలమయ్యాడు. ఫలితం మలేషియాకు తొలి గోల్ అలవోకగా దక్కింది. గోల్‌పోస్ట్ ముంగిట ఎటువంటి ప్రతిఘటన లేకుండా... పౌలో జోశ్ గోల్ ఎగరేసుకుపోయాడు. దీంతో మలేషియా 1-0తో ముందంజ వేసింది. వెనుకంజ వేసినా.. బ్లూ టైగర్స్ వెనక్కి తగ్గలేదు. హాఫ్ టైమ్ సమీపిస్తుండగా ఆతిథ్య జట్టు సైతం గోల్ ఖాతా తెరిచింది. కార్నర్ నుంచి ఫెర్నాండేజ్ అందించిన సూపర్ పాస్‌ను మలేషియా డిఫెండర్లను కాచుకుని మరీ రాహుల్ బెకూ గోల్ కొట్టాడు. మలేషియా గోల్ పోస్ట్ ముంగిట కండ్లుచెదిరే హెడర్‌తో భారత్‌కు గోల్ అందించాడు. దీంతో ఇరు జట్ల స్కోర్లు 1-1తో సమం అయ్యాయి. ప్రథమార్థం ఆఖర్లో రెండు నిమిషాల ఇంజూరీ సమయంలోనూ గోల్స్ ఏమీ నమోదు కాలేదు. దీంతో 1-1తో అర్ధభాగం ఆటలో భారత్, మలేషియా సమవుజ్జీలుగా నిలిచాయి. ద్వితీయార్థంలో ఇరు జట్లు గోల్ అవకాశాలు సృష్టించుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. భారత గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ రెండుసార్లు అద్భుతంగా ప్రత్యర్థిని అడ్డుకున్నాడు. 90 నిమిషాల అనంతరం ఇంజూరి సమయంలో భారత్ గోల్ కోసం చేసిన ప్రయత్నం సైతం ఫలించలేదు. దీంతో ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్ డ్రాగా ముగిసింది

ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్

3-0తో పాక్‌పై టీ20 సిరీస్ వశం



హెూబర్ట్ : వన్డే సిరీస్ ఓటమికి ఆస్ట్రేలియా ప్రతీకారం తీర్చుకుంది. టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి లెక్క సరి చేసింది. హెూబర్ట్‌లో సోమవారం జరిగిన మూడో టీ20లో 7 వికెట్ల తేడాతో ఆసీస్ ఘన విజయం సాధించింది. 3-0తో టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఆసీస్ బౌలర్లు మెరువటంతో తొలుత పాకిస్థాన్ 18.1 ఓవర్లలో 117 పరుగులకు కుప్పకూలింది. బాబర్ ఆజామ్ (41), హసీబుల్లా ఖాన్ (24), షహీన్ షా అఫ్రిది (16) పాక్‌కు గౌరవప్రద స్కోరు అందించారు. ఛేదనలో ఆసీస్ ఆల్‌రౌండర్ మార్కస్ స్టోయినిస్ (61 నాటౌట్, 27 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సులు) ధనాధన్ అజేయ అర్ధ సెంచరీ సాధించాడు. జేక్ ఫ్రేజర్ (18), జోశ్ ఇంగ్లిశ్ (27) సైతం రాణించారు. దీంతో 11.2 ఓవర్లలోనే ఆసీస్ 118/3 పరుగులు చేసింది. మార్కస్ స్టోయినిస్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

అందర్నీ ఎంటర్‌టైన్ చేసే సినిమా



హీరో విశ్వక్ సేన్, దర్శకుడు రవితేజ ముళ్లపూడి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా 'మెకానిక్ రాకీ'. ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా వరంగల్‌లో చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. భారీగా హాజరైన అభిమానుల సమక్షంలో ఈ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. 'మెకానిక్ రాకీ' ట్రైలర్ 2.0 లాంచ్ చేసిన ఈ వేడుకలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథులు పాల్గొన్నారు.

హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ,సినిమా చూశాను. చాలా బాగా వచ్చింది. ఈ సినిమా హిట్ అయినా ఫ్లాప్ అయిన మళ్లీ సినిమా తీస్తాను. నాకు తెలిసింది ఒకటే సినిమా. అంతే ప్రాణం పెట్టి ఈ సినిమా తీశాం. నేను ఈరోజు ఈ స్థాయిలో ఉండడానికి కారణం అభిమానులు, ప్రేక్షకులే. నాకు ఇంత మంచి లైఫ్ ఇచ్చినందుకు థ్యాంక్స్. ఈనెల 21న పెయిడ్ ప్రీమియర్స్ ఉంటాయి. ఈ పెయిడ్ ప్రీమియర్స్‌కి రండి. నేను చేసిన పది సినిమాల అనుభవంతో చెబుతున్నాను. ఇది చాలా మంచి సినిమా. ఒక ఐదు నిమిషాలు కూడా బోర్ కొట్టదు. సినిమా చూడండి. మీరు బాగుందని చెప్తే, 22 నుంచి మిగతా ఆడియన్స్ చూస్తారు' అని అన్నారు.

ఆద్యంతం ఉద్వేగభరితం



కళా సృష్టి ఇంటర్నేషనల్, మణిదీప్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై మహిపాల్ రెడ్డి దర్శకత్వంలో జి.శంకర్, ఎల్.మధు నిర్మించిన చిత్రం 'ఉద్వేగం'. త్రిగుణ్, దీప్సిక జంటగా నటించిన ఈ చిత్రంలో శ్రీకాంత్, భరత్, సురేష్ నాయుడు, పరుచూరి గోపాలకృష్ణ, శివకృష్ణ, అంజలి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్ర టీజర్‌ని డైరెక్టర్ ఆర్జీవి విడుదల చేశారు. ఈ నెల 22వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కానుంది.

ఈ సందర్భంగా పరుచూరి గోపాల కృష్ణ మాట్లాడుతూ, 'సినిమాలో నాయకుడికి ఎంత ప్రాముఖ్యత ఉంటుందో ప్రతి నాయకుడికి కూడా అంతే ప్రాముఖ్యత ఉంటుంది. దర్శకుడు మహిపాల్ రెడ్డి నన్ను ఒప్పించి ఈ సినిమా చేయించుకున్నాడు. హీరో చాలా అద్భుతంగా నటించాడు. చిన్న సినిమాగా కాకుండా ఒక మంచి సినిమాగా ప్రేక్షకులు దీన్ని చూసి విజయం చేకూర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని చెప్పారు.

నవచిత్రం

భిన్న కాన్సెప్ట్‌తో 'హరుడు'



మైత్రీ బాక్సాఫీస్, మైత్రీ ఆర్ట్స్ బ్యానర్స్‌పై డాక్టర్ లక్ష్మణరావు డిక్కల, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'హరుడు'. శ్రీహరి, హెబ్బా పటేల్, వెంకట్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి తాజాగా లీడ్ రోల్ చేస్తున్న శ్రీహరి ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్‌ను డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ విడుదల చేశారు. పోస్టర్, గ్లింప్స్ సినిమాపై ఆసక్తి రేకెత్తిస్తున్నాయని, ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందంటూ చిత్ర బృందాన్ని ఆర్జీవీ అభినందించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ, 'మా ఫస్ట్ పోస్టర్, టీజర్ ఆర్జీవీ చేతుల మీదుగా రిలీజ్ చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రొడ్యూసర్ లక్ష్మణరావు ఈ సినిమాని ప్యాషనేట్‌గా నిర్మించారు. అవుట్‌పుట్ బాగా వచ్చింది. అందరికీ సినిమా నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు. 'సినీ నిర్మాణరంగంలోకి శ్రీహరి ప్రోద్బలంతో అడుగుపెట్టాం. మా బ్యానర్ విజయవంతంగా సాగాలని ఆశిస్తున్నా. మా పోస్టర్ రిలీజ్ చేసినందుకు ఆర్జీవీకి కృతజ్ఞతలు' అని నిర్మాత లక్ష్మణరావు చెప్పారు. సలోని, అలీ, సుమన్ తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి సినిమాటోగ్రాఫర్ : ఆనంద్, ఎడిటర్ : మారుతి ఉప్పు, మ్యూజిక్ : మణి జీనా.

అత్యంత వైభవంగా 'పుష్ప 2' ట్రైలర్ రిలీజ్ వేడుక



'బీహార్ అందిస్తున్న ప్రేమను నేను తట్టుకోలేకపోతున్నాను. నేను ఇదే తొలిసారి బీహార్ రావడం. పుష్ప ఎవరి దగ్గర తగ్గడు. కానీ మొదటిసారి మీ ప్రేమానురాగాలు ముందు తగ్గుతున్నాడు. పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటున్నారా, ఇప్పుడు వైల్డ్ ఫైర్' అని హీరో అల్లుఅర్జున్ అన్నారు.

మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా, రష్మిక మందన్న హీరోయిన్‌గా నటించిన సినిమా 'పుష్ప 2'. 'పుష్ప 1'కు సీక్వెల్‌గా ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈనేపథ్యంలో బీహార్ రాజధాని పాట్నాలో ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ వేడుక ఘనంగా జరిగింది. సుమారు మూడు లక్షల మందికి పైగా ఓ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొనడం పాట్నా చరిత్రలో ఎన్నడు జరగని పెద్ద ఈవెంట్‌గా కొత్త రికార్డు సృష్టించింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా బీహార్ డిప్యూటీ సీఎం విజయ్ సేన సాహెబ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా నిర్మాత నవీన్ మాట్లాడుతూ, 'పాట్నా ప్రజలందరికీ నమస్కారం. ఇంతటి అభిమానాన్ని మేము పాట్నా నుండి అస్సలు ఊహించలేదు. ఈ సినిమా ఇంతటి విజయవంతమైన ప్రయాణం కావడానికి ముఖ్య కారణం అల్లు అర్జున్, డైరెక్టర్ సుకుమార్' అని అన్నారు.

'మేము ఇప్పటికి ఎన్నో చిత్రాలను చేశాం. ఎన్నో ఈవెంట్స్ కూడా చేశాం. కానీ ఒక ట్రైలర్ లాంచ్ ఇలా విడుదల చేయడం అనేది మొదటిసారి. పాట్నా నుండి ఇంతటి అభిమానాన్ని మేము ఊహించలేదు. గత పది సంవత్సరాల్లో ఇంతటి పెద్ద ఈవెంట్ చూడటం ఇదే తొలిసారి' అని మరో నిర్మాత రవిశంకర్ చెప్పారు. డిస్ట్రిబ్యూటర్ అనిల్ తడాని మాట్లాడుతూ, 'ఈ చిత్రం ఇంతటి జనాదరణ పొందడం ఎంతో సంతోషకరంగా ఉంది. అల్లు అర్జున్ ఇటువంటి చరిత్రను సృష్టించారు. ఇదే నేను థియేటర్లో కూడా చూడాలనుకుంటున్నాను' అని తెలిపారు. 'ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని పాట్నాలో నిర్వహించడం నాకు ఎంత సంతోషంగా ఉంది. బీహార్ ప్రభుత్వం తరపున అలాగే ముఖ్యమంత్రి తరపున చిత్ర బృందానికి మా కృతజ్ఞతలు. ఎవరైన మా రాష్ట్రానికి అతిథిగా వచ్చినప్పుడు వారికి మా ప్రేమానురాగాలు చూపించడంలో ముందుంటాము' అని బీహార్ డిప్యూటీ సీఎం విజయ్ సేన సాహెబ్ చెప్పారు. హీరోయిన్ రష్మిక మందన్న మాట్లాడుతూ, 'ఈ చిత్రం కోసం రెండు సంవత్సరాల మీ ఎదురుచూపులు, మీరు ఊహించిన దానికి మించి ఉంటుంది అని నేను చెప్పగలను. ఇంతమంది అభిమానులు పుష్ప ప్రపంచంలోకి రావడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. ఈ ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. ట్రైలర్‌లో మీరు చూసింది కొంచెమే.. సినిమాలో విషయంలో చాలా ఉంది' అని అన్నారు.

> 'పుష్ప1'కు ప్రేమను అందించిన ప్రతి ఒక్కరికీ నా ధన్యవాదాలు. గత కొద్ది సంవత్సరాలుగా దేశంలోనే అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాగా 'పుష్ప 2' ఉండటం, ఆ చిత్రంలో నేను ఒక భాగం కావడం నాకు ఎంతో సంతోషంగా అనిపిస్తుంది. 'పుష్ప1' ఇంతటి విజయం సాధించడానికి ముఖ్య కారణం ప్రేక్షకులే. ఈ సినిమా కూడా అందరి అంచనాలకు మించి ఉంటుంది.
>
> - హీరో అల్లు అర్జున్

పక్కా మాస్ డ్రామాతో 'జీబ్రా'

సత్య దేవ్, డాలీ ధనుంజయ్ నటించిన మల్టీ స్టారర్ 'జీబ్రా'. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పద్మజ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, ఎస్ పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించారు. ప్రియా భవానీ శంకర్, జెన్నిఫర్ పిషినాటో హీరోయిన్స్‌గా నటించిన ఈ చిత్రం ఈనెల 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ ఈశ్వర్ కార్తీక్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఓ కొత్త ప్రపంచాన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు ఆర్టిస్టిక్ ఎలిమెంట్స్‌ని బ్లెండ్ చేయడం కొన్ని కథలకే కుదురుతుంది. 'జీబ్రా'లో అది కుదిరింది. ఇందులో అన్ని ఎమోషన్స్ ఆర్గానిక్‌గా బ్లెండ్ అయ్యాయి. మాస్ ఎలిమెంట్స్, బ్యాంకింగ్ జోనర్, మనీ లాండరింగ్, కామెడీ, లవ్, ఫ్రెండ్షిప్‌తో సినిమా అద్భుతంగా వచ్చింది.



ఈశ్వర్ కార్తీక్

- బ్యాంకింగ్ వరల్డ్‌లో కొన్ని మిస్టేక్స్ జరుగుతుంటాయి. అవి లైమ్ లైట్‌లో పెట్టి ప్రేక్షకులకు చూపించాలనే ఆలోచన వచ్చింది. బ్యాంకింగ్, మనీ లాండరింగ్ ఇలా రెండు వరల్డ్స్ బ్లెండ్ చేసి ఈ కథ రాశాను. ఈ సినిమా స్క్రీన్ ప్లే చాలా ఇంటెలిజెంట్‌గా ఉంటుంది. కానీ రైటింగ్ సింపుల్‌గా ఉండటంతో ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది.
- ఫైనాన్సియల్ క్రైమ్ చుట్టూ ఉండే కథ ఇది. బ్లాక్ అండ్ వైట్ సూచించే యానిమల్‌గా 'జీబ్రా' టైటిల్‌ని పెట్టడం జరిగింది. కొన్ని ట్రూ ఇన్సిడెంట్స్ బేస్ చేసుకొని ఈ కథ రాశాను. ఇది మాస్ డ్రామా.
- ఈ కథకి సత్యదేవ్, డాలీ ధనుంజయ్ అద్భుతంగా న్యాయం చేశారు. వీరిద్దరి పాత్రలు ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తాయి. కథానుగుణంగా ఎక్కడా రాజీపడకుండా మా నిర్మాతలు ఈ సినిమా నిర్మించారు.

సత్యభామగా అలరిస్తా..

యువ కథానాయకుడు అశోక్ గల్లా నటించిన రెండవ సినిమా 'దేవకి నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. ప్రశాంత్ వర్మ కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాలకృష్ణ నిర్మించారు. ఈ సినిమా ఈనెల 22న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మానస వారణాసి మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు..



- మిస్ ఇండియా టైటిల్ గెలిచిన తర్వాత సినిమాల మీద ఆసక్తితో కొన్ని అడిషన్స్ ఇచ్చాను. ఈ సినిమాకి సెలెక్ట్ అయ్యాను. ఇలాంటి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఇది కమర్షియల్ డివైన్ థ్రిల్లర్.
- ఇందులో నా క్యారెక్టర్ పేరు సత్యభామ. పల్లెటూరి అమ్మాయి. ఆ బాడీ లాంగ్వేజ్, స్లాంగ్‌ని ఓన్ చేసుకోవడం కూడా ఛాలెంజింగ్‌గా అనిపించింది. ఈ సినిమా విజయనగరం బ్యాక్ డ్రాప్‌లో ఉంటుంది. సత్యభామ వెరీ ప్లే ఫుల్, లవ్ బుల్, మిస్టీరియస్ గర్ల్. ఎలాంటి కష్టం వచ్చినా ధైర్యంతో నిలబడే అమ్మాయి. ఇది పర్సనల్‌గా నాకు చాలా నచ్చిన క్యారెక్టర్. కథలో నా పాత్ర వెరీ స్ట్రాంగ్‌గా ఉంటుంది. కథలో నాది చాలా కీ రోల్. హీరో అశోక్ వెరీ ప్రొఫెషనల్. ఆయన పాత్ర చాలా బాగుంటుంది.
- భీమ్స్ మ్యూజిక్ అద్భుతంగా ఉంటుంది. మ్యూజిక్‌తో సినిమాని మరో లెవల్‌కి తీసుకెళ్ళారు. ఇప్పటికే పాటలు సూపర్ హిట్ అయ్యాయి. మా నిర్మాత బాలకృష్ణ సినిమాకి ఏం కావాలో అవన్నీ లేదనకుండా సమకూర్చారు. ప్రస్తుతం యువీ క్రియేషన్‌లో తెలుగు, తమిళంలో 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా చేస్తున్నాను.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886